


నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

visit us @ http://epaper.suryaa.com








సంపుటి 18 | సంచిక 164

శనివారం | 5 ఏప్రిల్ 2025 | హైదరాబాద్ | పేజీలు 10+8 | వెల: రూ. 6.50

Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi


అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం : ఉత్తరాయణం - వసంత ఋతువు, చైత్ర శుద్ధ అష్టమి రా.12.31, ఆరుద్ర ఉ.10.27 వర్జ్యం రా.10.14 నుంచి 11.48 వరకు
రాహుకాలం ఉ.9.00 నుంచి 10.30 వరకు దుర్ముహూర్తం ఉ.5.56 నుంచి 7.33 వరకు




## చెల్లింపు వ్యవస్థలకు యూపీఐ
# అనుసంధానం

- బిమ్‌స్టెక్ దేశాలకు ప్రధాని మోడీ ప్రతిపాదనలు
- బిమ్‌స్టెక్‌-ఛాంబర్ ఆఫ్ కామర్స్‌ను ఏర్పాటుచేద్దాం
- మయన్మార్ తీవ్ర ప్రాణ, ఆస్తి నష్టాన్ని చవిచూడటం ఆందోళన కరం
- బ్యాంకాక్ విజన్ 2030కి ఆమోదం తెలిపిన సదస్సు
- థాయ్‌లాండ్ నుంచి శ్రీలంకకు వెళ్లనున్న ప్రధాని మోడీ

థాయ్‌లాండ్ పర్యటనలోఉన్న ప్రధాని మోడీ కీలక ప్రతిపాదన చేశారు. ఈ దేశాల మధ్య చెల్లింపు వ్యవస్థలతో యూపీఐ అనుసంధానం కోసం పిలుపునిచ్చారు. ఈ చర్యతో సభ్యదేశాల మధ్య వ్యాపారం, వాణిజ్యం, పర్యటకం వృద్ధి చెందుతాయని వ్యాఖ్యానించారు.

## బీసీల డిమాండ్లు దశల వారిగా
# పరిష్కరిస్తాం

- కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలి
- రాజ్యాంగం ప్రకారం బీసీల వాటా విద్యా, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాలలో ఎప్పుడిస్తారు?
- జాతీయ బీసీ కార్పొరేషన్ ద్వారా బీసీ కుల వృత్తులకు సబ్సిడీ రుణాలు ఇవ్వాలి
- కేంద్రమంత్రి అమిత్ షాతో బీసీ నేత, ఎంపీ ఆర్. కృష్ణయ్య భేటీ..బీసీ డిమాండ్లపై చర్చలు
- బీసీల డిమాండ్లు న్యాయమైనవే.. దశల వారిగా వాటిని పరిష్కరిస్తాం
- కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షా




బీసీల డిమాండ్లు న్యాయమైనవేనని, వాటిని దశల వారీగా పరిష్కరిస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా వెల్లడించారు. అన్నీ రంగాలలో సమాన వాటా ఇచ్చే ప్రక్రియ ప్రారంభమైందని, ఇంకా పూర్తి స్థాయి న్యాయం చేయడం కోసం ప్రధానమంత్రి దృష్టికి తీసుకొని వెళ్ళి డిమాండ్లను పరిష్కరిస్తామని అమిత్ షా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్యకు హామీ ఇచ్చారు. శుక్రవారం కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో ఆయన భేటీ అయ్యారు. ఈ సందర్భంగా బీసీల డిమాండ్ల పై చర్చలు జరిపారు. అనంతరం కృష్ణయ్య మాట్లాడారు.

## హెచ్‌సీయూలో జింకను
# చంపిన కుక్కలు

రాహుల్ చేతికే ఆ రక్తపు మరకలు : కేటీఆర్




## రాజ్యసభలో వక్ఫ్ బిల్లు
# ఆమోదం

- సభలో అధికార విపక్షాల నడుమ సుదీర్ఘ చర్చ
- అనుకూలంగా 128, వ్యతిరేకంగా 95 ఓట్లు
- ముస్లిమేతరులు ఎక్కువమంది ఉంటారనే భయం వద్దన్న అధికార పక్షం
- మతపరమైన ఉద్రిక్తతలు రెచ్చగొట్టడానికి ఈ బిల్లు తెచ్చారని విపక్షం ఆరోపణలు




## అక్రమ వలసలను
# నియంత్రించండి

- యూనస్కు ప్రధాని మోడీ సూచన
- ప్రధాని నరేంద్ర మోడీతో, బంగ్లాదేశ్ ప్రభుత్వ ప్రధాన సలహాదారు యూనస్ భేటీ




సూర్య వెబ్‌సైట్

సూర్య ఈ - పేపర్

## నష్టాల్లో స్టాక్
# మార్కెట్‌లు



- ట్రంప్ ఎఫెక్ట్...
- 930 పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్
- 345 పాయింట్లు కోల్పోయిన నిఫ్టీ
- 8 శాతానికి పైగా పతనమైన టాటా స్టీల్ షేరు విలువ

వివరాలు-5లో

## కంచ గచ్చిబౌలి భూములపై
# మంత్రుల కమిటీ

- కోర్టు తీర్పులను పరిగణలోకి తీసుకుంటామని ప్రభుత్వం ప్రకటన
- సీఏస్ , రెవెన్యూ , జీహెచ్ఎంసీ, అటవీ , హెచ్ఎండీఏ ఇతర ఉన్నతాధికారులతో డిప్యూటీ సీఎం భట్టి సమావేశం
- ఒకటి రెండు రోజుల్లో విద్యార్థి సంఘాలు, పౌర సంఘాలు, పర్యావరణ వేత్తలతో మంత్రుల కమిటీ సమావేశం

కంచ గచ్చిబౌలి భూముల వివాదంతో ప్రభుత్వం అప్రమత్తమైంది. హెచ్సీయూ వివాదానికి చెక్ పెట్టేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. దీనిపై శుక్రవారం సచివాలయంలో మంత్రుల కమిటీ సభ్యులు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తో సీఎస్ శాంతికుమారి భేటీ అయ్యారు. ఇప్పటికే ముగ్గురు మంత్రులతో ప్రభుత్వం కమిటీ ఏర్పాటు చేసింది. కమిటీలో భట్టి విక్రమార్క, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఉన్నారు.




## మెరుగైన విద్యా వ్యవస్థను
# రూపొందించండి

- జీవన నైపుణ్యాలు పెంపొందించే దిశగా విద్యా విధానం ఉండాలి
- భాష.. విషయ పరిజ్ఞానం రెండూ ప్రధానమే
- విద్యా కమిషన్ సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి




తెలంగాణ రాష్ట్రంలో మెరుగైన విద్యా వ్యవస్థ రూపకల్పనకు సమగ్ర విధాన పత్రం రూపొందించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి విద్యా కమిషన్‌ను ఆదేశించారు. ఉత్తమ విద్యా వ్యవస్థ ఏర్పాటుకు ఎంత వ్యయమైనా వెనుకాడమని సీఎం తెలిపారు. క్షేత్ర స్థాయి పరిస్థితులకు అద్దం పట్టేలా విధానపత్రం ఉండాలని,అదే సమయంలో అది ఆచరణకు దూరంగా ఉండకుండా చూసుకోవాలని సీఎం హితవు పలికారు. ప్రస్తుత విద్యా వ్యవస్థలో లోపాలు.. తీసుకురావల్సిన సంస్కరణలపై ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి ఐసీసీసీలో శుక్రవారం సమీక్ష నిర్వహించారు.

## అంతా ఇంతే!




అప్పుకావాలంటే ప్రపంచ బ్యాంకు బదులు వీళ్లను అడిగితే సరి

## నిరుపేదలందరికీ
# ఆహార భద్రత

- సన్నబియ్యం పంపిణీ చారిత్రాత్మక నిర్ణయం
- ప్రజల నుండి అనూహ్యస్పందన
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి




సన్నబియ్యం పంపిణీతో దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న నిరుపేదలందరికి పూర్తి స్థాయిలో ఆహార భద్రత కల్పించేందుకే సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం ప్రవేశపెట్టామని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. దేశ చరిత్రలోనే సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం చరిత్రాత్మక ఘట్టంగా నిలిచి పోతుందని ఆయన చెప్పారు.

## నిరుద్యోగ యువతీ యువకుల
# ఆకాంక్షలు నెరవేరుస్తాం

- ఆశలు నిజం చేయడానికి ప్రజా ప్రభుత్వం అండగా ఉంటుంది
- యువతకు ఉద్యోగాలు కల్పించడం వల్లనే తెచ్చుకున్న రాష్ట్రానికి అర్థం, పరమార్థం ఉంటుంది.
- స్వయం ఉపాధి పథకాలకు 9 వేల కోట్లు కేటాయించడం చరిత్రలో లేదు
- 59 వేల మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందజేసిన ఘనత ఇందిరమ్మ ప్రభుత్వానిది
- సైబర్ గార్డెన్‌లో అర్హులైన వైటీపీఎస్ నిర్వాసితులకు ఉద్యోగ నియామక పత్రాలు అందజేసిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

నిరుద్యోగ యువతీ యువకుల ఆశల నిజం చేయడానికి ప్రజా ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అన్నారు. హైదరాబాద్ సైబర్ గార్డెన్‌లో శుక్రవారం నల్గొండ జిల్లా దామరచర్ల మండలం వీర్లపాలెం గ్రామం యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ భూ నిర్వాసితుల కోటాలో ఉద్యోగాలు పొందిన జూనియర్ అసిస్టెంట్, జూనియర్ ప్లాంట్ అటెండెన్స్, ఆఫీస్ సబ్ ఆర్డినేట్, హౌస్ కీపర్స్ తో పాటు టీజీపీఎస్సీ ద్వారా ఆర్థిక శాఖలో నూతనంగా నియామకమైన డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్స్‌కు నియామక పత్రాలను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అందజేశారు.




## వక్ఫ్ బిల్లుపై సుప్రీంకోర్టులో
# కాంగ్రెస్ పిటిషన్




- పిటిషన్ దాఖలు చేసిన కాంగ్రెస్ ఎంపీ మొహమ్మద్ జావెద్
- రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తుందని పేర్కొన్న ఎంపి

చారిత్రాత్మక వక్ఫ్ బిల్లుకు పార్లమెంట్ ఆమోదం తెలిపింది. ఇక రాష్ట్రపతి ఆమోదం తర్వాత చట్టంగా మారడమే మిగిలింది. ఈ బిల్లు ముస్లింలకు మేలు చేకూరస్తుందని బీజేపీ నేతృత్వం లోని ఎన్డీయే చెబుతుండగా, ఇది ముస్లింల హక్కుల్ని కాలరాస్తుందని కాంగ్రెస్, ఇతర ఇండీ కూటమి నేతలు ఆరోపిస్తున్నారు.

## సమాజంలో బతకాలంటే మూడు అంశాలపై పట్టు ఉండాలి



తెలంగాణ బ్యూరో[ప్రతినిధి: సమాజంలో బతకాలంటే మూడు అంశాల పై పట్టు ఉండాలని, స్పీకింగ్ స్కిల్స్ మాట్లాడే నైపుణ్యం కలిగి ఉండాలి.. ,రైటింగ్ స్కిల్స్ ఉండాలి డ్రాఫ్ట్ బాగా రాయగలగాలి ,సమస్య వచ్చినప్పుడు ఎలా ఉండాలి అని సమయస్ఫూర్తి కలిగి ఉండాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. శుక్రవారం కోహెడ మండలం నాగ సముద్రాల మోడల్ స్కూల్ లో మహాత్మా గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి పొన్నం. ఈ సందర్భంగా స్కూల్ లో మినరల్ వాటర్ ప్లాంటు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థులకు అందుతున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, భోజనం చేశారు. ఈ సందర్భంగా జాతీయ స్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులను మంత్రి అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. అబ్దుల్ కలాం చెప్పినట్టు కలలు కని వాటిని నిజం చేసుకోండి. స్వాతంత్ర్య పోరాటంలో ప్రజాస్వామికంగా అహింసా పద్ధతిలో ఉద్యమాన్ని నడిపిన బాపూజీ మహాత్మా గాంధీ గారి విగ్రహాన్ని ఆవిష్కరించుకున్నాం. విగ్రహాల నుండి మనం స్ఫూర్తి పొందాలి.. అది మనం సన్మార్గంలో నడవడానికి ఉపయోగపడుతుంది. దానిని భవిష్యత్ జీవితానికి లక్ష్యాన్ని నిర్దేశించుకోని ముందుకు పోవాలి. గ్రామాల్లో జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమాన్ని చేస్తున్నాం. ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతుంది.. అందుకే ఈ కార్యక్రమాన్ని చేపట్టాం. నేను పార్లమెంట్ సభ్యుడిగా ఉన్నప్పుడు 32 మండలాలకు 29 మోడల్ స్కూల్స్ తెచ్చిన.మోడల్ స్కూల్ లో సమస్యలు అన్ని పూర్తి చేస్తాం. లేదంటే మా దృ ష్టికి తీసుకురండి. మీ తల్లిదండ్రులు కష్టపడుతున్నారు.. వారి ఆకాంక్షలకు అనుగుణంగా కష్టపడి చదువుకోండి.. చరిత్ర తెలుసుకోండి. దేశంలో రాష్ట్రంలో పెద్ద పెద్ద వాళ్ళు అంత ప్రభుత్వ పాఠశాలలో చదివిన వారే. టీచర్ల సమస్యలు పరిష్కారం చేశాం.. బదిలీలు ప్రమోషన్ల చేపట్టాం. ప్రజాస్వామ్యం ,రాజ్యాంగం , స్వాతంత్ర్య చరిత్ర ,తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం , సైన్స్ ,సామాజిక స్ఫూవిహ ప్రతి దానిపై మీకు అవగాహన ఉండాలి. విద్యార్థులకు ప్రతి రోజు జరుగుతున్న జాతీయ అంతర్జాతీయ అంశాల పై ప్రతి రోజు ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలి. స్కూల్లో మధ్యాహ్న భోజనం పై ఎప్పటికప్పుడు పరిశీలించాలి.. నాణ్యమైన భోజనం అందించాలి. స్కూల్ లో కొత్త ఫ్యాన్స్ పెడుతున్నాం..

# కంచ గచ్చిబౌలి భూములపై మంత్రుల కమిటీ

- కోర్టు తీర్పులను పరిగణలోకి తీసుకుంటామని ప్రభుత్వం ప్రకటన
- సీఎస్ , రెవెన్యూ , జీహెచ్ఎంసీ, అటవీ , హెచ్ఎండీఏ ఇతర ఉన్నతాధికారులతో డిప్యూటీ సీఎం భట్టి సమావేశం
- ఒకటి రెండు రోజుల్లో విద్యార్థి సంఘాలు, పౌర సంఘాలు, పర్యావరణ వేత్తలతో మంత్రుల కమిటీ సమావేశం



తెలంగాణ బ్యూరో[ప్రతినిధి: కంచ గచ్చిబౌలి భూముల వివాదం తో ప్రభుత్వం అప్రమత్తమైంది. హెచ్సీయూ వివాదానికి చెక్ పెట్టేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. దీనిపై శుక్రవారం సచివాలయంలో మంత్రుల కమిటీ సభ్యులు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తో సీఎస్ శాంతికుమారి భేటీ అయ్యారు. ఇప్పటికే ముగ్గురు మంత్రులతో ప్రభుత్వం కమిటీ ఏర్పాటు చేసింది. కమిటీలో భట్టి విక్రమార్క, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఉన్నారు. కోర్టు తీర్పులను పరిగణలోకి తీసుకుంటామని ఇప్పటికే ప్రభుత్వం ప్రకటన చేసిన విషయం తెలిసిందే. సీఎస్ ,రెవెన్యూ ,జీహెచ్ఎంసీ,అటవీ ,హెచ్ఎండీఏ ఇతర ఉన్నతాధికారులతో డిప్యూటీ సీఎం భట్టి సమావేశం అయ్యారు. ఒకటి రెండు రోజుల్లో విద్యార్థి సంఘాలు, పౌర సంఘాలు, పర్యావరణ వేత్తలతో మంత్రుల కమిటీ సమావేశం కానుంది. ఈ నెల 16 వరకు నివేదిక ఇవ్వాలని సీఎస్ను సుప్రీంకోర్టు ఆదేశించింది. దీంతో నివేదిక తయారీపై సీఎస్ ఫోకస్ పెట్టారు. కంచ గచ్చిబౌలిలో ఎకో పార్క్ ఏర్పాటుకు ప్రభుత్వ ఆలోచన చేస్తోంది. కంచ గచ్చిబౌలి భూముల వివాదంకు చెక్ పెట్టడంపై సర్కార్ దృష్టి సారించింది. ఈ క్రమంలోమ శుక్రవారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో సీఎస్ శాంతి కుమారి, అటవీ,రెవెన్యూ, హెచ్ఎండిఏ సమావేశమయ్యారు. ఈ భేటీలో ప్రధానంగా కంచ గచ్చిబౌలి భూముల వివాదం భవిష్యత్ కార్యాచరణపై చర్చలు జరుపుతున్నారు. శనివారం నుంచి మంత్రుల కమిటీ జేఏసీలతో సంప్రదింపులు జరపనుంది. ఈనెల 16 లోపు పూర్తి నివేదిక ఇవ్వాలని సీఎస్ను సుప్రీం కోర్టు కోరిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో నివేదిక కోసం సీఎస్ కసరత్తు మొదలుపెట్టారు.

కాగా కంచ గచ్చిబౌలి భూముల విషయంలో తమ ఆదేశాలు అమలు చేయకపోతే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వ్యక్తిగతంగా బాధ్యులవుతారని, జైలుకు వెళతారని సుప్రీం కోర్టు తీవ్రంగా వ్యాఖ్యానించింది. అక్కడే చెరువు సమీపంలో తాత్కాలికంగా నిర్మించే జైలుకు వెళ్లాల్సి ఉంటుందని, దానినే కోరుకుంటే తాము చేసేదేమీ ఉండదని, ఎవరూ సహాయం చేయలేరని హెచ్చరించింది. ఇది తీవ్రమైన అంశమని, చట్టాన్ని మీ చేతుల్లోకి తీసుకోవద్దని హెచ్చరించింది. ప్రజా ప్రతినిధుల అనర్హత పిటిషన్లను విచారించడానికి సంసిద్ధమవుతున్న జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ అగస్టీన్ జార్జి మాసిహ్ ధర్మాసనం దృ ష్టికి కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారాన్ని అమికస్ క్యూరీ, న్యాయవాది పరమేశ్వర్ గురువారం ఉదయం తీసుకెళ్లారు. దీనిని సుమోటోగా తీసుకుని అత్యవసరంగా విచారించాలని ప్రత్యేకంగా అభ్యర్థించారు. దానిని పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం.. వివాదాస్పద స్థలానికి స్వయంగా వెళ్లి.. పరిశీలించి.. మధ్యాహ్నం మూడున్నర గంటల్లోపు మధ్యంతర నివేదిక సమర్పించాలని హైకోర్టు రిజిస్ట్రార్ (జ్యుడీషియల్)ను ఆదేశించింది. అయితే, కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై తెలంగాణ హైకోర్టులో విచారణ జరుగుతోందని సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. దాంతో, హైకోర్టు విచారణపై తాము ఎలాంటి స్టే ఇవ్వడం లేదని స్పష్టం చేసిన ధర్మాసనం.. నివేదిక వచ్చిన తర్వాత దాని గురించి ఆలోచిద్దామంటూ బదులిచ్చింది. గడువులోపు నివేదిక అందడంతో గురువారం మధ్యాహ్నం విచారణ చేపట్టింది. తెలంగాణ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది గౌరవ్ అగర్వాల్ వాదనలు వినిపించారు. కంచ గచ్చిబౌలిలో పనులు జరుగుతున్న ప్రాంతం అటవీ శాఖ పరిధిలో లేదు. 30 ఏళ్లుగా ఆ భూమి వివాదంలోనే ఉంది. పిటిషనర్లు గూగుల్ చిత్రాల ఆధారంగా ఆరోపణలు చేస్తున్నారు. అది పారిశ్రామిక ప్రాంతం అని నివేదించారు. ఆయన వాదనలతో విభేదించిన ధర్మాసనం.. అది అటవీ ప్రాంతమా? కాదా? అన్నది కాదని, అక్కడ చెట్ల నరికివేతకు అనుమతి తీసుకున్నారా? అని ప్రశ్నించింది. హైకోర్టు రిజిస్ట్రార్ నివేదికలో తీవ్ర ఆందోళన కలిగించే విషయాలున్నాయి. భారీ ఎత్తున చెట్ల నరికివేత జరిగినట్టు, భారీ యంత్రాలను ఉపయోగించినట్టు తెలుస్తోంది. ఆ విధ్వంస కాండతో అక్కడి నెమళ్లు, జింకలు వేరే ప్రాంతానికి పారిపోయినట్టు చూపించే చిత్రాలను రిజిస్ట్రార్ తన నివేదికలో పొందుపరిచారు. అక్కడ ఒక చెరువు కూడా ఉన్నట్టుంది. రిజిస్ట్రార్ నివేదిక, చిత్రాల ప్రాథమిక పరిశీలన తర్వాత అక్కడ అడవి జంతువులు నివసించేందుకు అనువుగా ఉన్నట్టు అర్థమవుతోంది. అయినా.. అటవీ భూములను గుర్తించడానికి చట్టబద్ధమైన కమిటీని ఏర్పాటు చేయని పక్షంలో ఆయా రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు బాధ్యత వహించాల్సి ఉంటుందని న్యాయస్థానం మార్చి 4వ తేదీనే తన ఉత్తర్వుల్లో పేర్కొంది. అందుకనుగుణంగా తెలంగాణలోనూ అటవీ భూమి కోసం మార్చి 15న కమిటీని ఏర్పాటు చేసినట్టు తెలుస్తోంది.

అక్కడింకా అటవీ భూములను గుర్తించే చట్టబద్ధమైన కసరత్తు ప్రారంభం కాకుండానే చెట్లను నరికివేయడంలో ఆంతర్యమేమిటి? అంటూ జస్టిస్ బీఆర్ గవాయ్ ఆందోళన వ్యక్తం చేశారు. రెండు, మూడు రోజుల్లోనే వందెకరాల్లో చెట్ల నరికివేత ఎంతో తీవ్రమైన అంశమని వ్యాఖ్యానించారు. ఎవరు ఎంతటి స్థాయిలో ఉన్నా.. చట్టానికి అతీతులు కాదని వ్యాఖ్యానించారు.

సుమోటోగా కేసు నమోదు చేయాలని ఆదేశించింది. ఆ మేరకు పిటిషన్ తయారు చేయాలని అమికస్ క్యూరీకి నిర్దేశించింది. మహారాష్ట్రలో చెట్ల నరికివేతపై దాఖలైన పిటిషన్పై ఇప్పటికీ విచారణ జరుగుతోందని స్పష్టం చేశారు. అదే సమయంలో ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా విద్యార్థులు పెద్దఎత్తున నిరసన తెలుపుతున్నారని విద్యార్థుల తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది గోపాల్ శంకర నారాయణ్ ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలోనే, తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు కంచ గచ్చిబౌలిలో ఎటువంటి కార్యకలాపాలు చేపట్టకూడదని ధర్మాసనం ఆదేశించింది.

## హెచ్‌సీయూలో జింకను చంపిన కుక్కలు

- రాహుల్ చేతికే ఆ రక్తపు మరకలు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



తెలంగాణ బ్యూరో[ప్రతినిధి: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో కుక్కల దాడిలో ఓ జింక ప్రాణాలు కోల్పోయిన ఘటనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. ఆ రక్తపు మరకలు కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ చేతికే అంటాయని కేటీఆర్ పేర్కొన్నారు. అత్యాశతో కూడిన కాంగ్రెస్ ప్రభుత్వం జింకలకు నెలవైన కంచ గచ్చిబౌలి భూములను ధ్వంసం చేసింది. దీంతో ఆ ప్రాంతంలో కుక్కలు విచ్చలవిడిగా సంచరిస్తూ జింకను చంపాయి. కంచ గచ్చిబౌలి మినీ ఫారెస్టు రేవంత్ రెడ్డి బుద్ధిహీనంగా ధ్వంసం చేయడం వల్ల విలువైన వృక్ష, జంతుజాలం నష్టపోయింది అని కేటీఆర్ పేర్కొన్నారు. వన్యప్రాణుల ఈ దారుణ హత్యపై దృష్టి సారించాలని సుప్రీంకోర్టును అభ్యర్థిస్తున్నట్లు కేటీఆర్ తెలిపారు. కంచ గచ్చిబౌలిలో 100 ఎకరాల్లో చెట్లను నరికివేయడంతో.. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్ హాస్టల్ వైపు జింక వచ్చింది. జింకను చూసిన కుక్కలు మొరుగుతూ.. దానిపై విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డాయి. కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడిన జింకను హెచ్సీయూ విద్యార్థులు, సెక్యూరిటీ సిబ్బంది.. వెటర్నరీ ఆస్పత్రికి తరలించారు. జింకకు తీవ్ర రక్తస్రావం జరిగింది. దీంతో అది చనిపోయింది. ఇక చాలా జింకలు జనావాసాల్లోకి వస్తున్నాయి. ఆ జింకలను జనాలు చేరదీసి.. వాటికి నీళ్లను అందిస్తున్నారు. మూడు రోజుల్లో 100 ఎకరాల్లో పచ్చని చెట్లను నరికివేయడంతో రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై జనాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పర్యావరణానికి ముప్పు కలిగించే విధంగా రేవంత్ రెడ్డి ప్రవర్తిస్తున్నారని ధ్వజమెత్తుతున్నారు.

## బీఆర్ఎస్ నేతలు ఒళ్ళు దగ్గర పెట్టుకుని మాట్లాడాలి



తెలంగాణ బ్యూరో[ప్రతినిధి: జనగామ జిల్లాలోని చిల్పూర్ మండలం, చిన్న పెండ్యాలలో నిర్వహించిన మీడియా సమావేశంలో రాజకీయ వేడి మరింత పెరిగింది. ఈ సమావేశంలో బీజేపీ నేత, మాజీ ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డిపై సంచలన వ్యాఖ్యలు చేశారు. కడియం శ్రీహరి మాట్లాడుతూ, పల్లా రాజేశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రాజయ్యలు చౌకబారు విమర్శలు మానుకోవాలి. ఒళ్ళు దగ్గర పెట్టుకుని మాట్లాడాలి. మాటల్లో అహంకారం, బలుపు తగ్గించుకోవాలి అని ఘాటుగా విమర్శించారు. బీఆర్ఎస్ పాలనపై ధ్వజమెత్తిన కడియం శ్రీహరి, కేసీఆర్ వెంటే తిరిగి బీఆర్ఎస్ పార్టీని భ్రష్టు పట్టించావు. అధికారాన్ని, కేసీఆర్ను అడ్డంపెట్టుకుని ఆస్తులు కూడబెట్టుకున్నావు. అవినీతి, అక్రమాలతో అధికార దుర్వినియోగానికి పాల్పడ్డ వ్యక్తివి నువ్వు. నీకు నా గురించి మాట్లాడే నైతిక హక్కు లేదు అని తీవ్ర స్థాయిలో విమర్శించారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ఎలా గెలిచావో అందరికీ తెలుసు. నీలాంటి వెధవల వల్లే కేసీఆర్ పరిపాలన పక్కదారి పట్టింది. ప్రజలు కేసీఆర్కు గుణపాఠం చెప్పారు అని కడియం శ్రీహరి ఘాటుగా వ్యాఖ్యానించారు

## బీసీ రిజర్వేషన్ల దీక్షకు ఎంపీల మద్దతు

- ఎంపీలు వద్దిరాజు, సురేష్ రెడ్డి
- సిపిఐ నాయకులు నారాయణ, మాజీ యంపి అజీజ్ పాషాలు ఓబీసీ ఆజాది దీక్షకు సంఘీభావం
- రిజర్వేషన్లు సాధించేంతవరకు పోరాటం కొనసాగిస్తాం
- గ్రామాలైన వదిలేస్తాం రిజర్వేషన్లు సాధిస్తాం: బీసీ హిందూ మహాసభ అధ్యక్షులు బత్తుల సిద్దేశ్వర్
- రిజర్వేషన్లు సాధించేంతవరకు పోరాటం: ఓబీసీ ఆజాది ఫెడరేషన్ అధ్యక్షులు జక్కని సంజయ్




తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: దేశ జనాభాలో సగానికి పైగా ఉన్న ఓబీసీలకు అన్ని రంగాలలో తీవ్ర అన్యాయం జరుగుతుండడం తీవ్ర విచారకరమని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ కే.ఆర్.సురేష్ రెడ్డి, డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవిచంద్రలు అన్నారు.చట్టసభలలో ఓబీసీలకు రిజర్వేషన్స్ కల్పిస్తూ, కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలంటూ హిందూ బీసీ మహాసభ జాతీయ అధ్యక్షులు బత్తుల సిద్ధేశ్వర్, ఓబీసీ ఆజాది ఫెడరేషన్ వ్యవస్థాపకులు జక్కని సంజయ్ తదితరులు ఆమరణ దీక్ష చేపట్టారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్ ప్రాంగణంలో ఈనెల ఒకటవ తేదీ నుంచి కొనసాగుతున్న ఈ దీక్షా శిబిరాన్ని ఎంపీలు సురేష్ రెడ్డి, రవిచంద్రలు శుక్రవారం మధ్యాహ్నం సందర్శించి తమ సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఓబీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్స్ కల్పించాలని కోరుతూ రాష్ట్ర ఏర్పాటు జరిగిన తొలినాళ్లలోనే తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు అసెంబ్లీలో తీర్మానించి కేంద్రానికి నివేదించడాన్ని గుర్తు చేశారు.మహిళలతో పాటుగా బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్స్ అమలు చేయాల్సిందేనని వారు స్పష్టం చేశారు.అయితే, దీనికి ముందు దేశవ్యాప్తంగా జనాభా లెక్కలతో పాటు కులగణన కూడా చేపట్టాల్సి ఉంటుందన్నారు.దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 80ఏండ్లు సమీపిస్తున్నా కూడా ఓబీసీలకు కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖ లేకపోవడం శోచనీయమన్నారు.రాష్ట్రంలో మంత్రివర్గ విస్తరణ సందర్భంలో ఖాళీగా ఉన్న ఆరింటిలో నాలుగు పదవులను బీసీలకే ఇవ్వాలని ఎంపీలు సురేష్ రెడ్డి, రవిచంద్రలు కాంగ్రెస్ అధిష్టానాన్ని డిమాండ్ చేశారు. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికలలో 42%రిజర్వేషన్స్ అమలునకు కేంద్రంపై కాంగ్రెస్ చిత్తశుద్ధితో పోరాడితే తమ పార్టీ బీఆర్ఎస్ రాజ్యసభలో సంపూర్ణ మద్దతునిస్తుందని ఎంపీలు సురేష్ రెడ్డి, రవిచంద్రలు హామీనిచ్చారు.సీపీఐ నాయకులు నారాయణ, అజీజ్ పాషా మాట్లాడుతూ దేశంలో సగ భాగానికి పైగా ఉన్న బీసీలు అన్ని రంగాలలో అభివృద్ధికి దూరంగా ఉన్నారని బ్రిటిష్ ప్రభుత్వ కాలంలో 1931 వరకు బీసీల లెక్కలు జరిగాయని కానీ స్వతంత్ర దేశంలో బీసీల లెక్కలు లేవని, లెక్కలు లేకపోవడం వలన హక్కులు లేవని, ఈ దేశం గణతంత్ర దేశంగా పరిడావిళ్ళలంటే కులాల లెక్కలు చేసి, హక్కులు పంచాలని కోరారు, ఈ పోరాటానికి తమ పార్టీ పూర్తి మద్దతును తెలువుతుందని ప్రకటించారు. ఈ దీక్షలో రజక రిజర్వేషన్స్ పోరాట సమితి అధ్యక్షుడు చాపర్తి కుమార్ గాడ్గే, రాష్ట్ర అధ్యక్షులు పర్వతం సతీష్, విప్లవ సామాజికవేత్త భండారి గంగాధర్, అంబేడ్కర్ అజాదీ సంఘం అధ్యక్షుడు కొంగర నరహరి, సామాజిక విప్లవనేత గడ్డం మోహన్ రెడ్డి, ఓబీసీ ఆజాదీ ఫెడరేషన్ నాయకులు పలువురు నాయకులు పాల్గొన్నారు.

## రేవంత్ రెడ్డి అక్రమ కేసులు బనాయిస్తున్నారు

బీఆర్ఎస్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ వ్యాఖ్యలు



తెలంగాణ బ్యూరో[ప్రతినిధి: తెలంగాణ భవన్లో బీఆర్ఎస్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో పోలీసులు ప్రతిపక్షాల పైనే దృష్టి సారిస్తున్నారని ఆరోపించారు. ఈరోజు ఉదయం సాధారణ దుస్తులతో తెలంగాణ భవన్కు పోలీసులు వచ్చారని, ఎందుకు వచ్చారని ప్రశ్నించగా, దిలీప్ కొణతం, మన్నె క్రిశాంక్లకు నోటీసులు ఇచ్చేందుకు వచ్చామని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం రేవంత్ రెడ్డి అక్రమ కేసులు బనాయిస్తున్నారని విమర్శించారు. తెలంగాణలో లక్ష మంది పోలీసులు ఉన్నా, మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. హోం శాఖ ముఖ్యమంత్రి దగ్గరే ఉండి కూడా పరిస్థితి ఇలా ఉందని పేర్కొన్నారు. 400 ఎకరాల కంచ గచ్చిబౌలి భూములను కబ్జా చేసేందుకు రేవంత్ రెడ్డి బిజీగా ఉన్నారని ఆరోపించారు. సుల్తాన్ బజార్లో చిన్నారి పై జరిగిన అత్యాచారం, హత్య ఘటనలో ఇప్పటికీ నిందితుడికి శిక్ష పడలేదని చెప్పారు. కేసీఆర్ హయంలో దిశ ఎన్కౌంటర్ జరిగిందని, దిశ చట్టం అమలులోకి వచ్చిందని గుర్తు చేశారు. ప్రస్తుతం ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయడంలో ఈ ప్రభుత్వం విఫలం అయ్యిందని ఆరోపించారు. మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాల విషయంలో మహిళా కమిషన్ మౌనంగా ఉందని పేర్కొన్నారు.

## 42 % బీసీ రిజర్వేషన్లను రాజకీయం చేయకండి

- డైవర్షన్ పాలిటిక్స్ లో భాగంగానే ఢిల్లీలో బీసీల సభ
- స్థానిక సంస్థల్లో 42 % రిజర్వేషన్ల అమలుకు పరిపూర్ణ ప్రయత్నాలు
- త్వరలోనే తదుపరి కార్యాచరణ ప్రకటన
- బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షులు దాసు సురేష్




తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్ లో పేర్కొన్న విధంగా విద్య,ఉద్యోగ,రాజకీయాల్లో, ప్రభుత్వ కాంట్రాక్టుల్లో, పార్టీపరమైన అవకాశాలలో, 42 % రిజర్వేషన్లను ఇస్తామన్న హామీని దాటవేసే దిశగా కొనసాగుతూ,ఈ అంశాన్ని తమ రాజకీయ ప్రయోజనాల కోసం ఆయుధంగా వాడుకోవడాన్ని తీవ్రంగా తప్పుపడుతున్నామని బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షులు దాసు సురేశ్ పేర్కొన్నారు. బీసీ రాజ్యాధికార సమితి గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షురాలు బండారు పద్మావతి ఆధ్వర్యంలో జరిగిన బీసీ మేధావుల , విద్యావంతుల, ఉద్యమకారుల సమావేశంలో దాసు సురేశ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. బీసీ హక్కుల స్థాపన కోసం పాటుపడుతున్న నాయకులు, మేధావులు,క్షేత్రస్థాయి కార్యకర్తల సమక్షంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లను అమలు చేసే అంశంపై ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.తెలంగాణ ప్రభుత్వం 42 % రిజర్వేషన్ల అమలుకు ప్రయత్నాలు ముమ్మరం చేయకుండానే, అసెంబ్లీలో ఆమోదం పొందిన బీసీ బిల్లులకు గవర్నర్ ఆమోదం పొందకుండానే, 42 % రిజర్వేషన్లను పెంచుతూ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయకుండానే ఢిల్లీలో ధర్నాలను చేస్తుండటం ప్రభుత్వ నిబద్ధతను శంకించేలా ఉందన్నారు.డైవర్షన్ పాలిటిక్స్ లో భాగంగానే తెలంగాణ ప్రభుత్వం అమలు చేయాల్సిన 42 శాతం రిజర్వేషన్లను తుంగలో తొక్కి, కేంద్రంపై దుమ్మెత్తటం ఏ మేరకు సమంజసమని తెలిపారు. 5 సంవత్సరాలు బీసీలకు లక్ష కోట్ల బడ్జెట్ కేటాయిస్తామన్న కాంగ్రెస్ హామీ, ఇప్పటివరకు కేవలం 20 వేల కోట్లని ప్రతిపాదించి, కనీసం ఐదు కోట్లు కూడా ఖర్చు చేయలేని దయనీయ స్థితిలో ప్రభుత్వం కూరుకుపోయిందన్నారు.ఈ ప్రభుత్వంలో బీసీలకు ఎటువంటి ప్రాధాన్యత లేదని కేవలం 42 % బీసీ రిజర్వేషన్ల ప్రచారంతోనే కాలాన్ని వెల్లబుచ్చుతున్నారని దాసు సురేష్ తీవ్రంగా మండిపడ్డారు. త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణంగా తమ కర్తవ్యాన్ని నిర్వర్తించి 42 % రిజర్వేషన్లు అమలును ఎన్నికల నోటిఫికేషన్ లో ప్రకటిస్తే అందుకు అవసరమైన అమలు విషయంలో ఇబ్బందులు ఎదురైతే కేంద్రాన్ని నిలదీయటానికి తాము సైతం అప్పుడు కలిసి వస్తాం అన్నారు. జరుగుతున్న పరిణామాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లే విధంగా త్వరలోనే తమ తదుపరి కార్యాచరణను ప్రకటిస్తాం అన్నారు. ఈ సమావేశంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం, జాతీయ ప్రధాన కార్యదర్శి కోల జనార్దన్ గౌడ్ , ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం, నిరుద్యోగ బీసీ జేఏసీ చైర్మన్ నీలం వెంకటేష్, బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర కార్యదర్శులు ముంజాల రాజేందర్ గౌడ్, పెదకాసు కుమారస్వామి యాదవ్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ వీరేందర్ గౌడ్, టీడీపీ పార్టీ ఓబీసీ సెల్ ఉపాధ్యక్షులు మంద వెంకటస్వామి, బీసీ రాజ్యాధికార సమితి గ్రేటర్ హైదరాబాద్ నాయకులు తాళ్ళ భాగ్యలక్ష్మి, రామగిరి ప్రకాష్, శారదా, రవి తదితరులు పాల్గొన్నారు.

## ఎంఐఎం అభ్యర్థిగా మీర్జా రియాజ్ ఉల్ అసన్

- గతంలో 2009, 2016లో కార్పొరేటర్‌గా గెలుపు
- తాజాగా హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటన



తెలంగాణ బ్యూరో[ప్రతినిధిః హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎంఐఎం అభ్యర్థిగా మీర్జా రియాజ్ ఉల్ అసన్ ఎఫెండ్ ఎంపికయ్యారు.. గతంలో 2009లో నూర్ ఖాన్ బజార్, 2016 లో డబీర్ వురా కార్పొరేటర్ గా గెలుపొందిన మీర్జా రియాజ్. 2019 లో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీగా ఎంఐఎం అవకాశం అవకాశం ఇచ్చింది.. 2023 లో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీగా పదవి కాలం పూర్తంది.. ఎంఐఎం తిరిగి హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా అవకాశం ఇచ్చింది.

కాగా.. ఇప్పటికే బీజేపీ అభ్యర్థిగా గౌతమ్ రావుని పార్టీ ప్రకటించింది. ఇప్పటి వరకు ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. పోటీలో ఉండబోమని ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ ఖరారు చేసింది. కాంగ్రెస్ పార్టీ మద్దతుతో నేడు ఎంఐఎం అభ్యర్థి, బీజేపీ అభ్యర్థి నామినేషన్ దాఖలు చేసే అవకాశం ఉంది.. ఇప్పటివరకు దాఖలైన ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు పోటీ నుంచి తప్పుకుంటే.. ఎంఐఎం, బీజేపీ మధ్య పోటీ ఉంటుంది. హైదరాబాద్ జిల్లా పరిధిలోని కార్పొరేటర్లు, ఎక్స్ అఫిషియో సభ్యులు ఎన్నికల్లో పాల్గొంటారు. హైదరాబాద్ లో కార్పొరేటర్లు, ఎక్స్ అఫిషియో సభ్యులతో కలిపి 110 మంది ఓటర్లు ఉన్నారు.. 81 మంది కార్పొరేటర్లు, 29 మంది ఎక్స్ అఫిషియో సభ్యులు ఉన్నారు. ఎక్స్ అఫిషియో సభ్యుల్లో 6 మంది ఎంపీలు, 8 మంది ఎమ్మెల్సీలు, 15 మంది ఎమ్మెల్యేలు ఉంటారు. ఎంఐఎం నుంచి 1 ఎంపీ, 7 ఎమ్మెల్యేలు, 1ఎమ్మెల్సీలు, 40 కార్పొరేటర్లతో కలిపి 49 మంది ఓటర్లు ఉన్నారు.. కాంగ్రెస్ నుంచి 1 ఎంపీ, 4 ఎమ్మెల్సీలు, 2 ఎమ్మెల్యేలు, 7 కార్పొరేటర్లతో కలిపి 14 ఓటర్లు, బీఆర్ఎస్ నుంచి 25 మంది ఓటర్లు, బీజేపీ నుంచి 22 ఓటర్లు ఉన్నారు.

## దేవాదుల ప్రాజెక్టు అభివృద్ధికి కేసీఆర్ కృషి

- స్టేషన్‌ఘన్‌పూర్ ప్రజలు ఉప ఎన్నికల కోసం సిద్ధంగా ఉన్నారు
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి



తెలంగాణ బ్యూరో[ప్రతినిధి : జనగామ జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, దేవాదుల ఫేజ్ 1, ఫేజ్ 2 ప్రాజెక్టును పూర్తిచేసి, ఫేజ్ 3లో మూడు మోటర్లతో 1800 క్యూసెక్కుల నీటి సరఫరా కోసం ఏర్పాట్లు చేసింది కేసీఆర్ ప్రభుత్వం అని తెలిపారు. అయితే, ఉమ్మడి వరంగల్ జిల్లాలో 11 మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు మంత్రులు ఉన్నప్పటికీ, ఆరు నియోజకవర్గాలకు నీరందించే దేవాదుల లోయర్ డ్యామ్కు కేవలం 6 కోట్లు కేటాయించలేని కాంగ్రెస్ ప్రభుత్వం అజ్ఞానపు పాలకుల చేతిలో ఉంది అంటూ విమర్శలు చేశారు. చలివాగు వద్ద ఉద్యోగులు 30 రోజులు సమ్మె చేసి మోటర్లు బంద్ చేస్తే, రైతులకు నీరు ఇవ్వలేని ప్రభుత్వం చేతగాని ప్రభుత్వం అంటూ మండిపడ్డారు. నేను ఇరిగేషన్ అధికారులతో, సెక్రటేరియట్ అధికారులతో, ఇరిగేషన్ మంత్రితో మాట్లాడి 6 కోట్ల రూపాయలు మంజూరు చేయించాను. కానీ కడియం శ్రీహరి మాత్రం స్టైల్గా మేమే నీరందిస్తున్నామని ప్రచారం చేసుకుంటున్నారు అని వ్యాఖ్యానించారు. గండిరామరం రిజర్వాయర్ నుండి స్టేషన్ఘన్పూర్లో ఒక్క ఎకరానికి కూడా నీరు పారదు. కడియం శ్రీహరి డ్రామా చేయడానికి మాత్రమే రిజర్వాయర్ వద్దకు వచ్చారు అని పల్లా రాజేశ్వర్ రెడ్డి ఆరోపించారు. తాను సీనియర్ అని, దేవాదుల ప్రాజెక్టు తాను తెచ్చానని చెప్పుకునే కడియం, మేమేసిన ఓటుతో గెలిచి ఇప్పుడు రాజకీయ నాటకాలు ఆడుతున్నారు అని మండిపడ్డారు. స్టేషన్ఘన్పూర్ ప్రజలు ఉప ఎన్నిక ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారు అని పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. ఈ నెల 27న జరగబోయే బహిరంగ సభ గురించి ప్రస్తావిస్తూ, ఈ సభ ప్రపంచవ్యాప్తంగా జరిగిన ఐదవ మహాసభగా నిలవబోతుంది. జనగామ జిల్లా నుంచి బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలి రావాలి అని పిలుపునిచ్చారు.

## పాడి రైతులకు గుడ్ న్యూస్ చెప్పిన విజయ డెయిరీ

ఆవు, గేదె పాల ధరల్లో మార్పులు చేయాలని విజయ డెయిరీ నిర్ణయం

తెలంగాణ బ్యూరో[ప్రతినిధిః తెలంగాణ పాడి పరిశ్రామాభివృద్ధి సమాఖ్య (విజయ డెయిరీ) సంచలన నిర్ణయం తీసుకుంది. గేదె, ఆవు పాల ధరలను సవరించినట్లు ప్రకటించింది.

రాష్ట్రవ్యాప్తంగా ప్రతి రోజూ వేల మంది పాడి రైతుల నుంచి లక్షల లీటర్ల పాలను విజయ డెయిరీ సేకరిస్తోంది. మారిన కాలానికి అనుగుణంగా ధరల్లో మార్పులు చేయాలని భావించింది. దీంతో పాల ధర మార్పునకు సిద్ధం అయ్యింది. ఈ మేరకు గేదె పాల ధర పెంచగా.. ఆవు పాల ధరను తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకూ వెన్న శాతం 7 ఉన్న గేదె పాలు లీటరుకు రూ.56 చెల్లించగా.. తాజాగా దాన్ని రూ.59.50కి పెంచింది. అలాగే 10 శాతం వెన్న ఉన్న గేదె పాల ధర లీటర్కు రూ.80 నుంచి రూ.84.60కి పెంచింది. మరోవైపు 3 శాతం వెన్న ఉన్న ఆవు పాల ధర ఇప్పటివరకూ రూ.40 ఉండగా.. తాజాగా రూ.36.50కు తగ్గించింది. ధరల సవరణ ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వచ్చినట్లు విజయ డెయిరీ వెల్లడించింది.

అయితే ధరల మార్పుతో గేదె పాలు విక్రయించే రైతులకు లబ్ధి చేకూరినప్పటికీ, ఆవు పాలు అమ్మే అన్నదాతలకు మాత్రం కొంత నష్టం కలిగే అవకాశం ఉంది. దీంతో ఆవు పాలు విక్రయించే వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది.

## బట్టబయలైన కాంగ్రెస్, బీఆర్ఎస్ ఫెవికాల్ బంధం



తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కుమ్మక్కు రాజకీయాలకు పాల్పడుతున్నాయంటూ భారతీయ జనతా పార్టీ చేస్తున్న ఆరోపణలు నిజమేనని తేలిపోయింది. ఆ రెండు పార్టీల మధ్య ఫెవికాల్ బంధం కొనసాగుతోంది. డీలిమిటేషన్ పేరుతో మొన్న కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒక్కటైనయ్. త్వరలో తెలంగాణలో కలిసే బహిరంగ సభను నిర్వహించబోతున్నయి. ఈ బహిరంగ సభ ఏర్పాట్లు రెండు పార్టీలు కలిసే పనిచేస్తున్నయ్. ఎవరిని పిలవాలో కలిసే డిసైడ్ చేస్తున్నాయి. అట్లాగే నిన్న పార్లమెంట్ లో వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుపై నిర్వహించిన ఓటింగ్ సందర్భంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒక్కటై కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటేసినయ్. ఈరోజు జీహెచ్ ఎంసీ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్ కు చివరి రోజు. అయినప్పటికీ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు తమ అభ్యర్థులను నిలబెట్టకుండా మజ్లిస్ అభ్యర్థికి మద్దతుగా నిలిచాయి. ఇక అవినీతి కేసుల సంగతి సరే సరి. ఎన్నికలకు ముందు కాళేశ్వరం ప్రాజెక్టులో కేసీఆర్ కుటుంబం రూ.లక్ష కోట్లు అవినీతికి పాల్పడ్డారని ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిసహా కాంగ్రెస్ నాయకులంతా కోడైకూశారు. విద్యుత్ కొనుగోళ్ల ఒప్పందం, ధరణి పోర్టల్ లో వేల కోట్ల అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. ఫార్ములా ఈ రేసులో కేటీఆర్ అవినీతి చేశారని పదేపదే ప్రచారం చేశారు. అధికారంలోకి రాగానే కేసీఆర్ కుటుంబాన్ని జైలుకు పంపుతామని కాంగ్రెస్ నేతలు... తీరా గెలిచాక డబ్బు సంచులకు అమ్ముడుపోయి బీఆర్ఎస్ తో కుమ్మక్కై అవినీతి కేసులన్నీ నీరుగారుస్తున్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ కుమ్మక్కు రాజకీయాలకు ఇంతకంటే నిదర్శనం ఏం కావాలి?

ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించడంవల్ల గత జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీసీలు పోటీ చేయాల్సిన 30 చోట్ల మజ్లిస్ పోటీ చేసి గెలిచింది. ఇప్పుడు బీసీ జాబితా ముసుగులో ముస్లింలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించడంవల్ల విద్య, ఉద్యోగాల్లో బీసీలకు తీరని అన్యాయం జరగబోతోంది. ఈ రెండు పార్టీలు కలిసి హైదరాబాద్ ను మజ్లిస్ పార్టీ చేతుల్లో పెట్టడానికి సిద్ధమయ్యాయి. కాంగ్రెస్, బీఆర్ఎస్ చీకటి ఒప్పందాలు, కుమ్మక్కు రాజకీయాలపై తెలంగాణ సమాజం ఆలోచించాలని కోరారు.

సూర్య
హైదరాబాద్
శనివారం
5 ఏప్రియల్ 2025



# సంపాదకీయం



suryaeditpage@gmail.com

2025 ఏప్రిల్ 2న, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ "లిబరేషన్ డే"గా ప్రకటించి, అమెరికా దిగుమతులపై విస్తృతమైన సుంకాలను విధించారు. ఈ నిర్ణయం ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావాన్ని చూపింది, ముఖ్యంగా అమెరికా స్టాక్ మార్కెట్లు భారీగా పడిపోయాయి. అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన ఈ సుంకాలు అన్ని దిగుమతులపై కనీసం 10% సుంకం విధించాయి, కొన్ని దేశాలపై ఇది మరింత ఎక్కువగా ఉంది. చైనాపై 34%, యూరోపియన్ యూనియన్పై 20% సుంకాలు విధించబడ్డాయి. ఈ నిర్ణయం వెనుక ఉన్న ప్రధాన కారణం అమెరికా యొక్క వాణిజ్య లోటును తగ్గించడం మరియు దేశీయ తయారీ రంగాన్ని ప్రోత్సహించడం. అయితే, ఈ విధానం ప్రపంచ వాణిజ్య వ్యవస్థను తీవ్రంగా ప్రభావితం చేసింది.

సుంకాల ప్రకటన తర్వాత, అమెరికా స్టాక్ మార్కెట్లు భారీ నష్టాలను చవిచూశాయి. డౌ జోన్స్ ఇండస్ట్రియల్ అవరేజ్ 1,679 పాయింట్లు (4%) పడిపోయింది, నాస్డాక్ కంపోజిట్ 6% తగ్గింది, మరియు ఎస్ అండ్ పి 500 పాయింట్లు అంటే 4.8% పడిపోయింది. ఇది 2020 కోవిడ్-19 మహమ్మారి తర్వాత స్టాక్ మార్కెట్లలో జరిగిన అతిపెద్ద ఒక్కరోజు పతనం. ఈ పతనం వెనుక ప్రధాన కారణం సుంకాల వల్ల వస్తువుల ధరలు పెరగడం, వాణిజ్య యుద్ధ భయాలు, మరియు ఆర్థిక మాంద్యం సంభవించే అవకాశాలు.

## ట్రంప్ భస్మాసుర హస్తం!

ట్రంప్ సుంకాల నిర్ణయంపై ప్రపంచ దేశాలు తీవ్రంగా స్పందించాయి. కెనడా ప్రధాన మంత్రి మార్క్ కార్నీ ఈ నిర్ణయాన్ని తీవ్రంగా విమర్శించారు మరియు అమెరికా నుండి దిగుమతులపై ప్రతిస్పందన సుంకాలు విధిస్తామని ప్రకటించారు. చైనా కూడా ఈ నిర్ణయాన్ని ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యు టి ఓ ) నియమాలను ఉల్లంఘించడంగా అభివర్ణించింది మరియు తగిన చర్యలు తీసుకుంటామని ప్రకటించింది. ఇటలీ ప్రధాని జార్జియా మెలోని అమెరికాతో సుంకాలను తగ్గించే దిశగా చర్చలు జరపాలని కోరారు. ఆర్థిక నిపుణులు ఈ సుంకాల నిర్ణయాన్ని అమెరికా ఆర్థిక వ్యవస్థకు హానికరంగా అభివర్ణిస్తున్నారు. వారు ఈ నిర్ణయం ద్రవ్యోల్బణాన్ని 4% పైగా పెంచి, వ్యాపార కార్యకలాపాలను దెబ్బతీసి, పెట్టుబడులను తగ్గించవచ్చని హెచ్చరిస్తున్నారు. గోల్డ్మన్ సాక్స్ వంటి సంస్థలు ఆర్థిక మాంద్యం సంభవించే అవకాశాలను 35% వరకు పెంచాయి. ఈ సుంకాల నిర్ణయం అమెరికాతో పాటు ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై దీర్ఘకాలిక ప్రభావాలను చూపవచ్చు. అమెరికా దిగుమతులపై సుంకాలు విధించడం వల్ల వస్తువుల ధరలు పెరగడం, వినియోగదారుల ఖర్చులు పెరగడం, మరియు వ్యాపార పెట్టుబడులు తగ్గడం జరుగుతుంది. ఇవి ఆర్థిక వృద్ధిని తగ్గించి, ఉద్యోగ అవకాశాలను తగ్గించవచ్చు. అంతర్జాతీయంగా, ఇతర దేశాలు కూడా ప్రతిస్పందన సుంకాలు విధించడం వల్ల ప్రపంచ వాణిజ్య యుద్ధం ముదిరి, ఆర్థిక మాంద్యం సంభవించే అవకాశాలు ఉన్నాయి.

ఈ ఒక్క చర్య మాత్రమే కాదు,ట్రంప్ అధికారంలోకి వచ్చిన తర్వాత తీసుకున్న నిర్ణయాల వల్ల ట్రంప్ స్వయంగా అమెరికా విధ్వంసానికి పూనుకున్నాడేమో అన్న అనుమానం రాక మానదు. ట్రంప్ ప్రభుత్వం వేలాది ఫెడరల్ ఉద్యోగులను తొలగించింది, ముఖ్యంగా యు ఎస్ ఎయిడ్ వంటి సంస్థలను తగ్గించడం ద్వారా. ఈ చర్యలు ప్రభుత్వ సేవలను దెబ్బతీశాయి, ముఖ్యంగా ఆరోగ్యం, విద్య, మరియు పేదరిక నిర్మూలన వంటి రంగాల్లో. ఈ తొలగింపులు ప్రభుత్వ సేవల నాణ్యతను తగ్గించి, ప్రజల నమ్మకాన్ని కోల్పోయేలా చేశాయి. ట్రంప్ తీసుకున్న తొందరపాటు విదేశాంగ విధానాలు అమెరికా యొక్క అంతర్జాతీయ సంబంధాలను దెబ్బతీశాయి. అంతర్జాతీయ ఒప్పందాల నుండి వైదొలగడం, మిత్ర దేశాలతో వాణిజ్య వివాదాలు, మరియు అనూహ్య నిర్ణయాలు అమెరికా విశ్వసనీయతను తగ్గించాయి. ఈ విధానాలు ప్రపంచంలో అమెరికా నాయకత్వ స్థానాన్ని బలహీనపరిచాయి.

ట్రంప్ తీసుకున్న నిర్ణయాలు అమెరికా సమాజంలో విభజనలను పెంచాయి. వలసదారులపై కఠిన చర్యలు, మైనారిటీలపై వివక్ష, మరియు మీడియాపై దాడులు సమాజంలో అనిశ్చితిని, భయాన్ని పెంచాయి. ఈ విధానాలు ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీశాయి. ట్రంప్ ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణ నిబంధనలను సడలించడం, పునరుత్పాదక ఇంధన ప్రోత్సాహాలను తగ్గించడం వంటి చర్యలు తీసుకుంది. ఈ నిర్ణయాలు పర్యావరణ నాశనాన్ని పెంచి, భవిష్యత్తు తరాలకు ప్రమాదాన్ని కలిగించాయి.

డొనాల్డ్ ట్రంప్ అధ్యక్షుడిగా తీసుకుంటున్న నిర్ణయాలు అమెరికా ప్రజల్లో విపరీతమైన ప్రతిస్పందనలను రేకెత్తిస్తున్నాయి. ఈ నిర్ణయాలు ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో తీవ్ర ప్రభావాలను చూపుతున్నాయి, తద్వారా దేశంలో విస్తృత స్థాయిలో వ్యతిరేకతను ఎదుర్కొంటున్నాయి. ప్రభుత్వం ప్రదర్శనలను నియంత్రించడానికి ప్రయత్నించడం, ముఖ్యంగా వైట్ హౌస్ మరియు నేషనల్ మాల్ వద్ద, ప్రజాస్వామ్య హక్కులను పరిమితం చేసే ప్రయత్నంగా భావించబడింది. ఈ చర్యలు ఫస్ట్ అమెండ్మెంట్ హక్కులను ఉల్లంఘించే ప్రమాదం ఉందని ఏ సి ఎల్ యు వంటి సంస్థలు హెచ్చరిస్తున్నాయి. ట్రంప్ నిర్ణయాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా పెద్దస్థాయిలో నిరసనలు జరుగుతున్నాయి. ఫిలడెల్ఫియాలో "హ్యాండ్స్ అప్ !" పేరుతో జరిగిన నిరసనలో వేలాది మంది పాల్గొన్నారు. వారు సోషల్ సెక్యూరిటీ తగ్గింపులు, ఫెడరల్ ఉద్యోగుల తొలగింపు, వలసదారులపై కఠిన చర్యలు వంటి విధానాలను వ్యతిరేకించారు. ట్రంప్ నిర్ణయాలను విమర్శించే రాజకీయ నాయకులు కూడా ఉన్నారు. ఉదాహరణకు, సెనేటర్ మిచ్ మెక్కానెల్ ట్రంప్ సుంకాల నిర్ణయాలను విమర్శించారు, వాణిజ్య యుద్ధాలు కార్మిక వర్గంపై ప్రతికూల ప్రభావం చూపుతాయని హెచ్చరించారు.

మొత్తం మీద ట్రంప్ ఒక అధ్యక్షుడిగా కాకుండా వ్యాపారవేత్త వ్యూహాలతో, నియంత ధోరణులతో అమెరికా కోసం ఏదో చేస్తున్న భ్రమను కల్పిస్తూ కొనసాగుతున్న క్రమాన్ని ప్రపంచం అంతా,ముఖ్యంగా అమెరికా ప్రజలు కూడా గమనిస్తూనే ఉన్నారు. ఈ ట్రంప్ భస్మాసుర హస్తం ఇంకే స్థాయికి విస్తరిస్తుందో,ప్రపంచాన్ని ఇంకెంత ప్రమాదంలో పడేస్తుందో అన్న కలవరం కూడా ఇప్పుడు సర్వత్రా కనిపిస్తూ ఉంది.

# ఢిల్లీ సారథి రేఖా గుప్తా

- పేద కుటుంబాలను ఆదుకునేలా నిర్ణయాలు
- హస్తినలోఆయుష్మాన్ భారత్ పథకం అమలు
- మహిళల భద్రతను మెరుగుపరచడమే లక్ష్యం
- యమునా నది శుద్ధి కోసం ప్రభుత్వం ₹1,250 కోట్లు
- మహిళా సంక్షేమం మరియు శిశు అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి
- ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థినులకు ఉన్నత విద్య కోసం "సుమేధా యోజన" అమలు

తేజస్వి
హైదరాబాద్



2025 ఫిబ్రవరి 20న, భారతీయ జనతా పార్టీ (బిజెపి) నాయకురాలు రేఖా గుప్తా ఢిల్లీ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. 50 ఏళ్ల వయసుగల గుప్తా, ఢిల్లీ విశ్వవిద్యాలయం విద్యార్థి సంఘం మాజీ అధ్యక్షురాలు,అలాగే పురపాలక సంస్థలో కౌన్సిలర్గా కూడా సేవలందించారు. బిజెపి 70 సభ్యుల అసెంబ్లీలో 48 సీట్లు గెలుచుకుని, 26 సంవత్సరాల తర్వాత ఢిల్లీలో అధికారంలోకి వచ్చింది. రేఖా గుప్తా నాయకత్వంలో, ఢిల్లీ ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఆయుష్మాన్ భారత్ పథకాన్ని ఢిల్లీలో అమలు చేయాలని నిర్ణయం తీసుకున్నారు, దీని ద్వారా పేద కుటుంబాలకు రూ. 5 లక్షల వరకు ఉచిత వైద్య సేవలు అందించబడతాయి. అదనంగా, రాష్ట్ర ప్రభుత్వం మరో రూ. 5 లక్షల టాప్-అప్ అందిస్తుంది. ఇది ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలలో ఒకటి.

మహిళల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ, ప్రభుత్వం ప్రతి మహిళకు నెల ఆర్థిక సహాయం అందించేందుకు మహిళా సమృద్ధి యోజన పథకాన్ని ప్రారంభించింది. మార్చి 8న, అంతర్జాతీయ మహిళా దినోత్స వం నాటికి మొదటి విడత సాయం అందించబడింది. ఈ పథకం ద్వారా అర్హత కలిగిన మహిళలకు నెలకు ₹2,500 ఆర్థిక సహా యం అందించబడుతుంది, దీని కోసం ₹5,100 కోట్లు కేటాయించారు. మహిళల భద్రత కోసం, నగరంలో 50,000 సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అదనంగా, పింక్ పీసీఆర్ వాన్లు, పింక్ టాయిలెట్లు, మహిళల కోసం ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేయడం ద్వారా మహిళల భద్రతను మెరుగుపరచాలని లక్ష్యంగా పెట్టుకుంది. యమునా నది శుద్ధి కోసం ప్రభుత్వం ₹1,250 కోట్లు కేటాయించింది. ఈ నిధులతో 40 కొత్త శుద్ధి ప్లాంట్లు, పాత శుద్ధి ప్లాంట్ల మరమ్మతులు, పాత కాలువల పునరుద్ధరణ చేపట్టబడుతుంది.

కేంద్ర ప్రభుత్వ సహకారంతో, ఢిల్లీ ప్రభుత్వం నగర అభివృద్ధికి పలు ప్రణాళికలను రూపొందిస్తోంది. రోడ్లు, ఫ్లైఓవర్లు, మెట్రో విస్తరణ వంటి మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను వేగవంతం చేయడానికి చర్యలు తీసుకుంటున్నారు. యమునా నది శుద్ధి, పచ్చని ప్రదేశాల విస్తరణ, విద్యుత్ వాహనాల ప్రోత్సాహం వంటి పర్యావరణ పరిరక్షణ చర్యలు కూడా చేపట్టబడుతున్నాయి.

రేఖా గుప్త వ్యక్తిగత,రాజకీయ ప్రస్థాన విషయాలకు వస్తే, రేఖా గుప్తా 1974 జూలై 19న హరియాణాలోని నంద్గఢ్ గ్రామంలో జన్మించారు. ఆమె తండ్రి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో అధికారిగా పనిచేశారు, 1976లో ఢిల్లీకి మారారు. రేఖా ఢిల్లీలోనే ప్రాథమిక మరియు ఉన్నత విద్యను పూర్తిచేశారు. దౌలత్ రామ్ కాలేజీలో బాచిలర్ ఆఫ్ కామర్స్ పూర్తి చేసి, చౌధరి చరణ్ సింగ్ విశ్వవిద్యాలయంలో లా డిగ్రీ సాధించారు. రేఖా గుప్తా రాజకీయ ప్రస్థానం 1992లో దౌలత్ రామ్ కాలేజీలో చదువుకునే సమయంలో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ద్వారా ప్రారంభమైంది. 1996-97లో ఢిల్లీ విశ్వవిద్యాలయ విద్యార్థి సంఘం అధ్యక్షురాలిగా ఎన్నికై, విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో చురుకుగా పాల్గొన్నారు. 2000వ దశకంలో, భారతీయ జనతా యువ మోర్చా లో చేరి, ఢిల్లీ విభాగంలో కార్యదర్శిగా పనిచేశారు. 2004 నుండి 2006 వరకు జాతీయ కార్యదర్శిగా నియమితులయ్యారు. 2007లో ఉత్తరి పిటంపుర (వార్డ్ 54) నుండి కార్పొరేటర్గా ఎన్నికై, 2012లో తిరిగి ఎన్నికయ్యారు.

రేఖా గుప్తా మహిళా సంక్షేమం మరియు శిశు అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. "సుమేధా యోజన" వంటి పథకాలను ప్రారంభించి, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థినులకు ఉన్నత విద్యను కొనసాగించేందుకు సహాయం అందించారు. రేఖా గుప్తా వ్యాపారవేత్త మనీష్ గుప్తాను వివాహం చేసుకున్నారు, వీరికి ఇద్దరు సంతానం ఉన్నారు. 2025 ఫిబ్రవరిలో జరిగిన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో శాలిమార్ బాగ్ నియోజకవర్గం నుండి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఫిబ్రవరి 19న బిజెపి ఆమెను ఢిల్లీ ముఖ్యమంత్రిగా ప్రకటించింది, ఫిబ్రవరి 20న ప్రమాణ స్వీకారం చేశారు.

రేఖా గుప్తా 2025 ఫిబ్రవరిలో ఢిల్లీ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత, తాను నిర్వహించబోయే శాఖల విషయమై తీసుకున్న నిర్ణయాలు ఆమె పరిపాలనా దీక్షను స్పష్టంగా తెలియజేశాయి. ఆమె తన వద్ద అనేక కీలకమైన శాఖలను ఉంచుకోవడం ద్వారా ఢిల్లీ ప్రభుత్వం కార్యాచరణలో కేంద్ర బిందువుగా మారారు. ముఖ్యమంత్రి మాత్రమే కాకుండా, ఆమె తన మంత్రివర్గంలోని అత్యంత బిజీగా ఉండే నాయకురాలిగా మారారు.రేఖా గుప్తా ప్రస్తుతం నిర్వహిస్తున్న ముఖ్యమైన శాఖలు: సాధారణ పరిపాలన, సేవలు, ఆర్థికం, రెవెన్యూ, మహిళ మరియు శిశు అభివృద్ధి, భూమి మరియు భవనాలు, సమాచార మరియు ప్రజా సంబంధాలు, విజిలెన్స్, పరిపాలనా సంస్కరణలు మరియు ప్రణాళిక. ఇవి అన్నీ పాలనా వ్యవస్థలో అత్యంత కీలకమైన శాఖలుగా పరిగణించబడతాయి. ఒక్కో శాఖ ప్రస్తుత కాలంలో ప్రత్యేక శ్రద్ధకు లోనవుతున్నది. ఆర్థిక శాఖ, రెవెన్యూ వంటి శాఖలు నిధుల నిర్వహణకు కీలకంగా ఉండగా, మహిళా అభివృద్ధి శాఖ ఆమె సామాజిక విలువలను ప్రతిబింబిస్తోంది.

రేఖా గుప్తా, ఢిల్లీ అభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తున్నారు. ఆమె నాయకత్వంలో, ఢిల్లీ సాంకేతిక సేవలలో పురోగతి సాధిస్తోంది. ప్రభుత్వ ఆసుపత్రుల ఆధునీకరణ, డిజిటల్ లెర్నింగ్ సెంటర్ల స్థాపన వంటి కార్యక్రమాలు చేపట్టబడుతున్నాయి. ఇవి నగర ప్రజలకు మెరుగైన సేవలను అందించడంలో సహాయపడుతున్నాయి. రేఖా గుప్తా రాజకీయ ప్రస్థానం విద్యార్థి నాయకత్వం నుండి ప్రారంభమై, మహిళా సంక్షేమం, సామాజిక సేవల ద్వారా ప్రజల విశ్వాసాన్ని పొందారు. ఆమె నాయకత్వంలో ఢిల్లీ అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందన్నది స్పష్టమే. ఇప్పటివరకు డిల్లి లెక్క ఒకటైతే ఇప్పుడు రేఖా గుప్తా పాలనలో లెక్క ఇంకోలా మారబోతుంది అన్నది స్పష్టం. బిజెపి కేంద్రంలో ఉండటం రేఖా గుప్తా డిల్లి రాజకీయాల్లో తనదైన ముద్ర ఏర్పరుచుకోవడానికి ఎంతగానో దోహదపడుతుంది కూడా!

# భారత ఆర్థిక వ్యవస్థపై డొనాల్డ్ ట్రంప్ సుంకాల మోత

డా. ముచ్చుకోట. సురేష్ బాబు
9989988912

- ప్రపంచానికి ప్రతిరోజూ ఏదో ఒక తలనొప్పి తెచ్చి పెడుతున్న ట్రంప్
- "విముక్తి దినోత్సవం"గా అభివర్ణి స్తూ విశ్వ సుంకాల వ్యవస్థ పరిచయం
- యుఎస్ మార్కెట్లను ఇతర దేశాలు దోపిడీ చేస్తున్నారని ఆరోపణలు
- "దశాబ్దాల అన్యాయ వాణిజ్య పద్ధతుల" దిద్దుబాటు చర్య గా అభివర్ణన
- ట్రంప్ "డర్టీ 15" వ్యూహం వెనుక యు ఎస్ ట్రెజరీ దేశాలు

అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి గద్దెనెక్కిన డొనాల్డ్ ట్రంప్, ప్రపంచానికి ప్రతిరోజు ఏదో ఒక తలనొప్పి తెచ్చి పెడుతున్నారు, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అమెరికా వాణిజ్య విధానంలో ఒక ప్రధాన సవరణను ఆవిష్కరించారు. ట్రంప్ సుంకాలను విస్తృతంగా ప్రకటించినందుకు, చైనా, యూరోపియన్ యూనియన్ పై ప్రతీకారం తీర్చుకుంటున్నందున భారతదేశం ప్రభావాన్ని అంచనా వేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. .భారతదేశం, చైనా యూరోపియన్ యూనియన్తో సహా కీలక వాణిజ్య భాగస్వాములపై పరస్పర సుంకాలను విధించారు. "విముక్తి దినోత్సవం"గా అభివర్ణించిన ట్రంప్ ఈ చర్య, ప్రపంచ స్థాయి సుంకాల వ్యవస్థను పరిచయం చేసింది. ఏప్రిల్ 5 నుండి అమలులోకి వచ్చే అన్ని దిగుమతులపై సార్వత్రిక 10% సుంకం, తరువాత ఏప్రిల్ 9 నుండి ఎంపిక చేసిన దేశాలపై లక్ష్యంగా చేసుకున్న అధిక సుంకాలు వసూలు చేయాలని నిర్ణయించారు. టారిఫ్ ప్లాన్లో భాగంగా భారతదేశం 26% (బేస్ 10% తర్వాత 16% అమలులోకి వస్తుంది) చైనా 34% వియత్నాం 46% యూరోపియన్ యూనియన్ 20% యూకే 10% జపాన్ 24% దక్షిణ కొరియా 25% వడ్డించదలచినట్లు తెలిపారు. "దశాబ్దాల అన్యాయమైన వాణిజ్య పద్ధతులకు" వ్యతిరేకంగా దిద్దుబాటు చర్యగా ట్రంప్ పరిపాలన ఈ విధానాన్ని రూపొందించింది, భాగస్వామ్య దేశాలు అధిక సుంకాలు, సుంకం లేని అడ్డంకుల ద్వారా యుఎస్ మార్కెట్లను దోపిడీ చేస్తున్నారని ఆరోపించింది. భారతదేశం ప్రతిస్పందన ఇంతవరకు రాలేదు. కేంద్రం వేచి చూసే విధానాన్ని అవలంబించి నప్పటికీ, చైనా (34%) వియత్నాం (46%) వంటి దేశాలకు విధించిన దానికంటే భారతదేశం యొక్క సుంకాలు తక్కువగా ఉండటంతో లోలోపల కొంత ఉపశమనం పొందుతున్నారు. ఫార్మాస్యూటికల్స్, సెమీకండక్టర్లు, ఆటో విడిభాగాల వంటి రంగాలకు కీలక మినహాయింపులు తక్షణ మార్కెట్ ప్రభావాన్ని తగ్గించాయి, ఈ రోజు స్టాక్ మార్కెట్ సూచికలు (సెన్సెక్స్/నిఫ్టీ) 0.3% మాత్రమే తగ్గాయి. భారతదేశంపై విధించిన ప్రభావవంతమైన 16% సుంకం (బేస్ 10% తర్వాత) బంగ్లాదేశ్ (37%), థాయిలాండ్ (36%) ఇండోనేషియా (32%) రేట్ల కంటే తక్కువగా ఉంది, దీనివల్ల భారతీయ వస్త్రాలు, వస్త్రాలకు ప్రయోజనం చేకూరుస్తుంది ఇది సాపేక్ష ప్రయోజనంగా భావించవచ్చు. వాణిజ్య సమస్యలు పరిష్కరిస్తే సుంకాలను సవరించడానికి అమెరికా బహిరంగతను సూచించింది - అక్టోబర్ నాటికి రెండు దేశాలు ద్వైపాక్షిక ఒప్పందం వైపు పని చేస్తున్నందున ఇది కీలకమైన అంశం. భారతదేశం చారిత్రాత్మకంగా అధిక ఎంఎఫ్ఎన్ సుంకాలను (2023లో సగటున 17%) కలిగి ఉన్నందున, 26% లెవీ మిగతా వారితో పోల్చితే దౌత్యపరమైన ఉపసంహరణ గా భావించవచ్చు. గ్లోబల్ ఎదురుదెబ్బ ఇప్పుడిప్పుడే ప్రారంభమైంది, ప్రపంచ వాణిజ్య మండలి సవాళ్ల గురించి బ్రస్సెల్స్



హెచ్చరికతో "దామాషా ప్రతీకారం" ప్రతిజ్ఞ చేసింది. దేశీయ అసమ్మతిని హైలైట్ చేస్తూ, 51-48 ఓట్ల సింబాలిక్ ఓట్లతో కెనడాపై సుంకాలను తిరస్కరించింది. సరఫరా గొలుసు మార్పుల వల్ల సంస్థలు సోర్సింగ్ వ్యూహాలను తిరిగి అంచనా వేయడంలో ఎలక్ట్రానిక్, ఆటోలు, ఆభరణాల వంటి పరిశ్రమలు అంతరాయాలను ఎదుర్కొంటున్నాయి. ట్రంప్ "డర్టీ 15" వ్యూహం వెనుక యు ఎస్ ట్రెజరీ "డర్టీ 15" అని పిలిచే దేశాలను లక్ష్యంగా చేసుకున్నారు అవి భారతదేశం, చైనా, జపాన్ యూరోపియన్ యూనియన్ సభ్యులతో సహా అమెరికన్ వస్తువులపై అధిక వాణిజ్య పరిమాణాలు సుంకాల అడ్డంకులు ఉన్న దేశాలు. ఈ ఆర్థిక వ్యవస్థలు దేశీయ నిబంధనల ద్వారా "యుఎస్ ఉత్పత్తులను క్రమపద్ధతిలో లాక్ చేస్తున్నాయని" ట్రెజరీ కార్యదర్శి స్కాట్ బెసెంట్ ఆరోపించారు. వాణిజ్య చర్చలు వేగవంతం చేయాలని న్యూఢిల్లీపై ఒత్తిడి పెరుగుతోంది, అలాగే ట్రంప్ మోతపై మన విధానం గురించి మాట్లాడమని విపక్షాలు పట్టుబడుతున్నాయి, యూరోపియన్ యూనియన్ చైనా కౌంటర్-టారిఫ్లను అనుసరిస్తే పెరుగుదల ప్రమాదాలు పొంచి ఉన్నాయి. వ్యాపారాలు కొత్త వ్యయ నిర్మాణాలకు అనుగుణంగా మారడంతో రంగాలవారీగా అల్లకల్లోలం ఉంటుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. మార్కెట్ పూర్తిగా అస్థిరంగా మారే అవకాశం ఉంది. "ప్రధాని మోదీ మా స్నేహితుడు, కానీ భారతదేశం అమెరికా వస్తువులపై 52% సుంకాలు ఆమోదయోగ్యం కాదు, అందుకే వారు తగిన ప్రతిఫలం ఆశిస్తున్నారు, ఇప్పుడు వారు అందులో సగం చెల్లిస్తారు" అని ట్రంప్ ప్రకటించారు, తన "అమెరికా ఫస్ట్" వైఖరిని నొక్కి చెప్పారు. ఎగుమతులు మందగించి నట్లయితే, రూపాయి అస్థిరతను స్థిరీకరించడానికి ఆర్బీఐ జోక్యం చేసుకోవాలి. భారతదేశం ఎంత వేగంగా వాణిజ్య ఒప్పందాన్ని పొందుతుంది మరియు ఎగుమతులు వైవిధ్య పరుస్తుంది అనే దానిపై ఆధారపడి ఉంటుంది. రాబోయే 6-12 నెలలు చాలా కీలకం, అమెరికా నిర్ణయం మిశ్రమ పరిణామాలను కలిగి ఉంటుంది. స్వల్పకాలిక ప్రతికూల ప్రభావాలు కలిగివుండి, కీలక రంగాల్లో ఎగుమతి మందగమనం వస్త్రాలు, రత్నాలు %డ% ఆభరణాలు, ఇంజనీరింగ్ వస్తువులు, యుఎస్ ఎగుమతులకు గణనీయంగా దోహదపడే ఈ రంగాలు తగ్గిన పోటీతత్వాన్ని చూడవచ్చు. ఫార్మా %డ% కెమికల్స్ ప్రస్తుతానికి మినహాయించబడినప్పటికీ, సుంకాలు విస్తరించి నట్లయితే భవిష్యత్తు విస్తరణలు అడ్డంకులను ఎదుర్కోవచ్చు. వాణిజ్య ఉద్రిక్తతలు పెరిగితే, విదేశీ పెట్టుబడిదారులు పెట్టుబడులను ఆలస్యం చేయవచ్చు. అమెరికా భారతదేశానికి అతిపెద్ద వాణిజ్య భాగస్వామి (ఎగుమతుల్లో ది18%). ప్రత్యామ్నాయ మార్కెట్లను త్వరగా కనుగొనకపోతే ఎగుమతుల్లో తగ్గుదల భారతదేశ వాణిజ్య లోటును పెంచుతుంది.

పాఠకులు, విశ్లేషకులు, రచయితలు తమ రచనలు క్రింది చిరునామాకు గానీ సూర్య దినపత్రిక ఎడిటోరియల్ మెయిల్ ఐడికి గాని పంపవలసినదిగా మనవి మెయిల్ :
suryaeditpage@gmail.com
SPR publications, Surya Soudha, Plot.No: 185, M.C.H. NO.258/1/185, siddi vinayaka nagar, Ayyappa Society Opp: Hi-Tech City, Hyderabad - 500 072.

# పేదరిక నిర్మూలనకు బలమైన ఆయుధం పి-4

పేదరిక నిర్మూలనకు పి-4విధానం ఒక్క బలమైన ఆయుధం పబ్లిక్ ప్రైవేట్ పీపుల్ పార్ట్నర్‌షిప్ (పి-4) విధానాన్ని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మదిలో మెదిలిన మరో కొత్తఆలోచన జీరో పావర్టీ పీ4విధానం.ఇది మరో విప్లవాత్మక ఆలోచన.విశ్వావసునామతెలుగు సంవత్సరాది ఉగాది నాడు ప్రారంభించిన ఈవిధానాన్ని ముఖ్యమంత్రి గేమ్ చెంజర్ పేర్కొన్నాదరు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్వర్ణఆంధ్ర 2047లో భాగంగా, వచ్చే ఐదేళ్లలో పేదరికాన్ని పూర్తిగా నిర్మూలించేందు కు కృషి చేస్తోంది. సామాజిక ఆర్థికాభివృద్ధిలో సరికొత్త మార్పులకు ఈ పీ4 ప్రభుత్వం, ప్రైవేటు సంస్థలు, ప్రజల భాగస్వామ్యం నాంది పలుకుతుంది.స్వర్ణాంధ్ర విజన్-2047లక్ష్య సాధనకు పి-4 ఒక తిరుగులేని ఆయుధం. విజన్‌సాకారం కోసం కూటమి ప్రభుత్వం నిర్దేశించుకున్న పది సూత్రాల్లో సున్నా స్థాయికి పేదరిక నిర్మూలన (జీరో పావర్టీ) ఒకటి.కాగా 2047 వరకు ఆగకుండా 2029 నాటికే జీరో పావర్టీ టార్గెట్‌ను పూర్తి చేయాడానికే పి-4.సమాజంలో పైస్థాయిలో సంపన్నులుగా ఉన్న పది శాతం మంది చేయూత ద్వారా సొసైటీలో అట్టడుగున కటిక దరిద్రంలో మగ్గుతున్న ఇరవై శాతం మందిని ఆర్థికంగా పైకి తీసుకురావడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం.డబ్బులు సంపాదించిన పారిశ్రామిక,విద్య,వ్యాపార,వాణిజ్య రంగాల్లోని ప్రముఖులు పేద కుటుంబాలను దత్తత తీసుకోవాలని పిలుపునిచ్చింది. సమాజంలో ఆర్థిక అంతరాలను తగ్గించేందుకు,అధిక నికర విలువ కలిగిన వ్యక్తులు (హెచ్ఎన్ ఐలు), ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారు భాగస్వాములు కావడానికి ఈ విధానం దోహదపడుతుంది.ఈ పథకంలో లబ్దిదారులను 'బంగారు కుటుంబాలు' అని, సహాయం చేసే ఆర్థికంగా బలమైన వారిని 'మార్గదర్శి' అనిపిలుస్తారు. ఆర్థికంగా అండగా నిలిచే 'మార్గదర్శి'లు తమకు తోచినవిధంగా నిధులతోపాటు, సమయం ఉన్నవారు ఆర్థిక విషయాల్లో సలహాలు, కెరీర్ గైడెన్స్,ఉద్యోగ అవకాశాలు,విద్యా ఖర్చులకు సహాయం లేదా వ్యాపారాలకు పెట్టుబడి వంటి సహాయం కూడా అందిస్తారు. ఈ విధానం ద్వారా రాష్ట్రంలోని ప్రతి కుటుంబం సాధికారత సాధిస్తుందని కూటమి ప్రభుత్వం విశ్వసిస్తోంది. ఈవిధానం అమలులో ప్రభుత్వం ఏ రకమైన ఆర్థిక సాయం చేయదు. బంగారు కుటుంబాలకు,మార్గదర్శులకు మధ్య సమన్వయకర్తగా పనిచేస్తుంది. ప్రభుత్వం లోని వివిధ శాఖలు సర్వేల ద్వారా పేద కుటుంబాలను గుర్తిస్తున్నారు. అర్హులైన కుటుంబాలు ఈ పథకంలో భాగమవుతాయి. ఈ విధానం సమర్థవంతంగా అమలు చేసేందుకు, దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని రియల్ టైమ్ డేటాని సేకరిస్తున్నారు. రాష్ట్రప్రభుత్వం ఏర్పాటుచేసే డిజిటల్ వేదికనుంచి మార్గదర్శులు తాముసహాయం అందించేకుటుంబాలను ఎంచుకుంటారు. పీ4లో భాగంగా పేద కుటుంబాలకు విద్య, వైద్యం ఇళ్లస్థలాలు, ఇళ్లనిర్మాణం, మరుగుదొడ్లు, తాగునీటి కనెక్షన్లు, గ్యాస్ కనెక్షన్లు, నిరంతర విద్యుత్ సరఫరాతో పాటు సౌరవిద్యుత్ ఏర్పాటుకు ప్రోత్సాహకాలు, హైస్పీడ్ ఇంటర్నెట్వంటి సౌకర్యాలను కల్పిస్తారు. అయితేపేదల గుర్తింపునకు సర్కారు పెద్ద ప్రశ్నావళిని తయారు చేసి గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందితో సర్వే చేయించింది. సర్వే అధికారులకు విశేషాధికారాలిచ్చింది.అధికారులు తమ విచక్షణ ప్రకారం టి.వి. ఉందని, కారుందని,పక్కాభవనం ఉందని, భూములున్నాయని రాసేసుకోవచ్చు.ఇదే కొలబద్ద అయితే చాలా మంది పేదలు దారిద్ర్యరేఖను దాటేసి ఉన్నత స్థితికి చేరతారు. ధనికుల దత్తత వలన లాభపడటమేమోగాని, ఉన్న రేషన్ కార్డుకు, పింఛన్లకు, ఇతర ప్రభుత్వ పథకాలకు ఎసరొస్తుందేమోనని పేదలు బెంబేలెత్తుతున్నారు.బలహీన వర్గాల జనాభాకు మద్దతు ఇవ్వడానికి ప్రభుత్వం బలమైన సంక్షేమ కార్యక్రమాలను ఏర్పాటు చేసింది. అయితే, జీరో పావర్టీని సాధించడానికి సమాజం నుండి అంకితభావంతో కూడిన కృషి కూడా అవసరం.ఈ విధానం ద్వారా మొదటి దశలో 20లక్షల కుటుంబాలకు లబ్ధి చేరుకూరుతుందన్న అభిప్రాయంతో ప్రభుత్వంఉంది. 2029 నాటికి పేదరికం నిర్మూలించాలన్నదే ప్రభుత్వ సంకల్పం.నిజంగా కూటమి ప్రభుత్వం ఈ పథకాన్ని సమర్థవంతంగా ముందుకు తిసుకెలితే ఎన్నో అద్భుతాలు సాదించి ప్రపంచానికి మన రాష్ట్రం ఒక్క ఆదర్శంగా నిలబడుతున్నది.నిలబడాలి అన్ని ఆశిద్దాం.

N.సీతారామయ్య
9440972048

# నేను ఉగ్రవాదిని కాదు.. ఏడుగురు ప్రధానులు నాతో చర్చించారు: మాలిక్

తాను రాజకీయ నాయకుడినని.. ఉగ్రవాదిని కాదని వేర్పాటువాది యాసిన్ మాలిక్ పేర్కొన్నాడు. గతంలో తనతో ఏడుగురు ప్రధానులు చర్చలు జరిపారని వెల్లడించాడు. ఉగ్రవాద కార్యకలాపాలకు నిధులు సమకూర్చాడనే కేసులో జైలు శిక్ష అనుభవిస్తున్న మాలిక్.. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సుప్రీం కోర్టు విచారణకు హాజరయ్యాడు. ఈ సందర్భంగా ఉగ్రవాది అంటూ సీబీఐ చేసిన ఆరోపణలను మాలిక్ తోసిపుచ్చాడు. జమ్మూకశ్మీర్ లిబరేషన్ ఫ్రంట్-యాసిన్ను కేంద్ర ప్రభుత్వం నిషేధించిందే తప్ప ఉగ్రవాద సంస్థల జాబితాలో చేర్చలేదని అన్నాడు. 1994లో తనకు 32 కేసులలో బెయిల్ ఇచ్చారని.. కేసులను కూడా కొనసాగించలేదని గుర్తు చేసుకున్నాడు. గతంలో ప్రధానులుగా పనిచేసిన పీవీ నరసింహారావు, హెచ్‌డీ దేవెగౌడ, ఐకే గుజ్రాల్, వాజ్‌పేయి, మన్మోహన్ సింగ్ హయాంలోనూ తన సంస్థపై ఎటువంటి చర్యలు తీసుకోలేదని పేర్కొన్నాడు. ప్రధాని నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చిన మొదటి ఐదేళ్లలోనూ మునుపటి విధానాన్నే అనుసరించారని.. కానీ, రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత అకస్మాత్తుగా 35 ఏళ్ల నాటి ఉగ్రవాద కేసుల విచారణను తిరిగి ప్రారంభించారని ఆవేదన వ్యక్తం చేశాడు. 1989లో జమ్మూలో అతడిపై నమోదైన రెండు కేసుల్లో విచారించడానికి మాలిక్‌ను అక్కడి కోర్టులో హాజరు పరచాలని అధికారులు చేసిన ప్రతిపాదనకు అనుమతి ఇవ్వొద్దని సీబీఐ సుప్రీంకు విజ్ఞప్తి చేసింది. ఆ కేసులకు సంబంధించిన విచారణను జమ్ము కోర్టు నుంచి దిల్లీ కోర్టుకు బదిలీ చేయాలని కోరింది. మాలిక్‌కు ఉగ్రవాదులతో సంబంధాలు ఉన్నందున అక్కడికి వెళ్తే.. ఉగ్రదాడులు జరిగే అవకాశం ఉందని సీబీఐ తరఫున వాదిస్తున్న సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సుప్రీంకు విన్నవించారు. ఈ క్రమంలో మాలిక్ మాట్లాడుతూ.. తానేమీ ఉగ్రవాదినికాదంటూ వ్యాఖ్యానించాడు. 1990జనవరి 25న పాత శ్రీనగర్ ఎయిర్‌ఫీల్డ్‌లో విధుల నిర్వహణకు సిద్ధమైన వాయుసేన సిబ్బందిపై ఉగ్రవాదులు కాల్పులకు పాల్పడ్డారు. మాలిక్ నాయకత్వంలోనే ఈ ఘాతుకం జరిగిందనిఆరోపణలు ఉన్నాయి.ఆ తర్వాత అరెస్టయిన అతడిపై.. సీబీఐ ఛార్జ్‌షీట్ దాఖలు చేసింది. 1994లో మాలిక్ జైలు నుంచి విడుదలయ్యాడు. అనంతరం ఉగ్రవాద కార్యకలాపాలకు నిధులు సమకూర్చాడనే ఆరోపణలు రుజువు కావడంతో అతడికి శిక్ష పడింది. ప్రస్తుతం తిహాడ్ జైలులో జీవిత ఖైదు అనుభవిస్తున్నాడు.



# చెల్లింపు వ్యవస్థలకు యూపీఐ అనుసంధానం

- బిమ్‌స్టెక్ దేశాలకు ప్రధాని మోదీ ప్రతిపాదనలు
- బిమ్‌స్టెక్ ఛాంబర్ ఆఫ్ కామర్స్‌ను ఏర్పాటుచేద్దాం
- మయన్మార్ తీవ్ర ప్రాణ, ఆస్తి నష్టాన్ని చవిచూడటం ఆందోళనకరం
- బ్యాంకాక్ విజన్ 2030కి ఆమోదం తెలిపిన సదస్సు
- థాయ్‌లాండ్ నుంచి శ్రీలంకకు వెళ్లనున్న ప్రధాని మోదీ

థాయ్లాండ్ : బిమ్‌స్టెక్ సదస్సు కోసం థాయ్‌లాండ్ పర్యటనలో ఉన్న ప్రధాని మోదీ కీలక ప్రతిపాదన చేశారు. ఈ దేశాల మధ్య చెల్లింపు వ్యవస్థలతో యూపీఐ అనుసంధానం కోసం పిలుపునిచ్చారు. ఈ చర్యతో సభ్యదేశాల మధ్య వ్యాపారం, వాణిజ్యం, పర్యటకం వృద్ధి చెందుతాయని వ్యాఖ్యానించారు. అలాగే బిమ్‌స్టెక్ ఛాంబర్ ఆఫ్ కామర్స్‌ను ఏర్పాటుచేయాల్సిన ఆవశ్యకత ఉందని అన్నారు.

ఆరవ బిమ్‌స్టెక్ సదస్సులో ప్రధాని మోదీ మాట్లాడుతూ.. ఈ ప్రాంతంలో స్థానిక కరెన్సీలో వ్యాపారాన్ని ప్రోత్సహించే మార్గాలను అన్వేషించాలని సూచించారు. విపత్తు సంసిద్ధత, పునరావాసంపై ఒకరికొకరు సహకరించుకునేందుకు భారత్‌లో బిమ్‌స్టెక్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ఏర్పాటు గురించి ప్రస్తావించారు. ఇటీవల మయన్మార్, థాయ్లాండ్లో భూకంపం సంభవించిన సంగతి తెలిసిందే. థాయ్లాండ్లో ఈ విపత్తు తీవ్రత స్వల్పంగానే ఉన్నప్పటికీ.. మయన్మార్ తీవ్ర ప్రాణ, ఆస్తి నష్టాన్ని చవిచూసింది. ఈ నేపథ్యంలో మోదీ నుంచి ఈ ప్రతిపాదన వచ్చింది. ఈ సదస్సులో బ్యాంకాక్ విజన్ 2030కి ఆమోదం లభించింది. బంగాళాఖాతం ప్రాంతంలో ఉమ్మడి శ్రేయస్సు, భద్రతకు పరస్పరం కట్టుబడి ఉంటామని సభ్యదేశాలు అందులో పేర్కొన్నాయి.

ఈ సదస్సులో భాగంగా బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రధాన సలహాదారు మహమ్మద్ యూనస్‌తో ప్రధాని నరేంద్ర మోదీ భేటీ అయ్యారు. బిమ్‌స్టెక్ సదస్సు సందర్భంగా బ్యాంకాక్‌లో వీరి సమావేశం జరిగింది. గత ఆగస్టులో బంగ్లాదేశ్ ప్రభుత్వంలో యూనస్ కీలక బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి భారత ప్రధానితో జరిగిన తొలి సమావేశం ఇదే. ఇక మోదీ థాయ్‌లాండ్ నుంచి శ్రీలంకకు వెళ్లనున్నారు. అక్కడ మూడు రోజుల పాటు పర్యటించనున్నారు.

**భారత్ విదేశాంగ విధానంలో బౌద్ధమతం..**

ప్రధానమంత్రి మోదీ థాయిలాండ్ పర్యటనలో ఉన్న సంగతి తెలిసిందే. 2 రోజుల పర్యటనలో భాగంగా మోదీ థాయ్లోని వాట్ ఫో ఆలయాన్ని సందర్శించన్నారు. ఈ ఆలయాన్ని రిక్లైనింగ్ బుద్ధ ఆలయం అని కూడా పిలుస్తారు. అలాగే శ్రీలంకలోని అనురాధపురలోని మహాబోధి ఆలయాన్ని కూడా ఆయన సందర్శించనున్నారు. బౌద్ధమతానికి ప్రపంచ కేంద్రంగా భారత్‌ను బలోపేతం చేయడానికి, భారత విదేశాంగ విధానంలో బౌద్ధమతాన్ని కేంద్రంగా మార్చడానికి, ప్రపంచ సామరస్యం కోసం ప్రధాని మోదీ చేస్తున్న అత్యున్న ప్రయత్నాలకు ఇదొక ఉదాహరణగా చెప్పుకోవచ్చు. ఇది మోదీ దార్శనికతకు సాదృశ్యం. గతంలోనూ మోదీ ఇలాంటి ఎన్నో ప్రయత్నాలు చేశారు.

2024లో ఇండియా-ఆసియాన్ సమ్మిట్‌లో లావోస్ అధ్యక్షుడు థాంగ్ లౌన్ సిసౌలిత్‌కు ప్రధాని మోదీ ఓ పాతకాలపు ఇత్తడి బుద్ధ విగ్రహాన్ని బహుమతిగా ఇచ్చారు. ఇది ఉమ్మడి వారసత్వాన్ని, సాంస్కృతిక దౌత్య నిబద్ధతను సూచిస్తుంది. అదే ఏడాది బుద్ధుడు, ఆయన శిష్యులకు సంబంధించిన పలు పవిత్ర అవశేషాలను థాయిలాండ్‌కు భారత్ పంపించింది కూడా. బుద్ధుడి శిష్యులైన అరహంత్ సరిపుత్త, అరహంత్ మహా మొగ్గల్లనఅవశేషాలను భారత ప్రతినిధి బృందం బ్యాంకాక్కు తీసుకెళ్లింది. అలాగే థాయిలాండ్‌లోని 4 నగరాల్లో దాదాపు 25 రోజుల పాటు వీటిని ప్రదర్శించింది. 2023లోనూ జపాన్ ప్రధాని ఫ్యూమియో కిషిడాతో కలిసి మోదీ ఢిల్లీలోని బుద్ధ జయంతి పార్క్‌ని బాల్ బోధి వృక్షాన్ని సందర్శించారు. భారత్, జపాన్ మధ్య బౌద్ధ సంబంధాలను బలోపేతం చేయడానికి ఇది కూడా ఓ ఉదాహరణే. అంతేకాకుండా మోదీ మొట్టమొదటిసారిగా భారత్‌లో గ్లోబల్ బౌద్ధ సమ్మిట్‌ను కూడా నిర్వహించి, పండితులు, అభ్యాసకులను ఒకచోట చేర్చారు. ఇందులో బౌద్ధ తత్వశాస్త్రం, బుద్ధుని బోధనలు ప్రపంచ సమస్యలకు పరిష్కారాలను అందిస్తాయని మోదీ దార్శనికతకు మరో నిదర్శనం.

2022లో మోదీ బుద్ధ పూర్ణిమ నాడు నేపాల్లోని లుంబిని సందర్శించి, బౌద్ధ సంస్కృతిని ప్రోత్సహించేందుకు ఇండో-నేపాల్ ఆధ్యాత్మిక సంబంధాలను బలోపేతం చేసేందుకు India International Centre for Buddhist Culture and Heritage అనే కీలక ప్రాజెక్ట్‌కు పునాది వేశారు. అదే ఏడాది మంగోలియన్ బుద్ధ పూర్ణిమ వేడుకల్లో భారత్ లోని కపిలవస్తు అవశేషాలుగా పిలిచే బుద్ధుని నాలుగు పవిత్ర అవశేషాలను మంగోలియాకు పంపించి అక్కడ 11 రోజులపాటు ప్రదర్శించారు.








## గందరగోళం నడుమే.. లోక్‌సభ నిరవధిక వాయిదా



దిల్లీ: లోక్‌సభలో బడ్జెట్ సమావేశాలు ముగిశాయి. సభను నిరవధికంగా వాయిదా వేసినట్లు స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. జనవరి 31 నుంచి శుక్రవారం వరకు జరిగిన సమావేశాల్లో మొత్తం 16 బిల్లులను ఆమోదించినట్లు ఆయన తెలిపారు. వక్ఫ్ (సవరణ) బిల్లు- 2025తో సమాజంలో శాశ్వత విభజనను తీసుకొచ్చేందుకు భాజపా ప్రయత్నిస్తోందంటూ కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియా గాంధీ చేసిన విమర్శలపై దుమారం రేగింది.ఇవాళ ఉదయం సభప్రారంభమైన వెంటనే ప్రజాస్వామ్యంపై సోనియా చేసిన వ్యాఖ్యలకుగానూ క్షమాపణ చెప్పాలని అధికారపక్ష నాయకులు డిమాండ్ చేశారు. గందరగోళ పరిస్థితులు తలెత్తిన నేపథ్యంలో తొలుత సభను 12 గంటల వరకు వాయిదా వేశారు. అనంతరం తిరిగి ప్రారంభమైన వెంటనే స్పీకర్ ఓంబిర్లా బడ్జెట్ సమావేశాల ముగింపు ప్రసంగాన్ని చదివి వినిపించారు. సభను నిరవధికంగా వాయిదా వేసినట్లు చెప్పారు. ఈ సమావేశాల్లో సభ ఉత్పాదకత 118శాతం కంటే ఎక్కువ ఉందన్నారు. స్పీకర్ ప్రసంగ సమయం లోనూ ప్రతిపక్షనేతలు ఆందోళన కొనసాగించారు. ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీని సభలో మాట్లాడనివ్వకుండా వివక్షచూపించారంటూ నినాదాలు చేశారు.ఎలాంటిచర్చ చేపట్టకుండానే బలవంతంగా వక్ఫ్‌బిల్లుకు ఆమోదం తెలిపారని విమర్శించారు. వివిధ శాఖలకు సంబంధించిన గ్రాంట్లు, ఆర్థిక బిల్లుకు కూడా లోక్‌సభ ఆమోదం తెలిపిన నేపథ్యంలో బడ్జెట్ ప్రక్రియ ముగినట్లు సభాపతి ప్రకటించారు. మరోవైపు రాష్ట్రపతి పాలనలో ఉన్న మణిపూర్ రాష్ట్రానికి సంబంధించిన బడ్జెట్ కూడా క్లియర్ అయినట్లు తెలిపారు.

**రాజ్యసభలో 119శాతం ఉత్పాదకత :** లోక్‌సభ వాయిదా పడిన కొద్దిసేపటికే రాజ్యసభను కూడా నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ ప్రకటించారు. వక్ఫ్ (సవరణ) బిల్లుతోపాటు పలు కీలక అంశాలపై చర్చించినట్లు ఆయన తెలిపారు. సభ ఉత్పాదకత 119 శాతంగా ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. ఏప్రిల్ 3న (గురువారం) ఉదయం 11 గంటల నుంచి వేకువ జామున 4.02 వరకు సభను నిర్వహించామని, రాజ్యసభ చరిత్రలోనే ఇంత సుదీర్ఘ సమయం సభ నడవడం ఇదే తొలిసారి అని ఆయన అన్నారు. ఇది దేశ ప్రజలకు గొప్ప సందేశాన్ని పంచుతుందన్న ఆయన.. పార్లమెంట్‌పై ప్రజలకు నమ్మకాన్ని పెంచుతుందని చెప్పారు.

## భారత్-కెనడా సంబంధాలు దెబ్బతీసింది వారే: విదేశాంగశాఖ



భారత్-కెనడా సంబంధాలు తిరోగమన దిశలో ఉన్నాయని విదేశాంగ శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ పేర్కొన్నారు. లోక్‌సభలో రాతపూర్వకంగా అడిగిన ఓ ప్రశ్నకు సమాధానంగా ఈ విషయం వెల్లడించారు. కెనడాలోని వేర్పాటువాదులు, తీవ్రవాదులే ఈ పరిస్థితికి కారణమయ్యారన్నారు. "కెనడాలో తీవ్రవాదులు, వేర్పాటువాదులకు స్వేచ్ఛను ఇవ్వడమే ఇరు దేశాల సంబంధాల తిరోగమనానికి కారణం. ఆ దేశం నుంచి కార్యకలాపాలు సాగించే భారత వ్యతిరేకులపై చర్యలు తీసుకోవాలని కేంద్రం పలుమార్లు కోరింది. 'భారత నాయకుల హత్యలను గొప్పగా చిత్రీకరించే వ్యక్తులు.. దౌత్యవేత్తలను బెదిరించే వారు.. ప్రార్థనా మందిరాలను ధ్వంసం చేసే మూకలు.. రెఫరెండంల పేరిట భారత విభజనకు మద్దతు పలికే వేర్పాటువాదుల'ను అడ్డుకోవాలని కోరింది". "అంతర్గత వ్యవహారాల్లో విదేశీ శక్తుల జోక్యం విషయంలోనూ కెనడా తీరు ఆందోళనకరంగానే ఉంది. నిరంతరం భారత అంతర్గత వ్యవహారాల్లో కలుగజేసుకుంటోంది. ఇది అక్రమ చొరబాట్లు, వ్యవస్థీకృత నేర కార్యక్రమాలకు వీలు కలిగించింది. భారత ప్రభుత్వంపై కెనడా చేసిన వ్యాఖ్యలను తిరస్కరిస్తున్నాం. పరస్పర గౌరవం, సున్నిత అంశాల ఆధారంగా కెనడాతో దౌత్య సంబంధాల పునరుద్ధరణకు భారత్ సిద్ధంగా ఉంది" అని కేంద్ర మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ వెల్లడించారు. ఖలిస్థానీ ఉగ్రవాది హర్‌దీప్ సింగ్ నిజ్జర్ హత్యలో భారత్ హస్తం ఉందంటూ నాటి కెనడా ప్రధాని ట్రూడో ఆరోపించడంతో.. ఇరు దేశాల సంబంధాలు దెబ్బతిన్నాయి. భారత నిఘా సంస్థలకు ఎటువంటి ఆధారాలు చూపకుండానే కెనడా సర్కారు నిందలు మోపింది. ఈ ఆరోపణలను భారత్ ఖండిస్తూవస్తోంది.ఇరు దేశాలు పరస్పరం దౌత్యవేత్తలను వెనక్కి పంపించాయి. ఇక తాజాగా కెనడా ఎన్నికల్లో జోక్యం చేసుకోవడానికి భారత్ యత్నిస్తోందంటూ కెనడియన్ సెక్యూరిటీ ఇంటెలిజెన్స్ సర్వీసు డిప్యూటీ డైరెక్టర్ సంచలన ప్రకటన చేశారు.ఇందుకోసం భారత్ ఏఐ సాధనాలు కూడా వినియోగించే అవకాశం ఉందని పేర్కొన్నారు. చైనా, వియత్నాం దేశాలు కూడా ఈ దిశగా ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు.దీంతో ఇరుదేశాల మధ్య దూరం మరింత పెరిగింది. కెనడా వేదిక జరగనున్న జీ7 సమావేశానికి భారత్ హాజరవుతుందనే కథనాలు వెలువడుతున్నాయి. ఈ సదస్సు సైడ్‌లైన్స్‌లో మోదీ, కెనడా నూతన ప్రధాని మార్క్ కార్నీ భేటీ అయ్యే అవకాశాలున్నాయి.



## అక్రమ వలసలను నియంత్రించండి: యూనస్‌కు ప్రధాని మోదీ సూచన

- ప్రధాని నరేంద్ర మోడీతో, బంగ్లాదేశ్ ప్రభుత్వ ప్రధాన సలహాదారు యూనస్ భేటీ
- బ్యాంకాక్‌లో ఇరుదేశాలు అధినేతలు ప్రత్యేక సమావేశం

న్యూఢిల్లీ : బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రధాన సలహాదారు మహమ్మద్ యూనస్‌తో ప్రధాని నరేంద్ర మోదీ భేటీ అయ్యారు. బిమ్‌స్టెక్ సదస్సు సందర్భంగా బ్యాంకాక్‌లో వీరి సమావేశం జరిగింది. గత ఆగస్టులో బంగ్లాదేశ్ ప్రభుత్వంలో యూనస్ కీలక బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి భారత ప్రధానితో జరిగిన తొలి సమావేశం ఇదే. ఓవైపు బీజింగ్-ఢాకాల మధ్య మిత్రత్వం పెరుగుతున్న నేపథ్యంలో వీరిద్దరి మధ్య చర్చలు జరగడం గమనార్హం. భేటీ సమయంలో విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్ అక్కడే ఉన్నారు.

ఈ భేటీపై భారత విదేశాంగశాఖ ప్రతినిధి విక్రమ్ మిస్రి స్పందిస్తూ "సుస్థిర, ప్రగతిశీల, ప్రజాస్వామ్య బంగ్లాదేశ్‌కు ప్రధాని మోదీ మద్దతు ఉంటుందని పునరుద్ఘాటించారు. ప్రజలే కేంద్రంగా ఉండే సంబంధాలకు భారత్ ప్రాధాన్యమిస్తుందని చెప్పారు. వాస్తవిక దృక్పథంతో సాగే సానుకూల, నిర్మాణాత్మక బంధాన్ని న్యూఢిల్లీ ఆకాంక్షిస్తోందని యూనస్‌కు వెల్లడించారు. అదే సమయంలో సరిహద్దులో అక్రమ వలసలను నియంత్రించాలని ప్రధాని కోరారు. ముఖ్యంగా సరిహద్దు భద్రత, సుస్థిరతను కాపాడేందుకు రాత్రి వేళల్లో చొరబాట్లను అడ్డుకోవాలని కోరారు" అని మిస్రి వివరించారు. దీంతోపాటు బంగ్లాదేశ్లో మైనార్టీల భద్రతపై ఆందోళనను యూనస్ దృష్టికి తీసుకెళ్లారని చెప్పారు. ఈ భేటీ సందర్భంగా బంగ్లాదేశ్ ప్రభుత్వ ప్రధాన సలహాదారు యూనస్ భారత ప్రధాని మోదీకి ఓ పాత జ్ఞాపకాన్ని గుర్తుగా బహూకరించారు. 2015లో ఇండియన్ సైన్స్ కాంగ్రెస్‌లో ప్రధాని మోదీ చేతుల మీదుగా బంగారు పతకాన్ని ప్రొఫెసర్ యూనస్ అందుకొన్నారు. ఈ ఫొటోను తాజాగా ఆయన ప్రధానికి అందజేశారు. వాస్తవానికి మోదీతో భేటీ కోసం యూనస్ తరఫున బంగ్లాదేశ్ విదేశాంగ శాఖ భారత్‌ను అభ్యర్థించింది. తాము భారత ప్రధానితో సమావేశం కోసం ఎదురుచూస్తున్నామని.. సానుకూల నిర్ణయం వెలువడుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. షేక్ హసీనా దేశం వీడిన నాటి నుంచి భారత్-బంగ్లా సంబంధాల్లో కొంత ఉద్రిక్తత నెలకొంది. మరోవైపు ఆ దేశంలోని మైనార్టీల రక్షణపై న్యూదిల్లీ కూడా పలుమార్లు ఆందోళన వ్యక్తం చేసింది. దీనికితోడు ఇటీవల మహమ్మద్ యూనస్ భారత్ లోని ఈశాన్య రాష్ట్రాలపై వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం ఈ పరిస్థితికి మరింత ఆజ్యం పోసింది. ఈ వ్యాఖ్యలను మన విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ ఖండించారు. ఈశాన్య రాష్ట్రాలకు రోడ్లు, రైళ్లు, జలమార్గాలు, గ్రిడ్‌లు, పైప్ లైన్లు ఉన్నాయన్నారు. బిమ్‌స్టెక్ దేశాలకు ఇది కీలకమైన కనెక్టివిటీ హబ్‌గా అభివర్ణించారు.



# రాజ్యసభలో వక్ఫ్ బిల్లు ఆమోదం

- సభలో అధికార విపక్షాల నడుమ సుదీర్ఘ చర్చ
- అనుకూలంగా 128, వ్యతిరేకంగా 95 ఓట్లు
- ముస్లిమేతరులు ఎక్కువమంది ఉంటారనే భయం వద్దన్న అధికార పక్షం
- మతపరమైన ఉద్రిక్తతలు రెచ్చగొట్టడానికి ఈ బిల్లు తెచ్చారని విపక్షం ఆరోపణలు
- ముస్లింలను ద్వితీయశ్రేణి పౌరులుగా మార్చడమే ఈ బిల్లు ఉద్దేశ్యమన్న కాంగ్రెస్

న్యూఢిల్లీ : వివాదాస్పద వక్ఫ్ బిల్లుకు రాజ్యసభలో కూడా ఆమోదం లభించింది. సుదీర్ఘ చర్చలు, వాదనల తర్వాత కేంద్రం ప్రవేశపెట్టిన ఈ బిల్లును ఎగువ సభ ఆమోదించింది. బిల్లుకు అనుకూలంగా 128 మంది, వ్యతిరేకంగా 95 మంది సభ్యులు ఓటేశారు. ప్రతిపక్షాలు ప్రతిపాదించిన సవరణలు వీగిపోయాయి. రాజ్యసభలో ఈ బిల్లును కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ప్రవేశ పెట్టి చర్చ ప్రారంభించారు. కొందరు విపక్ష ఎంపీలు బిల్లుకు నిరసనగా నల్ల బ్యాడ్జీలు ధరించి సభకు వచ్చారు. అయితే.. వక్ఫ్ చట్ట సవరణ బిల్లు ముస్లింలకు వ్యతిరేకం కాదని, ఏ ఒక్కరి మత విశ్వాసాలను దెబ్బతీసేలా నిబంధనలు ఈ బిల్లులో లేవని కేంద్ర మంత్రి చెప్పారు.

సంక్లిష్టతలను తొలగించి, పారదర్శకత తీసుకురావడమే ప్రభుత్వం ఉద్దేశ్యమని అన్నారు. దీంతో పాటు.. వక్ఫ్ ఆస్తులకు సాంకేతికతను ప్రవేశపెట్టి.. బోర్డు పనితీరు మెరుగుపరుస్తామని చెప్పారు. అసలు ఈ బిల్లుకు, మతానికి ఎలాంటి సంబంధం లేదని అన్నారు కిరణ్ రిజూజు. 2004లో 4.9 లక్షలుగా ఉన్న వక్ఫ్ ఆస్తులు ఇప్పుడు 8.72 లక్షలకు పెరిగాయని ఆయన గుర్తు చేశారు. గత ప్రభుత్వాలు నెరవేర్చని లక్ష్యాలను తాము నెరవేర్చడానికే ఈ బిల్లు తీసుకొచ్చామన్నారాయన. సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్ కూర్పుపై వ్యక్తమవుతున్న అనుమానాలకు కూడా ఆయన సమాధానం ఇచ్చారు. ముస్లిమేతరులు ఎక్కువమంది ఉంటారనే భయం అవసరం లేదని చెప్పారు. వక్ఫ్ చట్ట సవరణ బిల్లు రాజ్యాంగానికి వ్యతిరేకమని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. ముస్లింలను లక్ష్యంగా చేసుకొని సమాజంలో మతపరమైన ఉద్రిక్తతలు రెచ్చగొట్టడానికి బీజేపీ ఈ బిల్లు తెచ్చిందని ఆరోపించింది. జేపీసీలో ప్రతిపక్షాలు చేసిన ఏ ఒక్క సిఫార్సును ఈ బిల్లులో ఎందుకు పెట్టలేదని నిలదీసింది కాంగ్రెస్ పార్టీ. ముస్లింలను ద్వితీయశ్రేణి పౌరులుగా మార్చడమే ఈ బిల్లు ఉద్దేశ్యమని ఆరోపించింది. వక్ఫ్ బిల్లు ద్వారా ముస్లింలను విభజించడానికి ప్రయత్నిస్తున్నారని కాంగ్రెస్ ఆరోపించింది. దేశంలో నెలకొన్న మతసామరస్యాన్ని దెబ్బతీయవద్దని మల్లిఖార్జున్ ఖర్గే ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బిల్లును ఉపసంహరించుకోవాలని కోరారు. వక్ఫ్ బిల్లుపై బుధవారం లోక్‌సభలో 14 గంటలకు పైగా చర్చ జరిగింది. ఆ తర్వాత అక్కడ కూడా ఆమోదం పొందింది. దీంతో పార్లమెంటు ఉభయసభలు ఈ బిల్లును ఆమోదించినట్టు అయింది. రాష్ట్రపతి సంతకం కోసం ఈ బిల్లులను ప్రభుత్వం పంపించనుంది. వక్ఫ్ సవరణ బిల్లుపై రాహుల్ గాంధీ ట్వీట్ చేశారు. ముస్లింలను అణగదొక్కడం, వారి వ్యక్తిగత చట్టాలు, ఆస్తి హక్కులను ఆక్రమించుకోవడమే ప్రభుత్వ లక్ష్యంగా కనిపిస్తోందని ఆరోపించారు. ఈ బిల్లు ముస్లింల హక్కులను కాలరాయడానికి వినియోగిస్తున్న ఆయుధంలా ఉందని మండిపడ్డారు. RSS, బీజేపీ, దాని మిత్రపక్షాలు రాజ్యాంగంపై దాడి చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే.. ఇప్పుడు ముస్లింలపై జరుగుతున్న దాడి భవిష్యత్ లో ఇతర వర్గాలపై కూడా జరగొచ్చని అన్నారాయన. కాగా వక్ఫ్ ట్రిబ్యునల్ నుండి ముస్లిం చట్టంలో నిపుణుడిని తొలగించడం వల్ల వక్ఫ్ సంబంధిత వివాదాల పరిష్కారంపై ప్రభావం పడవచ్చనే ఆందోళన కూడా ఉంది. అలాగే, ఈ బిల్లు కనీసం ఐదు సంవత్సరాలు ఇస్లాంను ఆచరించే వ్యక్తులకు మాత్రమే వక్ఫ్ ఇచ్చేవిధంగా పరిమితం చేస్తుంది. అలాంటి నిబంధన ఎందుకనేది మాత్రం అస్పష్టంగా ఉంది. ఈ విధానం వల్ల ఐదు సంవత్సరాల కంటే తక్కువ కాలం ఇస్లాంను ఆచరించే వ్యక్తులకు.. ఐదు సంవత్సరాల కంటే ఎక్కువ కాలం ఉన్న వారికి మధ్య వ్యత్యాసాన్ని సృష్టిస్తుందని కొందరు అంటున్నారు. ఇది రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 చెప్పే సమానత్వ హక్కును ఉల్లంఘించే అవకాశం ఉంది. ఏది ఏమైనప్పటికీ.. పార్లమెంట్లో ఎన్డీయే కూటమికి బిల్లును చట్టం చేసే మెజారిటీ బలం ఉంది. రాజ్యసభలోనూ గెలవడానికి అవకాశం లేకపోలేదు. కాబట్టి, బిల్లు చట్టంగా మారి తీరుతుందని అందరి అభిప్రాయం. అయితే, దీన్ని న్యాయం ముందు నిలబెడతామని ముస్లిం వర్గాలు చెబుతున్నాయి.

## చైనా-అమెరికా మిలిటరీ చర్చలు

రెండోసారి అధ్యక్షుడి హోదాలో ట్రంప్ శ్వేతసౌధంలో అడుగుపెట్టిన తర్వాత తొలిసారి చైనా-అమెరికా మిలిటరీ చర్చలు జరిగాయి. ఈ విషయాన్ని పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ నేవీ ఓ ప్రకటనలో వెల్లడించింది. ఇరుదేశాలు సైనిక భద్రతపై చర్చలు జరిపాయి. చైనాలోని షాంఘై నగరం వీటికి వేదికగా నిలిచింది. మరోవైపు అమెరికా సైనిక ప్రధాన కార్యాలయమైన పెంటగాన్ కూడా దీనిని ధ్రువీకరించింది. ఇవి వర్కింగ్ లెవల్‌లో జరిగిన చర్చలుగా పేర్కొంది. వీటిని అమెరికా ఇండో-పసిఫిక్ కమాండ్, కోస్ట్‌గార్డ్ నుంచి ప్రతినిధులు హాజరయ్యారు. ఈసందర్భంగా చైనా దళాల దుందుడుకు చర్యలపై దృష్టిపెట్టారు. అమెరికా-చైనా మధ్య సెమీకండెక్టర్, పెట్టుబడులు, టారిఫ్‌లపై తీవ్ర స్థాయిలో విభేదాలున్న విషయం తెలిసిందే. అయినా, ఇరు దేశాలు మిలిటరీ అధికారులు భేటీ కావడం.. పరిస్థితి స్థిరంగా ఉందనడానికి చిహ్నంగా నిలిచాయి. ఓవైపు అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ తొలిసారి ఆసియా పర్యటనకు వెళ్లి.. ఇండో-పసిఫిక్‌లో చైనా బలపడకుండా మిత్ర దేశాలతో చర్చలు జరిపారు. అదే సమయంలో చైనా ఈ సమావేశం నిర్వహించడం గమనార్హం. ట్రంప్ వాణిజ్య యుద్ధం మొదలుపెట్టిన నేపథ్యంలో.. హెగ్సే పర్యటన ఆసియాలో అమెరికా సైనిక మోహరింపులకు సంకేతంగా నిలిచింది. తైవాన్ జలసంధి సహా ఇండో-పసిఫిక్ ప్రాంతంలో దూకుడును కట్టడి చేయడానికి అమెరికా సిద్ధంగా ఉందని జపాన్ పర్యటనలో ఆయన పేర్కొన్నారు.

# వక్ఫ్ బిల్లుపై సుప్రీంకోర్టులో కాంగ్రెస్ పిటిషన్

- పిటిషన్ దాఖలు చేసిన కాంగ్రెస్ ఎంపీ మొహమ్మద్ జావెద్
- రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తుందని పేర్కొన్న ఎంపి

న్యూఢిల్లీ : చారిత్రాత్మక వక్ఫ్ బిల్లుకు పార్లమెంట్ ఆమోదం తెలిపింది. ఇక రాష్ట్రపతి ఆమోదం తర్వాత చట్టంగా మారడమే మిగిలింది. ఈ బిల్లు ముస్లింలకు మేలు చేకూరస్తుందని బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే చెబుతుండగా ఇది ముస్లింల హక్కుల్ని కాలరాస్తుందని కాంగ్రెస్, ఇతర ఇండీ కూటమి నేతలు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్ ఎంపీ మొహమ్మద్ జావేద్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ప్రతిపాదిత చట్టం ముస్లింల పట్ల వివక్షతను చూపిస్తుందని వక్ఫ్ సవరణ బిల్లు ఆమోదాన్ని వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ ఎంపీ జావేద్ సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు.సుదీర్ఘచర్చ తర్వాత గురువారం అర్ధరాత్రి రాజ్యసభ వక్ఫ్‌సవరణ బిల్లును ఆమోదించింది. ఈ బిల్లు రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 (సమానత్వ హక్కు), 25 (మతాన్ని ఆచరించే స్వేచ్ఛ), 26 (మతపరమైన వ్యవహారాలను నిర్వహించే స్వేచ్ఛ), 29 (మైనారిటీ హక్కులు), 300A (ఆస్తి హక్కు) లను ఉల్లంఘిస్తుందని ఆయన వాదించారు. ప్రతిపాదిత చట్టం ఇతర మతపరమైన నిధుల నిర్వహణలో లేని ఆంక్షలు విధించడం ద్వారా ముస్లింలపై వివక్ష చూపుతోందని కాంగ్రెస్ ఎంపీ తరుపున న్యాయవాది అనాస్ తన్వీర్ దాఖలు చేసిన పిటిషన్‌లో పేర్కొన్నారు. హిందూ, సిక్కు మత ట్రస్టులు కొంతవరకు స్వీయ నియంత్రణలో ఉన్నప్పటికీ, వక్ఫ్ చట్టానికి చేసిన సవరణలు ప్రభుత్వ జోక్యాన్ని అసమానంగా పెంచుతున్నాయని పిటిషన్ పేర్కొంది. ఇది ఆర్టికల్ 14 ఉల్లంఘనకు దారి తీసిందని పిటిషన్‌లో చెప్పారు. ది ఇస్లామిక్ చట్టాలను, ఆచారాలను ఆచరించే ఆర్టికల్ 25 వంటి ప్రాథమిక హక్కును ఉల్లంఘి స్తుందని పేర్కొన్నారు. వక్ఫ్‌బోర్డు, సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్‌లో ముస్లిమేతరులను సభ్యులుగా చేర్చడం తప్పనిసరిగా చేయడం వంటివి మతపరమైన పాలనలో జోక్యం చేసుకోవడమే అని పిటిషన్ ఆరోపించింది.




## చైనా కూడా తగ్గేదే లేదు: అమెరికాపై 34శాతం సుంకాలు



అమెరికా మొదలుపెట్టిన వాణిజ్య యుద్ధంలో తాము ఏమాత్రం తగ్గేదే లేదని చైనా బలమైన సంకేతాలు పంపింది. తాజాగా వాషింగ్టన్ నుంచి దిగుమతి అయ్యే వస్తువులపై 34 శాతం టారిఫ్‌లను విధిస్తున్నట్లు ప్రకటించింది. అమెరికా నుంచి దిగుమతి అయ్యే అన్ని రకాల వస్తువులపై ఇది వర్తిస్తుందని ది స్టేట్ కౌన్సిల్ ఆఫ్ టారిఫ్ కమిషన్ వెల్లడించింది. ఏప్రిల్ 10వ తేదీ ఇది అమల్లోకి రానున్నట్లు చెప్పింది. వాషింగ్టన్ చర్యలు అంతర్జాతీయ వాణిజ్య నిబంధనలకు విరుద్ధమని ఆరోపించింది. ఏకపక్షంగా ఆర్థిక బెదిరింపులకు పాల్పడుతోందని వెల్లడించింది. "చైనాలోని టారిఫ్ చట్టం, కస్టమ్స్ చట్టం, విదేశీ వ్యాపార చట్టం, అంతర్జాతీయ వాణిజ్య నిబంధనల ప్రకారం స్టేట్ కౌన్సిల్ ఆమోదంతో అమెరికా నుంచి దిగుమతి అయ్యే వస్తువులపై ఏప్రిల్ 10 మొదలు అదనపు సుంకాలు విధిస్తున్నాం" అని ది స్టేట్ కౌన్సిల్ ఆఫ్ టారిఫ్ కమిషన్ వెల్లడించింది. ఈ కొత్త నిర్ణయంతో ప్రస్తుతం అమెరికా నుంచి దిగుమతులపై ఉన్నపన్నులకు అదనంగా ఈ టారిఫ్‌లు కూడా విధించనున్నారు. కానీ, ఇప్పటికే అమల్లో ఉన్న పన్ను, ఇతర మినహాయింపు పాలసీలు కూడా కొనసాగనున్నాయి. మార్గం మధ్యలో ఉన్న సరకులు మే 13లోపు చేరుకొంటే.. వాటికి మాత్రం మినహాయింపు లభించనుంది. నిన్న ట్రంప్ 34శాతం అదనపు సుంకాలను విధించడంపై బీజింగ్ తీవ్రంగా స్పందించింది. తాము తగిన విధంగా ప్రతిస్పందిస్తామని పేర్కొంది. చైనా నుంచి అమెరికాకు ఏటా సుమారు 438 బిలియన్ డాలర్ల వస్తువులు ఎగుమతి అవుతుంటాయి. ఇక అమెరికాతో వాణిజ్య చర్చలపై చైనా స్పందిస్తూ.. తాము వాణిజ్య ఆందోళనలపై వాషింగ్టన్‌తో టచ్‌లో ఉన్నామని చెప్పారు. "చైనా సహా పలు దేశాలపై అమెరికా పరస్పర సుంకాలను విధించింది. ఇది ప్రపంచ వాణిజ్య సంస్థ నిబంధనలకు పూర్తిగా విరుద్ధం. అంతేకాదు.. నిబంధనల ఆధారంగా పనిచేసే బహుళపక్ష వాణిజ్య వ్యవస్థను పట్టించుకోలేదు. మా ప్రయోజనాలను రక్షించుకొనేందుకు స్పందించే హక్కు మాకుంది" అని చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి పేర్కొన్నారు. ఆసియాన్, ఐరోపా సమాఖ్యల తర్వాత అత్యధికంగా చైనా వస్తువులు అమెరికాకే ఎగుమతి అవుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. 2024లో అమెరికా-చైనాల మొత్తం వాణిజ్యం విలువ 582.4 బిలియన్ డాలర్లు. అమెరికా నుంచి చైనా దిగుమతి చేసుకొనే వస్తువుల విలువ 143.5 బిలియన్ డాలర్లుగా ఉంది.

సూర్య
హైదరాబాద్ శనివారం 5 ఏప్రిల్ 2025




# జగన్ డబుల్ స్టాండర్డ్ రాజకీయాలు : వైఎస్ షర్మిల

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గురించి మాట్లాడేందుకు తానెప్పుడూ సిద్ధంగానే ఉంటానని ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలా రెడ్డి అన్నారు. ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలిగా జగన్ కంటే ఎక్కువగా ప్రజా సమస్యలపై స్పందిస్తానని చెప్పారు. విజయవాడలో షర్మిల మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సరస్వతి పవర్ షేర్ల విషయంలో జగన్, షర్మిల మధ్య వివాదంపై మీడియా ప్రతినిధులు ఆమెను ప్రశ్నించారు. అయితే మీడియా ప్రతినిధుల తీరుపై షర్మిల అసహనం వ్యక్తం చేశారు. తాను ప్రజా సమస్యలపై మాట్లాడితే దాన్ని హైలెట్ చేయడం లేదని, ఇతర అంశాల గురించి మాట్లాడినప్పుడు మాత్రం కవరేజీ ఇస్తున్నట్లు చెప్పుకొచ్చారు. జగన్‌తో తనకున్న విభేధాల గురించి మాట్లాడతానని, అంతకంటే ముందు ప్రజాసమస్యలపై మాట్లాడాల్సిన అవసరం ఉందని షర్మిల అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలా రెడ్డి మాట్లాడుతూ..వైఎస్ జగన్ డబుల్ స్టాండర్డ్ రాజకీయాలు మరోసారి బయటపడ్డాయి. వక్ఫ్ బిల్లు అంశంలో వైసీపీ ద్వంద్వ వైఖరి ఖండిసున్నా. వక్ఫ్ సవరణ బిల్లును నిన్నటి వరకూ వ్యతిరేకిస్తున్నట్లు వైసీపీ కబుర్లు చెప్పింది. ఎన్డీఏకు బలం ఉన్న లోక్ సభలో వ్యతిరేకించి.. కేంద్రానికి కీలకమైన రాజ్యసభలో మాత్రం అనుకూలంగా ఓటేసింది. జగన్ సూచనలతోనే రాజ్యసభలో ఆ పార్టీ ఎంపీలు వక్ఫ్ బిల్లుకు మద్దతు తెలిపారు. ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ఓటింగ్ తర్వాత విప్ జారీతో వైసీపీ డ్రామా ఆడింది. ఓటింగ్ తర్వాత విప్.. లోక్ సభ చరిత్రలోనే లేదంటూ విమర్శలు వస్తున్నాయి. జగన్ తీరును జాతీయ మీడియా ఎండగడుతోంది. ఆంధ్రప్రదేశ్ కు ప్రధాని మోదీ మళ్లీ వచ్చి మట్టి, నీరు ఇచ్చి వెళ్లిపోతారా?. ప్రధాని మోదీ మమ్మల్ని కలిసే అవకాశం ఇస్తే కచ్చితంగా మేం ప్రశ్నిస్తాం. కానీ, మోదీ వచ్చినప్పుడు మా పార్టీ వాళ్లను హౌస్ అరెస్టులు చేస్తారు కదా?. నేను మాట్లాడే ప్రజా సమస్యల కన్నా.. నేను మాట్లాడే ఇతర అంశాలనే మీడియా హైలెట్ చేస్తోంది. నిన్న కూడా వక్ఫ్ యాక్ట్ అంశం వదిలిపెట్టి వివేకా హత్య అంశాన్నే మీడియా హైలెట్ చేసింది. జగన్ వాదనలపై మాట్లాడితే పోలవరం అంశం పక్కకు వెళ్లి మిగిలిన అంశాలు హైలెట్ అవుతున్నాయి. ప్రజా సమస్యలపై మాట్లాడినప్పుడు నాకు కవరేజి ఇవ్వండి. జగన్ రెడ్డి స్వయంగా ఏంఓయూపై సంతకం పెట్టారు. నా పిల్లలకు ఆస్తి ఇస్తున్నట్లు ఆయనే ప్రకటించారు.

# ప్రతి నియోజకవర్గంలో 100 పడకల ఆస్పత్రి

● అవసరాన్ని బట్టి పీహెచ్‌సీ, సీహెచ్‌సీలో వర్చువల్ వైద్యసేవలు

● వైద్యారోగ్య శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు




ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో 100 పడకల నుంచి 300 పడకల సామర్థ్యంతో మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రులు స్థాపించేలా కార్యాచరణ ప్రారంభించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. మొత్తం 175 నియోజకవర్గాలకు గాను 100 పడకలకు పైగా సామర్థ్యం ఉన్న ఆస్పత్రులు ఇప్పటికే 70 వరకు ఉన్నాయని, మిగిలిన 105 నియోజకవర్గాల్లో మల్టీ స్పెషాలిటీ హాస్పటల్స్ నిర్మాణం జరిగేలా త్వరితగతిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. పీపీపీ పద్ధతిలో ఆస్పత్రులు నిర్మించి, నిర్వహించేలా ఆలోచన చేయాలని, ఇందుకోసం ముందుకొచ్చే సంస్థలకు పరిశ్రమల తరహాలోనే సబ్సిడీలు ఇచ్చే విధానం రూపొందించాలని చెప్పారు. శుక్రవారం సచివాలయంలో ఆరోగ్య శాఖపై సమీక్ష నిర్వహించిన ముఖ్యమంత్రి... రాష్ట్రంలో వైద్యసేవల్ని మరింత విస్తృఎత పరచాలని చెప్పారు. అమరావతిలో మెగా గ్లోబల్ మెడిసిటీ ప్రాజెక్టు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రపంచ దేశాలన్నీ వైద్యం కోసం అమరావతి వచ్చేలా అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దాలని చెప్పారు.

**వర్చువల్ వైద్య సేవలు :**
విద్య-వైద్య రంగాలు తమ ప్రాధామ్యాలుగా చెప్పిన ముఖ్యమంత్రి...గేట్స్ ఫౌండేషన్ సహకారంతో రాష్ట్రంలో అత్యుత్తమ వైద్య సేవలు అందించాలని అధికారులకు చెప్పారు. పీహెచ్‌సీ, సీహెచ్‌సీ స్థాయిలో వైద్యులు అందుబాటులో లేని సమయంలో రోగులకు వర్చువల్ విధానంలో ప్రాథమిక సేవలు అందేలా చూడాలన్నారు. అన్యారోగ్యం బారిన పడిన తర్వాత వైద్యసేవలు అందించే పరిస్థితి నుంచి... ముందు జాగ్రత్తగా ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని సంరక్షించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఆహారపు అలవాట్లను, జీవన విధానాన్ని మార్చుకోవడం ద్వారా హైపర్ టెన్షన్, డయాబెటిస్ వంటి వ్యాధుల నుంచి చాలావరకు బయటపడవచ్చన్నారు. క్యాన్సర్ స్క్రీనింగ్ ప్రక్రియపైనా ముఖ్యమంత్రి సమీక్షించారు.

**కొత్తగా 13 డ్రగ్ డీఎడిక్షన్ సెంటర్లు :**
రూ.32.5 కోట్లతో 25 డ్రగ్ డీఎడిక్షన్ సెంటర్లను బలోపేతం చేయడంతో పాటు, కొత్తగా మరో 13 డ్రగ్ డీఎడిక్షన్ సెంటర్లను ఏర్పాటు చేయాలని సమావేశంలో ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అలాగే ఏజెన్సీ ఏరియాలోని పీహెచ్‌సీల్లో వైద్య ఖాళీల భర్తీ, విజయనగరంలో కొత్తగా 8 డయాలసిస్ సెంటర్ల ఏర్పాటు, ఎన్టీఆర్, విజయనగరం, బాపట్ల జిల్లాల్లో డయాలసిస్ మెషిన్లు పెంచడం, కొవ్వూరు-నిడదవోలు సీహెచ్‌సీలను అప్‌గ్రేడ్ చేయడం తదితర అంశాలపైన మార్గదర్శకాలు జారీ చేశారు.

**కుప్పంలో డిజిటల్ నెర్వ్ సెంటర్ :**
కుప్పంలో అమలు చేస్తున్న టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ అభివృఎద్ధి చేసిన వినూత్న ఆరోగ్య సంరక్షణ కార్యక్రమం డిజిటల్ నెర్వ్ సెంటర్ (డ్రా) పురోగతి గురించి ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ను ఉపయోగించి ఆరోగ్య సంరక్షణ అందించడానికి డిజిటల్ నెర్వ్ సెంటర్ దోహదపడుతుంది. దేశంలోనే అత్యధికంగా 4.47 కోట్ల (88 శాతం) మందికి రాష్ట్రంలో అభా కార్డులు జారీ అయ్యాయి. అలాగే, పీఎం జన్మాన్‌లో భాగంగా టీబీ ఎలిమినేషన్ కింద 82,693 గిరిజనులకు ప్రత్యేకంగా స్క్రీనింగ్ చేయగా 5,072 మందికి పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. రాష్ట్రంలోని 10,11,461 మంది గిరిజనులకు స్క్రీనింగ్ చేయగా 1,977 మందికి సికిల్ సెల్ ఎనీమియా పాజిటివ్‌గా తేలింది. రాష్ట్రంలో 95.60 శాతం జనన, మరణాల నమోదు జరిగింది. 13,26,621 శిశు ఆధార్‌లు జారీ అయ్యాయి.

# బహిరంగ మార్కెట్‌లో శాశ్వత ఆస్తిపై హక్కు కల్పిస్తున్నాం



● నాకు ఎంత ఎక్కువ మెజార్టీ ఇస్తే అంత బలమొస్తుందని ఆనాడే చెప్పా ● కుప్పం కంటే ఒక్క ఓటైనా ఎక్కువ వస్తుందని బాబు గారికి చెప్పా ● మీకు ఎలాంటి సమస్యలు ఉన్నా పరిష్కరించే బాధ్యత తీసుకుంటా ● మంగళగిరి ప్రజలను గుండెల్లో పెట్టుకుని పనిచేస్తా ● యర్రబాలెం గ్రామానికి చెందిన 248 కుటుంబాలకు శాశ్వత ఇళ్ల పట్టాలు పంపిణీ చేసిన మంత్రి నారా లోకేష్

మంగళగిరిః బహిరంగ మార్కెట్ లో రూ.వెయ్యి కోట్ల విలువైన ఆస్తిపై పేద ప్రజలకు శాశ్వత హక్కు కల్పిస్తున్నామని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. మన ఇల్లు-మన లోకేష్.. పేదలకు పట్టాభిషేకం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఉదయం మంగళగిరి డాన్ బాస్కో ఉన్నత పాఠశాల పక్కన ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన సభలో యర్రబాలెం గ్రామానికి చెందిన 248 మంది పేద కుటుంబాలకు బట్టలు పెట్టి శాశ్వత ఇళ్ల పట్టాలు అందజేశారు. మొదట బొక్కసం సంధ్య, పూర్ణచంద్రరావు దంపతులకు బట్టలు పెట్టి శాశ్వత ఇంటి పట్టా అందజేశారు. మధ్యాహ్నం నీరుకొండ గ్రామానికి చెందిన 99 కుటుంబాలు, మంగళగిరి రత్నాలచెరువుకు చెందిన 199 మంది కుటుంబాలకు ఇళ్ల పట్టాలు అందజేయనున్నారు. నేడు మొత్తం 546 కుటుంబాలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. జీవితంలో మనం తీసుకున్న కొన్ని నిర్ణయాలు మనల్నే మార్చివేస్తాయి. 2019 ఎన్నికల్లో నేనొక నిర్ణయం తీసుకున్నా. నాకు పరిచయం లేని నియోజకవర్గంలో పోటీ చేయాలని నిర్ణయం తీసుకున్నా. ఆ నియోజకవర్గం పేరే మంగళగిరి. ఆనాడు అతి తక్కువ సమయం ఉన్నందున నేనేంటో మీకు తెలియదు, మీరేంటో నేను తెలుసుకోలేకపోయా. నేనొచ్చిన 20 రోజులకే ఎన్నికలు ముగిశాయి. 5,300 ఓట్ల తేడాతో ఆనాడు నేను ఓడిపోయా. ఓడిపోయిన రోజు బాధకలిగింది. రెండో రోజు నుంచి ఆ బాధ, ఆవేదన నాలో కసిపెంచింది. కష్టపడి మంగళగిరి ప్రజల మనస్సు గెలుచుకోవాలని ఆనాడు నిర్ణయించుకున్నా. ఏ మెజార్టీతో ఓడిపోయానో దానిపక్కన సున్నా పెట్టుకుని గెలవాలనే లక్ష్యంతో ఓడిపోయిన మరుసటి రోజు నుంచి మీకోసం పనిచేశా.

**మంగళగిరి ప్రజల కోసం 26 సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాం**
తెలుగుదేశం పార్టీ నాయకత్వంతో మంగళగిరిలో దాదాపు 26 సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడం జరిగింది. ఎన్టీఆర్ సంజీవని పేరుతో తాడేపల్లి, మంగళగిరితో క్లినిక్ తో పాటు దుగ్గిరాలలో మొబైల్ క్లినిక్ పెట్టి ప్రజలకు ఉచితంగా వైద్యం అందించాం. ఇప్పటికీ మందులు కూడా అందిస్తున్నాం. నీటి సమస్య ఉంట వాటర్ ట్యాంకర్ల ద్వారా నీరు అందించాం. యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు నైపుణ్య శిక్షణ అందించాం. ఇంట్లో పెళ్లి జరిగితే బట్టలు పెట్టాం. నిరుపేద కుటుంబాలు సొంత కాళ్లపై నిలబడాలనే ఆలోచనతో తోపుడు బండ్లు అందించాం. మహిళల ఆర్థిక స్వాతంత్ర్యం కోసం కుట్టుమిషన్ శిక్షణ అందించడంతో పాటు వారికి కుట్టుమిషన్లు కూడా అందించడం జరిగింది. కోవిడ్ సమయంలో ఆక్సిజన్, మందులు సరఫరా చేశాం. అమెరికా డాక్టర్ల ద్వారా ఆన్ లైన్ లో చికిత్స కూడా అందించాం. అవసరమైన మందులు ఇచ్చాం. ఈ విధంగా మంగళగిరి ప్రజల కోసం 26 సంక్షేమ కార్యక్రమాలు అమలుచేయడం జరిగింది.

**అందరికీ దిమ్మతిరిగే విధంగా 91వేల ఓట్ల మెజార్టీతో గెలిపించారు**
2024లో జరిగిన ఎన్నికల్లో అందరికీ దిమ్మతిరిగే విధంగా 91వేల ఓట్ల మెజార్టీతో నన్ను గెలిపించారు. శాసనసభకు పంపించారు. 2024 ఎన్నికల ముందు రచ్చబండ కార్యక్రమం ద్వారా నియోజకవర్గ ప్రజలను కలవడం జరిగింది. అక్కడ పార్టీ జెండాలు, బ్యాక్ డ్రాప్ లు లేవు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని ఆనాడు స్పష్టమైన హామీ ఇచ్చా. రెండున్నర దశాబ్దాల కల అయిన శాశ్వత ఇంటి పట్టాలు అందించాలని ఆనాడు ప్రజలు నన్ను కోరారు. మూడు విడతలుగా ఇంటి పట్టాలు అందిస్తామని చెప్పా. సులభంగా చేసే వాటిని ప్రభుత్వ నిర్ణయం మేరకు మొదటి విడతగా అందిస్తాం. ఎండోమెంట్ భూములు, రైల్వే భూముల విషయంలో కొంచెం సమయం పడుతుందని చెప్పా. అతి కష్టమైన పని కాలువ, అటవీ భూముల్లో నివసిస్తున్న వారికి పట్టాలు ఇవ్వడం. అందరితో చర్చించేందుకు రెండు, మూడేళ్ల సమయం పడుతుందని, కానీ నేను చేసి తీరతానని ఆనాడు హామీ ఇచ్చా.

**మార్కెట్ లో రూ.వెయ్యి కోట్ల విలువైన ఆస్తిపై శాశ్వత హక్కు కల్పిస్తున్నాం**
ప్రజాప్రభుత్వం ఏర్పడి 10 నెలలైంది. పది నెలల్లో మొత్తం ఎన్యూమరేషన్ చేశాం. ఇంటి కొలతలు తీశాం. అధికారులు, అన్ని పార్టీల నాయకులు వచ్చారు. కొలతలు తీసి వివరాలు కనుక్కున్నారు. తర్వాత నేనే స్వయంగా రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, గౌరవ ముఖ్యమంత్రి గారితో అనేకసార్లు చర్చించి, ఏకంగా కేబినెట్ కు తీసుకెళ్లి, కేబినెట్ ఆమోదం తెలిపిన తర్వాతనే ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్తున్నాం. అందరూ ఒక్కసారి గుండెపై చేయిపెట్టి ఆలోచించాలి. గత రెండున్నర దశాబ్దాల కల ఇది. అనేక మంది నాయకులను మీరు కలిశారు. జిరాక్స్ ప్రింటింగ్ లకే ఎక్కువ ఖర్చు అయింది. అలాంటిది మేం కష్టపడి, మీ దగ్గర బాటిల్ నీళ్లు కూడా తాగకుండా, మీ కోసం కష్టపడి, అవినీతికి తావులేకుండా ఇళ్ల పట్టాలు ఇస్తున్నాం. మొదటి విడతలో మార్కెట్ లో రూ.వెయ్యి కోట్ల విలువైన ఆస్తిపై శాశ్వత హక్కు కూటమి ప్రభుత్వం అందజేస్తోంది.

**నాకు ఎంత ఎక్కువ మెజార్టీ ఇస్తే అంత బలమొస్తుందని ఆనాడే చెప్పా**
నాకు ఎంత ఎక్కువ మెజార్టీ ఇస్తే అంత బలమొస్తుందని ఆనాడే చెప్పా. వంద పడకల ఆసుపత్రి కోసం కేబినెట్ లో అడిగితే ఎవరూ కాదనలేకపోయారు. దానికి కారణం..మీరు నాకిచ్చిన మెజార్టీ. దేవాలయ అభివృఎద్ధికి నిధులు అడిగేత కాదనలేకపోయారు. భూగర్భ డ్రైనేజీ, భూగర్భ గ్యాస్, భూగర్భ వాటర్.. చివరకు భూగర్భ కరెంట్ కూడా మంగళగిరిలో వచ్చే రెండు నెలల్లో పనులు ప్రారంభిస్తాం. దీనికి కారణం మీరు నాకిచ్చిన మెజార్టీ. మీరు నాపైనా భరోసాతో గెలిపించారు. నాపై బాధ్యత పెట్టారు. అహర్నిశలు మీ గురించే ఆలోచిస్తున్నా. మీ తరవున పనిచేస్తున్నా. చేయాల్సిన అనేక కార్యక్రమాలు ఉన్నాయి.

**మీకు ఎలాంటి సమస్యలు ఉన్నా పరిష్కరించే బాధ్యత కూటమి ప్రభుత్వం తీసుకుంటుంది**
ఓ వైపు సూపర్ సిక్స్ కార్యక్రమాలతో పాటు మంగళగిరిలో పార్క్ లు, చెరువుల అభివృఎద్ధితో పాటు కల్యాణ మండపాలు, జెమ్స్ అండ్ జ్యూయలరీ పార్క్, హ్యాండ్ లూమ్ క్లస్టర్ ఏర్పాటుచేసి నేనిచ్చిన హామీలు నిలబెట్టుకుంటా. వంద పడకల ఆసుపత్రికి ఏప్రిల్ 13 న శంకుస్థాపన చేసి ఏడాదిలో ఏప్రిల్ 13, 2026న ప్రారంభిస్తాం. కూటమి ప్రభుత్వంలో మేం అందరం మీ కోసం వచ్చాం, మీకు సేవ చేసేందుకు వచ్చాం, మీకోసం పోరాడేందుకు వచ్చాం. అహర్నిశలు మీ కోసం కష్టపడతాం. మీకు ఎలాంటి సమస్యలు ఉన్నా పరిష్కరించే బాధ్యత కూటమి ప్రభుత్వం తీసుకుంటుంది.

**కుప్పం కంటే ఒక్క ఓటైనా ఎక్కువ వస్తుందని బాబు గారికి చెప్పా**
ఎన్నికలప్పుడు అందరం సర్వేలు చేస్తాం. సర్వేలో కుప్పం కంటే మంగళగిరి వెనుకబడి ఉంది. ఎంతపని చేశావు.. మంగళగిరి వెనుకబడి ఉందని బాబు గారు చెప్పారు. కుప్పం కంటే ఒక్క ఓటైనా ఎక్కువ వస్తుందని బాబు గారికి చెప్పా. అప్పుడు ఎగతాళి చేశారు. కుటంబ సభ్యులం అందరం ఉన్నాం. మీరెప్పుడైతే మెజార్టీ చూపించారో, బాబుగారు డిసైడ్ అయిపోయి కష్టపడ్డారని ప్రశంసించారు. మీ దగ్గర నుంచి మిగతా నియోజకవర్గాలు నేర్చుకోవాలని చెప్పారు. దానికి కారణం మీరు నాపై చూపించిన ప్రేమ, అభిమానం. మంగళగిరి ప్రజలను గుండెల్లో పెట్టుకుని పనిచేస్తానని చెప్పారు

# వచ్చే విద్యా సంవత్సరం నుంచే తల్లికి వందనం




● 309 విద్యార్థినులకు ఉచితంగా సైకిళ్ల పంపిణీ ● రూ. కోటి 38 లక్షల మేర సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ ● ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

అద్దంకి: వచ్చే విద్య సంవత్సరం నుంచి తల్లికి వందనం పథకాన్ని అమలు చేయనున్నట్లు ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. ఈ పథకం ద్వారా ఎంత మంది చదువుకునే పిల్లలు ఉంటే వారి తల్లులకు ఏడాదికి రూ.15 వేలు చెప్పును ప్రభుత్వం చెల్లించనున్నట్లు పేర్కొన్నారు. ఏపీలో పాఠశాల విద్యను దేశంలో నం. 1 స్థానంలో నిలిపే దిశగా రాష్ట్ర ప్రభుత్వం, విద్య శాఖ మంత్రి నారా లోకేష్ కృఎషి చేస్తున్నట్లు ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి రవి కుమార్ స్పష్టం చేశారు. బాపట్ల జిల్లా అద్దంకిలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో శుక్రవారం నాడు 309 మంది విద్యార్థినులకు ఉచితంగా కొత్త సైకిళ్లను మంత్రి గొట్టిపాటి రవి కుమార్ పంపిణీ చేశారు. చిలకలూరిపేటకు చెందిన అసిస్ట్ అనే స్వచ్ఛంద సంస్థ సాయంతో సైకిళ్లను పంపిణీ చేసినట్లు మంత్రి గొట్టిపాటి పేర్కొన్నారు. అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ... విద్యార్థినులకు ఉచితంగా సైకిళ్లను పంపిణీ చేయడం ద్వారా వారికి చదువుల వైపు ప్రోత్సాహించినట్లవుతుందని అన్నారు. వివిధ కారణాల వల్ల పాఠశాల విద్యకు దూరమయ్యే బాలికల సంఖ్య కూడా తగ్గే అవకాశం ఉందని తెలిపారు. గతంలో ఇదే పాఠశాలలో కొంత మంది విద్యార్థినులకు సైకిళ్లు అందజేశామని చెప్పిన మంత్రి... విద్యార్థుల కోరిక మేరకు నేడు అందరికీ పంపిణీ చేసినట్లు వెల్లడించారు. త్వరలోనే అద్దంకి నియోజకవర్గ పరిధిలోని పాఠశాలల విద్యార్థినులకు ఉచితంగా సైకిళ్లను పంపిణీ చేయనున్నట్లు మంత్రి ప్రకటించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం... విద్యా వ్యవస్థకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ ను దేశంలోనే ఒక రోల్ మోడల్ గా నిలిపేందుకు అన్ని చర్యలూ తీసుకుంటుందని ఆయన వెల్లడించారు. విద్యార్థులందరూ కష్టపడి చదివి రాష్ట్రానికి మంచి పేరు తీసుకు రావాలని హితోపదేశం చేశారు. కార్యక్రమంలో అసిస్ట్ సంస్థ ప్రతినిధులతో పాటు విద్యా శాఖకు చెందిన అధికారులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

**రూ. 1.38 కోట్ల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ**
అద్దంకి పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం పరిధిలో శుక్రవారం నాడు మంత్రి గొట్టిపాటి రవి కుమార్ ప్రజా వేదికను నిర్వహించారు. అక్కడికి వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరించి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా 89 మంది లబ్ధిదారులకు రూ.1.38 కోట్ల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను మంత్రి గొట్టిపాటి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆర్థిక ఇబ్బందులు ఎన్ని ఉన్నా... కూటమి ప్రభుత్వం పేదలకు అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు.

అదే విధంగా బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి సీఎం చంద్రబాబు నాయుడి కృఎషి చేస్తోందని వెల్లడించారు. సీఎం సహాయ నిధి ద్వారా చంద్రబాబు ఎంతో మందికి అండగా నిలుస్తున్నారని మంత్రి గొట్టిపాటి తెలిపారు. అదే విధంగా ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో స్థానిక కూటమి నేతలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఇక 10 నిమిషాల్లోనే రిజిస్ట్రేషన్ పూర్తి

● గంటల కొద్ది వేచి ఉండాల్సిన అవసరం లేదు ● స్లాట్ బుకింగ్ సేవలను ప్రారంభించిన మంత్రి అనగాని సత్యప్రసాద్ ● ప్రస్తుతం 26 జిల్లా కేంద్రాల రిజిస్టర్ కార్యాలయాల్లో ప్రారంభం ● 296 సబ్ రిజిస్టర్ కార్యాలయాల్లో దశల వారీగా అమలు ● నాలా బకాయిలన్నీ వన్ టైమ్ సెటిల్మెంట్ : మంత్రి అనగాని

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : సబ్ రిజిస్ట్రర్ కార్యాలయాల్లో దస్తావేజులు రిజిస్టషన్ కోసం స్లాట్ బుకింగ్ సేవలను శుక్రవారం అమరావతిలోని సచివాలయంలో రాష్ట్ర రెవెన్యూ, రిజిస్టషన్ అండ్ స్టాంప్స్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రారంభించారు. రెవెన్యూ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్ పి సిసోడియా, రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్ ఐజీ హరి నారాయణ, అడిషనల్ ఐజీ ఉదయ భాస్కర్, జాయింట్ ఐజీలు రవికుమార్, సరోజలతో కలిసి స్లాట్ బుకింగ్ అవగాహన కరపత్రాన్ని, పోస్టర్ ను మంత్రి సత్యప్రసాద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజలకు సులభతరంగా సేవలు అందించాలనే సీఎం చంద్రబాబు ఆదేశాలకు అనుగుణంగా సబ్ రిజిస్ట్రర్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ సేవలను ప్రారంభించినట్లు చెప్పారు. రిజిస్టషన్ డిపార్ట్ మెంట్ అధికారిక వెబ్ సైట్ లో స్లాట్ బుకింగ్ మాడ్యూల్ ద్వారా ఏ రోజు వీలుంటే ఆరోజు ఆ సమయానికి కొచ్చి రిజిస్టషన్ చేయించుకునేలా స్లాట్ బుక్ చేసుకోవచ్చని తెలిపారు. దీని ద్వారా ప్రజలు రిజిస్టషన్ చేయించుకునేందుకు వేచి ఉండా ల్సిన అవసరం లేదన్నారు. అమ్మకందారులు, కొనుగోలుదారులు, సాక్ష్యులు సబ్ రిజిస్ట్రర్ కార్యాలయాలకు తమకు కుదిరిన సమయాల్లో వచ్చి పని పూర్తి చేసుకోవచ్చ న్నారు. స్లాట్ ఆధారిత అపాయింట్మెంట్లు మధ్యవర్తుల ప్రమేయాన్ని తగ్గిస్తాయన్నారు. ఈరోజున మొత్తం 26 జిల్లా ప్రధాన కార్యాలయాల రిజిస్ట్రర్ కార్యాలయాల్లో ఈ సౌకర్యం అందుబాటులోకి వస్తుందని, మొత్తం 296 సబ్ రిజిస్టార్ కార్యాలయాల్లో ఈ స్లాట్ బుకింగ్ సిస్టమ్ దశలవారీగా అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ఇప్పటికే గాంధీనగర్, కంకిపాడు సబ్ రిజిస్ట్రర్ కార్యాలయాల్లో ప్రయోగాత్మకంగా స్లాట్ బుకింగ్ విధానాన్ని అమలు చేశామని, ప్రజల నుండి సానుకూల స్పందన వస్తోందని తెలిపారు. స్లాట్ బుకింగ్ విధానం ద్వారా అన్లైన్ లో డేటా ఎంట్రీ చేసి డాక్యుమెంట్ ప్రీపేర్ చేసుకొని ఫీజు కూడా కట్టేసి ఆ తర్వాత స్లాట్ బుక్ చేసుకుంటే సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుకు వచ్చిన 10 నిమిషాల్లోనే రిజిస్టషన్ పూర్తయిపోతుందన్నారు. ఒక వేళ స్లాట్ బుకింగ్ చేసుకోలేకపోయిన వారు సబ్ రిజిస్టార్ ఆఫీసుకు వస్తే సాయంత్రం ఐదు గంటల తర్వాత రిజిస్టషన్ చేస్తామన్నారు. ప్రభుత్వ సెలవు రోజుల్లో కూడా రూ. ఐదు వేల రూపాయల ప్రత్యేక ఫీజు తీసుకొని రిజిస్టషన్లు చేస్తామని చెప్పారు. ఉగాది,రంజాన్ పండుగల సందర్భంగా వరుసగా వచ్చిన మూడు రోజుల సెలవుల్లో దాదాపు రూ.74 కోట్ల రూపాయల రిజిస్టషన్ ఆదాయం లభించిందన్నారు. రిజిస్టషన్ తర్వాత ఆటోమ్యూటేషన్ను సులభతరం చేయడం కోసం రిజిస్టషన్ సాఫ్ట్ వేర్ ను రెవెన్యూ డేటాబేస్ తో అనుసంధానం చేశామన్నారు. వంటి ఇతర శాఖలతోనూ అనుసంధానం ప్రారంభించామని, ఈ ప్రక్రియ 2025 ఏప్రిల్ 15వ తేదీ నాటికి పూర్తవుతుందని తెలిపారు. ఈ అనుసంధానంతో ఆస్తిపై యాజమాన్యం ఉన్న వ్యక్తి మాత్రమే రిజిస్టషన్ చేయగలుగుతారని చెప్పారు. డబుల్ , , మరియు నకిలీ డాక్యుమెంట్ల సృఎష్టి లాంటి రియల్ ఎస్టేట్ మోసాలను నివారించేందుకు శాఖ అనేక చర్యలు తీసుకుందన్నారు. సేవలను ప్రక్రియలో అనుసంధానం చేయడం జరిగిందన్నారు.




# ఫార్మసీ విద్యార్థిని నాగాంజలి ఆత్మహత్య దురదృష్టకరం

● బాధిత విద్యార్థిని కుటుంబానికి కూటమి ప్రభుత్వం అండగా ఉంటుంది ● ఆత్మహత్యకు కారకుడిపై చట్ట ప్రకారం చర్యలుంటాయి ● ఉప ముఖ్యమంత్రి హెచ్చరిక



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : రాజమండ్రిలో ఫార్మసీ విద్యార్థిని నాగాంజలి ఆత్మహత్య దురదృఎష్టకరమని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాన్ అన్నారు. ఆమె కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియచేస్తున్నానని తెలిపారు.. ఆ కుటుంబానికి కూటమి ప్రభుత్వం అండగా ఉంటుంది. కిమ్స్ ఆసుపత్రిలో ఇంటర్న్ గా ఉన్న నాగాంజలి తన సూసైడ్ నోట్ లో కారకుడిగా పేర్కొన్న ఆసుపత్రి ఏజీఎం డా.దువ్వాడ దీపక్ ను ఇప్పటికే అరెస్టు చేసినట్లు పోలీసులు తెలియచేశారు. విద్యార్థినులు, యువతుల రక్షణకు రాష్ట్ర ప్రభుత్వం అనేక చర్యలు తీసుకొంటుంది. ఇటువంటి ఘటనలు చోటు చేసుకొన్నప్పుడు పోలీసు శాఖ కూడా మరింత పకడ్బందీగా చర్యలు చేపట్టడంతోపాటు బాధిత వర్గం ఆవేదనను, భావోద్వేగాలను పరిగణనలోకి తీసుకోవాలి. తోటి విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడితే విద్యార్థులు ఆందోళనకు లోనవుతారు. కోల్ కతాలోని ఆర్జీ కర్ మెడికల్ కాలేజీలో చోటు చేసుకున్న అత్యాచార, హత్య ఘటన సమయంలో మెడికోలు ఆందోళనలు చేయడాన్ని దృఎష్టిలో ఉంచుకోవాలి. విద్యార్థులకు, యువతులకు భరోసా, ధైర్యం కల్పించాల్సిన బాధ్యత పోలీసులు తీసుకోవాలి. రాజమండ్ర ఘటన నేపథ్యంలో అనుసరించాల్సిన జాగ్రత్తలు, చర్యల గురించి హోమ్ శాఖ మంత్రి శ్రీమతి అనిత గారికీ, రాష్ట్ర డీజీపీకి తెలియచేస్తానని ఉప ముఖ్యమంత్రి తెలిపారు.

# బ్యాటరీ గదిలో మార్పుల వల్లనే ప్రమాదం



ఏఫీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : ఇవాళ ఉదయం సచివాలయంలోని బ్లాక్ 2లో జరిగిన అగ్ని ప్రమాదం తీవ్ర కలకలం రేపింది. ముఖ్యంగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తో పాటు హోంమంత్రి అనిత, ఇతర మంత్రులు ఉండే కీలకమైన బ్లాక్ లో ఈ ప్రమాదం జరగడం చర్చనీయాంశమైంది. ఈ ప్రమాదం వెనుక ఏం జరిగిందన్న దానిపై వెంటనే సీఎం చంద్రబాబుతో పాటు హోంమంత్రి ఆరా తీశారు. అధికారులతో మాట్లాడి అలర్ట్ చేసిన హోంమంత్రి వంగలపూడి అనిత.. ఆ తర్వాత నేరుగా ప్రమాద స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం మీడియాకు వివరాలు వెల్లడించారు. సచివాలయం రెండో బ్లాక్ వద్ద బ్యాటరీలో ఉండే గదిలో ఈ ఉదయం జామున ఆరున్నర గంటలకు అగ్నిప్రమాదం జరిగిందని హోంమంత్రి వంగలపూడి అనిత వెల్లడించారు. సచివాలయంలో ఉండే ఎస్పీఎఫ్ సిబ్బంది మంటల్ని అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నించి ఆ తర్వాత అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారన్నారు. మొత్తం 8 నిమిషాల్లోనే మంటల్ని అదుపులోకి తెచ్చినట్లు హోంమంత్రి తెలిపారు.

# సచివాలయంలో అగ్ని ప్రమాదం



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : ఏపీ సచివాలయం రెండో బ్లాక్లో అగ్నిప్రమాదం సంభవించింది. రెండో బ్లాక్లో బ్యాటరీలు ఉండే ప్రాంతంలో అగ్ని ప్రమాదం జరిగినట్లుగా ప్రాథమిక అంచనా వేశారు. ఈ విషయం తెలిసిన వెంటనే ఫైర్ సేఫ్టీ సిబ్బందికి ఎస్పీఎఫ్ సిబ్బంది సమాచారం ఇచ్చారు. వెంటనే సచివాలయం లోని రెండో బ్లాక్ వద్దకు చేరుకుని మంటలను ఫైర్ సేఫ్టీ సిబ్బంది అదువులోకి తీసుకువచ్చారు. ప్రమాదవశాత్తూ ఈ సంఘటన జరిగిందా కుట్ర కోణం ఏమైనా ఉందా అనే కోణంలోనూ పోలీసులు విచారణ జరువుతున్నారు నిత్యం రద్దీగా ఉండే సచివాలయంలో ఈ ప్రమాదం జరగటం పైన ఉన్నతాధికారులు ఆరా తీస్తున్నారు. కాగా, ఈ రెండో బ్లాక్ లోనే డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, టూరిజం మంత్రి కందుల దుర్గేష్, దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ, హెరాం మంత్రి వంగలపూడి అనిత నిత పేషీలు ఉన్నాయి. తెల్లవారుజామున అగ్నిప్రమాదం జరగడంతో సిబ్బంది ఎవరూ కార్యాలయం లోపల లేరని సమాచారం.

# వక్ఫ్ బోర్డు బిల్లు పెట్టినందుకు హర్షం

**మోమిన్ షబానా ఆధ్వర్యంలో ముస్లిం మైనారిటీ మహిళల సంబరాలు**




అమరావతి బ్యూరో, ప్రతినిధి: నంద్యాల జిల్లా, ఆత్మకూరు పట్టణంలోని స్థానిక బిజెపి పార్టీ కార్యాలయంలో బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యురాలు మోమిన్ షబానా ఆధ్వర్యంలో ముస్లిం మైనార్టీ మహిళలు పీఎం నరేంద్ర మోడీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. పార్లమెంటులో వక్ఫ్ బోర్డు బిల్లు జారీ అయిన సందర్భంగా ఆత్మకూరు పట్టణంలో ముస్లిం మైనార్టీ మహిళలు మోమిన్ షబానాను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మోమిన్ షబానా మాట్లాడుతూ ఈ వక్ఫ్ బోర్డు బిల్లు పాస్ అవడం ద్వారా ముస్లిం మైనార్టీల ఆస్తులు దళారుల చేతుల నుంచి ప్రభుత్వ ఆధీనంలో ఉంటాయని, ఈ వక్ఫ్ బోర్డు ఆస్తులు ముస్లిం మైనార్టీల భవిష్యత్తు కోసం కేంద్ర ప్రభుత్వం వినియోగిస్తుందని అన్నారు.

# కొడాలి నాని నెల రోజులు ఆస్పత్రిలోనే

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : మాజీ మంత్రి కొడాలి నాని ఆరోగ్యం పై వైద్యులు కీలక అంశాలను వెల్లడించారు. నానికి గుండె శస్త్ర చికిత్స విజయవంతం అయింది. ముంబైలోని ఏషియన్ హార్ట్ కేర్ సెంటర్ లో చీఫ్ సర్జన్ డాక్టర్ రమాకాంత్ పాండే నేతృఎత్వంలో దాదాపు 8 గంటల పాటు బైపాస్ సర్జరీ నిర్వహించారు. సర్జరీ తరువాత కొడాలి నాని క్రమేణా కోలుకుంటున్నారు. కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్నట్లు వెల్లడించారు. మాజీ సీఎం జగన్ వైద్యులతో మాట్లాడారు. ఇదే సమయంలో వైద్యులు నాని ఆరోగ్యం.. ఆస్పత్రి చికిత్స గురించి కీలక సూచనలు చేసారు. నాని హెల్త్ అప్డేట్ గుండె ఆపరేషన్ తరువాత కొడాలి నాని ఆరోగ్యం నిలకడగా ఉంది. గుండె సంబంధిత సమస్యల తో హైదరాబాద్ లో ఏఐజీతో చికిత్స తీసుకున్న నాని.. అక్కడ వచ్చిన సూచనల మేరకు వెంటనే ముంబాయిలోని ఏషియన్ హార్ట్ కేర్ సెంటర్ కు వెళ్లాలని డిసైడ్ అయ్యారు. హైదరాబాద్ నుంచి ప్రత్యేక విమానంలో ముంబాయికి తరలించారు.



# నింగికి ఎగసిన బాలీవుడ్ ధ్రువతార

## దేశ భక్తి చిత్రాల మనోజ్ కుమార్

## నటుడిగా, డైరెక్టర్‌గా అనేక చిత్రాలలో విలక్షణ శైలి

**బాలీవుడ్ నటుడు డైరెక్టర్ మనోజ్ కుమార్ (87) కన్నుమూశారు. కొద్దికాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన ఆరోగ్య పరిస్థితి క్షీణించడంతో కుటుంబ సభ్యులు ముంబైలోని కోకిలాబెన్ ధీరూభాయ్ ఆస్పత్రిలో చేర్చారు. వైద్యులు చికిత్స అందించినప్పటికీ పరిస్థితి విషమించడంతో ఆయన తుదిశ్వాస విడిచారు. ఆయన నటుడిగా, డైరెక్టర్గా అనేక చిత్రాలు నిర్మించారు. ఉపకార్, రోటీ కపడా ఔర్ మకాన్, జైహింద్ సినిమాలకు మనోజ్ కుమార్ దర్శకత్వం వహించారు. ఎక్కువుగా దేశభక్తి చిత్రాలను రూపొందించడంతో ఆయనను భారత్ కుమార్గా పిలిచేవారు. విలక్షణ నటుడిగా ఆయనకు పేరుంది. బాలీవుడ్ చరిత్రలో తనకంటూ ఓ గుర్తింపు తెచ్చుకున్నారు. మనోజ్ కుమార్ మృతితో భారతీయ సినిమా ఒక యుగాన్ని కోల్పోయిందని పలువురు సినీ ప్రముఖులు ఆవేదన వ్యక్తం చేశారు**





భారత సినీ చరిత్ర పుటల్లో మనోజ్ కుమార్ ఒక ధ్రువ తార. మనోజ్ కుమార్ పేరు వినగానే మనకు వెంటనే దేశభక్తి, సామాజిక బాధ్యత, దేశసేవ అనే భావనలు గుర్తుకు వస్తాయి. ఆయన తన నటనతోనే కాదు, జీవన విధానంతో కూడా ఒక గొప్ప స్ఫూర్తిదాయక వ్యక్తిగా నిలిచారు. ఇప్పటికీ ఆయన చేసిన సినిమాలు, చూపిన దేశభక్తి, ఆయన జీవన విధానం ప్రస్తుతం యువతకు, భవిష్యత్ తరాలకు ఆదర్శప్రాయంగా నిలుస్తున్నాయి. ఏప్రిల్ 4 తెల్లవారుజామున తుది శ్వాస విడిచారు. ఆయన భౌతికంగా దూరమైనా ఆయన స్ఫూర్తి ఎప్పటికి భారతీయ బాలివుడ్ సినిమా పేజీల్లో అజరామరమే.

**జననం** : మనోజ్ కుమార్ అసలు పేరు హరికృష్ణ గిరి గోస్వామి. ఆయన 1937 జూలై 24న బ్రిటిష్ ఇండియాలోని నార్త్-వెస్ట్ ఫ్రాంటియర్ ప్రావిన్స్ (ప్రస్తుత పాకిస్తాన్లోని ఖైబర్ పఖ్తునా ్వ రాష్ట్రం) అబోట్టాబాద్ పట్టణంలో జన్మించారు. ఆయన కుటుంబం పంజాబీ హిందూ బ్రాహ్మణ కుటుంబానికి చెందినది. 1947లో భారత విభజన సమయంలో, ఆయన కుటుంబం ఢిల్లీకి వలస వెళ్లాల్సి వచ్చింది. అప్పుడు ఆయన వయస్సు కేవలం 10 సంవత్సరాలు మాత్రమే. మనోజ్ కుమార్ హిందూ కాలేజీ, ఢిల్లీలో బ్యాచిలర్ ఆఫ్ ఆర్ట్స్ చదివారు.

**మనోజ్ కుమార్ ఎలా అయ్యారంటే ? :** నటనలో ఆయనకు దిలీప్ కుమార్, అశోక్ కుమార్, కమినీ కౌశల్ లాంటి ప్రముఖ నటులు ప్రేరణగా నిలిచారు. ఆయన తన అసలు పేరును మార్చుకుని దిలీప్ కుమార్ "షబ్నమ్" చిత్రంలో చేసిన 'మనోజ్' అనే పాత్ర పేరు మీదుగా 'మనోజ్ కుమార్' అనే పేరు పెట్టుకున్నారు.

**సినీ జీవితం:** మనోజ్ కుమార్ (హరికృష్ణ గిరి గోస్వామి) భారతీయ సినీ పరిశ్రమలో ప్రముఖ నటుడు, దర్శ కుడు, రచయిత, నిర్మాత. ఆయన దేశభక్తి ప్రధాన చిత్రాలతో 'భారత్ కుమార్' గా ప్రసిద్ధి పొందారు. ఆయన 7 జూలై 1937 న పాకిస్తాన్లోని అబ్బటాబాద్లో జన్మించా రు. భారత విభజన సమయంలో ఆయన కుటుంబం ఢిల్లీకి వలస వచ్చింది. మనోజ్ కుమార్ 1957లో 'ఫ్యాషన్' చిత్రంలో 80 ఏళ్ల వృద్ధుడి పాత్రతో సినీ రంగ ప్రవేశం చేశారు.



**1965–1981 సినీ వైభవం: :**
1965లో మనోజ్ కుమార్ భగత్ సింగ్ జీవితం ఆధారంగా తెరకెక్కిన "షహీద్" అనే చిత్రంలో నటించి విమ–ర్శకుల ప్రశంసలు పొందారు. అదే సంవత్సరం, "హిమాలయ కీ గోద్ మే" చిత్రం బ్లాక్బస్టర్గా నిలిచింది. 1967లో "ఉప్కార్" అనే చిత్రంతో దర్శకుడిగా మారారు. భారత ప్రధాని లాల్ బహాదూర్ శాస్త్రి గారి "జై జవాన్, జై కిసాన్" నినాదాన్ని ఆధారంగా తీసుకుని ఈ చిత్రం రూపొందించారు. ఈ చిత్రం ఆల్ టైం బ్లాక్బస్టర్ గా నిలిచి, "నేషనల్ ఫిల్మ్ అవార్డు", ఫిలింఫేర్ ఉత్తమ దర్శకుడు అవార్డు అందుకున్నారు. 1970లో "పూరబ్ ఔర్ పశ్చిమ్" చిత్రాన్ని రూపొం దించారు. ఈ చిత్రం పాశ్చాత్య సంస్కృ తిని భారతీయ సంస్కృతితో పోల్చుతూ దేశభక్తిని చాటిచెప్పింది. లండన్లో 50 వారాల పాటు ప్రదర్శించబడింది. 1974లో "రోటి, కప్డా ఔర్ మకాన్" చిత్రం కూడా బ్లాక్బస్టర్ అయ్యింది. ఆ తరువాత "సన్యాసి" (1975), "దస్ నంబరి" (1976) వంటి చిత్రాలతో వరుస విజయాలు సాధించారు . 1981లో "క్రాంతి" అనే దేశభక్తి ప్రధానమైన చిత్రాన్ని రూపొందించారు. ఈ చిత్రం ఆ దశకంలోనే అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రం గా నిలిచింది. 1980ల తర్వాత మనోజ్ కుమార్ కెరీర్ క్షీణించింది. "కల్యుగ ఔర్ రామాయణ" (1987), "సంతోష్" (1989), "క్లర్క్" (1989), "దేశ వాసి" (1991) వంటి చిత్రాలు వాణిజ్యపరంగా విఫలమయ్యాయి. 1995లో "మైదాన్-ఏ-జంగ్" అనే చివరి చిత్రంలో నటించారు. 1999లో "జై హింద్" అనే సినిమాను దర్శకత్వం వహించారు. ఇందులో ఆయన తన కుమారుడు కునాల్ గోస్వామి ను హీరోగా పరిచయం చేశారు. అయితే, ఈ చిత్రం విజయం సాధించలేదు. అదే సంవత్సరంలో "ఫిలింఫేర్ లైఫ్టైమ్ అచీవ్మెంట్ అవార్డు" అందుకున్నారు.



**దాదాసాహెబ్ ఫాల్కే పురస్కారంద:** మనోజ్ కుమార్ సినీ పరిశ్రమలో అందించిన సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం ఆయనను 1992లో పద్మశ్రీ పురస్కారంతో సత్కరించింది. 2016లో దాదాసాహెబ్ ఫాల్కే పురస్కారం ఆయనను వరించింది. దేశభక్తి చిత్రాల ద్వారా యువతలో జాతీయ భావాన్ని పెంపొందించేందుకు మనోజ్ కుమార్ ప్రయత్నించారు. మేరే దేశ్ కీ దర్తీ వంటి పాటలు ఇప్పటికీ ప్రేక్షకుల హృదయాల్లో నిలిచాయి. . 1974లో 'రోటి కప్డా ఔర్ మకాన్' చిత్రానికి ఉత్తమ దర్శకుడు ఫిలింఫేర్ అవార్డు లభించింది. 1992లో భారత ప్రభుత్వం ఆయనకు పద్మశ్రీ పురస్కారం ప్రదానం చేసింది. 2016లో దాదాసాహెబ్ ఫాల్కే అవార్డుతో సత్కరించబడ్డారు.

**మరణం :** మనోజ్ కుమార్ 87 సంవత్సరాల వయస్సులో 2025 ఏప్రిల్ 4న ముంబైలో కన్నుమూశారు. ఆయన కోకిలాబెన్ ధీరూ భాయ్ అంబానీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడి చారు. ఆయన మరణానికి హృదయ సంబంధిత సమస్యలు కాలేయ వ్యాధి ప్రధాన కారణం అని వైద్యులు పేర్కొన్నారు.

**సమాజంపై ప్రభావం:** మనోజ్ కుమార్ దేశభక్తి ప్రధాన చిత్రాలతో భారతీయ సమాజంపై గొప్ప ప్రభావం చూపారు. ఆయన చిత్రాలు పౌరులలో దేశభక్తిని పెంపొందించాయి. ఆయన నటన, దర్శక త్వం ద్వారా అనేకమంది నటులు, దర్శకులు ప్రేరణ పొందారు. మనోజ్ కుమార్ భారతీయ సినీ పరిశ్రమలో తన ప్రత్యేక స్థానాన్ని సంపాదించారు. ఆయన దేశభక్తి చిత్రాలు, నటన, దర్శకత్వం ద్వారా భారతీయ సినీ ప్రపంచంలో చిరస్థాయిగా నిలిచారు.

**తేజస్వి హైదరాబాద్**







### ప్రముఖుల సంతాపం

మనోజ్ కుమార్ మృతిపై ప్రధానమంత్రి నరేంద్రమోదీతో పాటు పలువురు రాజకీయ ప్రముఖులు సంతాపం తెలిపారు. చిత్రపరిశ్రమకు చెందిన ప్రముఖులు మనోజ్ కుమార్ మృతి తీరనిలోటని పేర్కొన్నారు. మనోజ్ కుమార్ చిత్రాలు భారతీయ విలువలు, సంస్కృతిని ప్రపంచానికి చాటాయని మోదీ ఎక్స్లో తన సంతాప సందేశంలో పేర్కొన్నారు. అతడి ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తున్నట్లు మోదీ తెలిపారు. మనోజ్ కుమార్ వారసత్వం ఎప్పటికీ ఉంటుందని, దేవభక్తి చిత్రాల్లో ఆయన తమకు స్ఫూర్తి అని నటుడు అక్షయ్ కుమార్ పేర్కొన్నారు.

### రాజకీయ జీవితం



మనోజ్ కుమార్ సినీరంగంలో మాత్రమే కాకుండా రాజకీయాల్లో కూడా తనదైన ముద్ర వేశారు. ఆయన తన సినిమాలలో దేశభక్తి ప్రధాన ఇతివృత్తంగా తీసుకుని, దేశభక్తి భావనను ప్రజల్లో కలిగించేందుకు పాటుపడ్డారు. ఆయన రాజకీయ ప్రస్థానం సినీరంగం వలె గొప్పగా లేకపోయినా, భారతీయ జనతా పార్టీ (బిజెపి) లో చేరి దేశానికి సేవ చేయాలనే లక్ష్యంతో ముందుకు వెళ్లారు. ఆయన రాజకీయాల్లోకి రావడానికి ప్రధాన కారణం దేశభక్తి పట్ల ఉన్న అవగాహన మరియు దేశసేవ చేయాలనే తపన. ఆయన తన సినిమాల ద్వారా ఎప్పుడూ భారతీయ సంస్కృతి, దేశభక్తి, ధర్మ పరాయణత గురించి ప్రచారం చేసేవారు. అందుకే, బిజెపి లాంటి జాతీయవాద పార్టీతో ఆయన మమేకమయ్యారు.

### ఉత్కంఠ పోరులో

# ముంబయిపై లఖ్నవూ విజయం

### అర్ధశతకాలతో రాణించిన లఖ్నవూ ఓపెనర్లు..
### పాండ్యకు 5 వికెట్లు - 12 పరుగుల తేడాతో విజయం





లఖ్నవూ: ఐపీఎల్ 18లో లఖ్నవూ సూపర్ జెయింట్స్ రెండో విజయం సాధించింది. ముంబయి ఇండియాతో జరిగిన ఉత్కంఠ పోరులో ఆ జట్టు 12 పరుగుల తేడాతో గెలుపొందింది. 204 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్ చేసిన హార్దిక్ సేన 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 191 పరుగులు చేసింది. సూర్యకుమార్ యాదవ్ (67: 43 బంతుల్లో 9 ఫోర్లు, 1 సిక్స్), నమన్ ధీర్ (46: 24 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సు) చెలరేగారు. ముంబయి విజయానికి చివరి ఓవర్లో 22 పరుగులు అవసరం కాగా 9 పరుగులే వచ్చాయి. లఖ్నవూ బౌలర్లలో శార్దుల్ ఠాకూర్, ఆకాశ్ దీప్, దిగ్వేష్, అవేశ్ ఖాన్ ఒక్కో వికెట్ తీశారు.

తొలుత టాస్ ఓడి బ్యాటింగ్ చేసిన లఖ్నవూ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 203 పరుగులు చేసింది. ఓపెనర్లు మిచెల్ మార్ష్ (60: 31 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్సు), మార్క్రమ్ (53: 38 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్సు) దంచికొట్టారు. తొలి వికెట్కు ఈ జోడీ





76 పరుగులు చేసి జట్టుకు మంచి శుభారంభం అందించారు. అయుష్ బదోనీ (30: 19 బంతుల్లో 4 ఫోర్లు), డేవిడ్ మిల్లర్ (27: 14 బంతుల్లో 3 ఫోర్లు, ఒక సిక్స్) రాణించారు. కెప్టెన్ రిషబ్ పంత్ (2) మరోసారి విఫలమయ్యాడు. పూరన్ (12), అబ్దుల్ సమద్ (4), శార్దుల్ ఠాకూర్ (5లి), ఆకాశ్ దీప్ (0), అవేశ్ ఖాన్ (2లి) పరుగులు చేశారు. ముంబయి బౌలర్లలో కెప్టెన్ హార్దిక్ అదరగొట్టాడు. 4 ఓవర్లు వేసిన పాండ్య 36 పరుగులు ఇచ్చి 5 వికెట్లు పడగొట్టాడు. బౌల్ట్, అశ్విని కుమార్, విఘ్నేశ్ పుతుర్ ఒక్కో వికెట్ తీశారు.

అంతకుముందు ముంబయితో జరుగుతోన్న మ్యాచ్లో లఖ్నవూ ఇన్నింగ్స్ ముగిసింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన లఖ్నవూ జట్టు.. నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 203 పరుగులు చేసింది. ఓపెనర్లు మిచెల్ మార్ష్(60), మార్క్రమ్(53) అర్ధశతకాలతో రాణించారు. పూరన్ 12, పంత్ 2, బదోనీ 30, మిల్లర్ 27, సమద్ 4, శార్దూల్ 5, ఆకాశ్దీప్ 0, అవేశ్ 2 పరుగులు చేశారు. ముంబయి బౌలర్లలో పాండ్య అదరగొట్టాడు. ఏకంగా 5 వికెట్లు తన ఖాతాలో వేసుకున్నాడు. విఘ్నేశ్, అశ్వనీ, బౌల్ట్ తలో వికెట్ తీశారు.

## సీఎస్ కే కెప్టెన్ గా ఎంఎస్ ధోని?

ఐపీఎల్-2025లో వరుస పరాజయాలతో సతమతమవుతున్న చెన్నైసూపర్ కింగ్స్ మరో కీలక పోరుకు సిద్ధమైంది. ఈ మెగా టోర్నీలో భాగంగా శనివారం చెపాక్ వేదికగా ఢిల్లీ క్యాపిటల్స్తో తలపడనుంది. అయితే ఈ మ్యాచ్కు సీఎస్కేకు గట్టి ఎదురుదెబ్బ తగిలే అవకాశముంది. ఆ జట్టు కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ గాయం కారణంగా ఢిల్లీతో మ్యాచ్కు దూరమయ్యే అవకాశముంది.

గౌహతి వేదికగా రాజస్తాన్ రాయల్స్తో జరిగిన మ్యాచ్లో గైక్వాడ్ గైక్వాడ్ కుడి మోచేయికి గాయమైంది. దీంతో అతడు అప్పటి నుంచి నెట్ప్రాక్టీస్కు దూరమయ్యాడు. తాజాగా రుతురాజ్ అందుబాటుపై సీఎస్కే బ్యాటింగ్ కోచ్ మైఖేల్ హస్సీ సందేహం వ్యక్తం చేశాడు. ఒకవేళ రుతురాజ్ దూరమైతే అతడి స్థానంలో ఎంఎస్ ధోని సీఎస్కే కెప్టెన్గా వ్యవహరించే అవకాశముందని హస్సీ తెలిపాడు.

నేటి మ్యాచ్లో రుతురాజ్ గైక్వాడ్ ఆడుతాడో లేదో ఇంకా క్లారిటీ లేదు. అతడు ఎంపిక అనేది కోలుకునే దానిపై ఆధారపడి ఉంటుంది. ఇంకా అతడు నొప్పితో బాధపడుతున్నాడు. నెట్స్లో బ్యాటింగ్ ప్రాక్టీస్ చేసేందుకు ప్రయత్నిస్తున్నాడు. తను ఆడకపోతే, ఎవరు నాయకత్వం వహిస్తారో మేము ఇంకా నిర్ణయించలేదు. కానీ యువ వికెట్ కీపర్ ధోని కచ్చితంగా ముందు వరుసలో ఉంటాడు" అని హస్సీ పేర్కొన్నాడు. కాగా రుతురాజ్ ప్రస్తుతం అద్భుతమైన ఫామ్లో ఉన్నాడు. రాజస్థాన్పై ఓటమి పాలైనప్పటికి రుతు 61 పరుగులతో రాణించాడు.

కాగా ఇప్పటివరకు ఈ ఏడాది సీజన్లో మూడు మ్యాచ్లు ఆడిన సీఎస్కే కేవలం ఒక్క విజయం మాత్రమే నమోదు చేసింది. చెన్నై ప్రస్తుతం పాయింట్ల పట్టికలో ఎనిమిదో స్థానంలో ఉంది. ఈ నేపథ్యంలో శనివారం ఢిల్లీతో జరగనున్న మ్యాచ్కు సీఎస్కే చాలా కీలకం.

చెన్నై సూపర్ కింగ్స్ జట్టు: రచిన్ రవీంద్ర, రాహుల్ త్రిపాఠి, రుతురాజ్ గైక్వాడ్(కెప్టెన్), శివమ్ దూబే, విజయ్ శంకర్, రవీంద్ర జడేజా, ఎంఎస్ ధోనీ(వికెట్ కీపర్), జామీ ఓవర్టన్, రవిచంద్రన్ అశ్విన్, నూర్ అహ్మద్, మతీషా పతిరణ, ఖలీల్ అహ్మద్, ముఖేష్ చౌదరి, షేక్రన్ కాన్వే, షేక్రాన్ కాన్వే, సమ్కో కాన్వే శ్రేయాస్ గోపాల్, అన్షుల్ కాంబోజ్, నాథన్ ఎల్లిస్, గుర్జప్నీత్ సింగ్, రామకృష్ణ ఘోష్, ఆండ్రీ సిద్దార్థ్ సి, వంశ్ బేడి, దీపక్ హుడా



సూర్య
హైదరాబాద్
శనివారం
5 ఏప్రిల్ 2025

suryachitramagazine@gmail.com
సూర్య సినిమా

# బుచ్చిబాబుకి పెద్ది కానుక




మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ తన సినీ జీవితంలో ఎంత బిజీగా ఉన్నా, భక్తి విషయంలో మాత్రం తగిన సమయాన్ని కేటాయిస్తాడు. ఇటీవల దర్శకుడు బుచ్చిబాబు సానాకు ఒక పవిత్రమైన కానుక పంపించి అందర్నీ ఆశ్చర్యపరిచారు. ఈ కానుకలో శ్రీ రాముని పాదుకలు, హనుమాన్ చలీసా పుస్త కం, హనుమంతుని బొమ్మతో కూడిన ప్రత్యేక బాక్స్ ఉంది. దీన్ని చూసినవారు ఆధ్యాత్మికతకి చరణ్ చూపిన విలువను ప్రశంసిస్తున్నారు. ఈ బాక్స్‌పై 'బుచ్చి' అని పదాన్ని ముద్రించారు. అందులో ఉన్న పుస్తకంపై రామ్ చరణ్ ఒక లేఖ రాశారు. "హనుమంతునిపై నా నమ్మకం నాకు ఎన్నో కష్ట సమయాల్లో ధైర్యాన్నిచ్చింది. నేను నలభైఏళ్లకు చేరుకున్న ఈ సమయంలో నా ఆధ్యాత్మిక శక్తిని నువ్వు కూడా అనుభవిం చాలి" అని చరణ్ పేర్కొన్నారు. ఈ లేఖ చది విన ప్రతి ఒక్కరికీ ఆత్మీయతను, ప్రేమను అను భూతి చేసేలా ఉంది. ఈ కానుకను స్వీకరించిన దర్శకుడు బుచ్చిబాబు సోషల్ మీడియా ద్వారా తన ఆనందాన్ని వ్యక్తం చేశారు. "రామ్ చరణ్, ఉపాసన గారికి హృదయపూర్వక ధన్యవాదాలు. హనుమంతుడి ఆశీర్వాదాలు మీతో ఉండాలి" అని ట్వీట్ చేశారు. ఆయన ఈ కానుకను జీవితాంతం గుర్తుంచుకుంటానని తెలిపారు. అభిమానులూ ఈ కాను కకు అద్భుతంగా స్పందిస్తు న్నారు. రామ్ చరణ్ సినిమాల్లో మాస్ పాత్రలు పోషించడమే కాదు, వ్యక్తిగత జీవి తంలో కూడా విలువలతో నడుచుకుంటారు. గతంలోనూ ఆయన చాలా ఆలయాలను దర్శించి పూజలు నిర్వ హించిన విషయం తెలిసిందే. ఆధ్యాత్మికతతో కూడిన ఈ కానుక ద్వారా చరణ్ వ్యక్తిత్వం మరింత మెరిసి పోతోంది. ఇదే సందర్భంలో చరణ్ నటిస్తున్న 'పెద్ది' సినిమాకు సంబంధించిన గ్లింప్స్‌ను శ్రీరామ నవమి రోజున విడుదల చేయబోతున్నట్లు సమాచారం. ఈ గ్లింప్స్ కోసం సంగీత దర్శకుడు ఏఆర్ రెహ్మాన్ ప్రత్యేకంగా నేపథ్య సంగీతాన్ని సిద్ధం చేసినట్టు టాక్. అభిమానుల కోసం చరణ్ ఇదే నిజమైన పండుగ కానుక అని చెప్పొచ్చు. అలాగే చరణ్ నెక్స్ట్ సుకుమార్ దర్శకత్వంలో కూడా ఒక సినిమా చేయనున్న విషయం తెలిసిందే.

# ఈ రెండు చిత్రాల్లో నాది గెస్ట్ రోల్

ఇటీవల రామ్ గోపాల్ వర్మ, సందీప్ రెడ్డి వంగ ఒక కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆ సమయంలో సందీప్ రెడ్డి వంగ సినిమా మేకింగ్‌పై వర్మ ప్రశంసలు కురిపించాడు. అంతే కాకుండా సోషల్ మీడియా ద్వారా కూడా సందీప్ సినిమాల గురించి, ఆయన ఫిల్మ్ మేకింగ్ గురించి ప్రముఖంగా వ్యాఖ్యలు చేశాడు. సందీప్ సినిమాలో నటించేందుకు రెడీ అన్నట్లుగా ఒక సందర్భంలో వర్మ చెప్పుకొచ్చాడు. అప్పటి ఉంచి సందీప్ వంగ తదుపరి సినిమా స్పిరిట్‌లో వర్మ నటించబోతున్నాడు అనే వార్తలు పెద్ద ఎత్తున వస్తున్నాయి. ప్రభాస్ గత చిత్రం కల్కి 2898 ఏడీలో వర్మ గెస్ట్ అప్పియరెన్స్ ఇచ్చిన విషయం తెల్సిందే. ఇప్పుడు స్పిరిట్ సినిమాలోనూ సందీప్ వంగ కోసం వర్మ గెస్ట్‌గా మారబోతున్నాడని పుకార్లు షికార్లు చేస్తున్నాయి.

స్పిరిట్ సినిమాలో నటించబోతున్నట్లు వస్తున్న వార్తలపై వర్మ స్పందించాడు. ఇటీవల ఒక ఇంటర్వ్యూలో రామ్ గోపాల్ వర్మ మాట్లాడుతూ... స్పిరిట్ సినిమాలో నేను నటించబోతున్నట్లు వస్తున్న వార్తల్లో నిజం లేదు. స్పిరిట్



సినిమాలో నటించమని సందీప్ ఇప్పటి వరకు నన్ను అడగలేదు. ఆ సినిమాకు సంబంధించిన ఎలాంటి విషయాలు నాకు తెలియదు. సందీప్ ఎప్పుడూ ఆ సినిమా గురించి నా వద్ద మాట్లాడలేదు అని క్లారిటీ ఇచ్చాడు. ఇంకా స్పిరిట్ సినిమా షూటింగ్ ప్రారంభం కాలేదు. ప్రభాస్ ఇతర ప్రాజెక్ట్‌లతో బిజీగా ఉన్న కారణంగా స్పిరిట్ సినిమా షూటింగ్ ఆలస్యం అవుతుంది. ఒకవేళ సినిమా షూటింగ్ ప్రారంభం అయిన తర్వాత ఏమైనా వర్మను సందీప్ సంప్రదిస్తాడేమో చూడాలి.

# 'సింగిల్' ఫస్ట్ సాంగ్ ఎ రొమాంటిక్ మెలోడీ రిలీజ్



కింగ్ ఆఫ్ ఎంటర్టైన్మెంట్ శ్రీ విష్ణు ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థ గీతా ఆర్ట్స్ బ్యానర్ లో హోల్సమ్ ఎంటం ్టైనర్ చసింగిల్‌తో అలరించబోతున్నారు. ఈ చిత్రానికి కార్తీక్ రాజు దర్శకత్వం వహించారు. గీతా ఆర్ట్స్ మెగా ప్రొడ్యూసర్ అల్లు అరవింద్ సమర్పణలో కళ్యా ఫిల్మ్స్‌తో కలిసి చిత్రాన్ని విద్యా కొప్పినీడి, భాను ప్రతాప, రియాజ్ చౌదరి నిర్మిస్తున్నారు. వేసవిలో విడుదల కానున్న ఈ చిత్రం నుంచి మేకర్స్ ఫస్ట్ సింగిల్– శిల్పి ఎవరో రిలీజ్ చేయడంతో మ్యూజిక్ ప్రమోషన్స్ ని స్టార్ట్ చేశారు. విశాల్ చంద్ర శేఖర్ సంగీత దర్శకుడిగా తన వెర్సటాలిటీని ప్రజెంట్ చేసే ఒక సోల్ ఫుల్ రొమాంటిక్ మెలోడీని కంపోజ్ చేశారు. శ్రీమణి రాసిన సాహిత్యం, హీరో శ్రీ విష్ణు తన జీవితంలోని ఇద్దరు స్పెషల్ అమ్మాయిలు కేతిక శర్మ, ఇవానా అందం పట్ల ప్రశంసలను కురిపిస్తూ పాట ఆకర్షణను పెంచుతుంది.

యాజిన్ నిజార్ సోల్ ఫుల్ వోకల్స్ తో సాంగ్‌ని అద్భుతంగా అలపించారు. బ్యూటీఫుల్ విజువల్స్ తో కూడిన ఈ సాంగ్ లో శ్రీ విష్ణు క్యారెక్టర్ చార్మ్ అద్భుతంగా వుంది. శిల్పి ఎవరో యువతకు ఇన్స్టంట్ గా కనెక్ట్ అవుతోంది. మోడరన్ వైబ్, థీమ్ యూత్ ని మెస్మరైజ్ చేశాలా వున్నాయి.

# ఎలాంటి సమస్యైనా తగ్గేదేలే

**ఎలాంటి సమస్యనైనా, ఎన్ని ఇబ్బందులనైనా ధైర్యం, సంకల్పంతో ఎదుర్కోవచ్చని చాటి చెప్తు న్నారు సౌత్ హీరోయిన్లు. కేవలం ఆన్ స్క్రీన్ పైనే కాదు, ఆఫ్ స్క్రీన్‌లో కూడా తాము స్ట్రాంగే అని నిరూపిస్తున్నారు మన హీరోయిన్లు. వారిలో నభా నటేష్, రకుల్ ప్రీత్ సింగ్, సమంత, రష్మిక ఉన్నారు. ఒక ఆరు నెలల ముందు జిమ్‌లో 80 కేజీలు బరువు లిఫ్ట్ చేస్తున్నప్పుడు అనుకోకుండా గాయపడింది రకుల్ ప్రీత్ సింగ్.**



చిన్న గాయమే కదా తగ్గిపోతుందనుకుని ముందు దాన్ని అశ్రద్ధ చేసిందట రకుల్. కానీ ఉండే కొద్దీ ఆ ప్రాబ్లమ్ చాలా పెద్దదైందని, దాని వల్ల ట్రీట్‌మెంట్ తీసుకోవాల్సి వచ్చిందని, ఆరు



నెలలుగా ఈ సమస్యతో ఇబ్బంది పడుతున్నప్పటికీ ఇంకా పూర్తిగా కోలుకోలేదని చెప్తోంది. అయితే దాని తీవ్రత గతంలో కంటే ఇప్పుడు కాస్త తగ్గిందని, మెల్లిగా ఇప్పుడు తన పనులు తాను చేసుకో గలుగుతున్నానని, అన్నీ సిట్యుయేషన్స్ మనకు అనుకూలంగానే ఉండవని, కొన్నిసార్లు మన మైండ్, బాడీ మనకు ఏవో చెప్పడానికి ట్రై చేస్తాయని వాటిని వింటూ ఆ దారిలో నడవాలని ఏదీ అతిగా చేయకూడదని, అప్పుడే మంచి ఆరోగ్యం దక్కుతుందని రకుల్ ప్రీత్ సింగ్ తెలిపింది. సురేష్ గోపి ఫుల్ ఫైర్.. నన్ను దోచుకుందువటే సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన నభా నటేష్ కొన్నాళ్ల కిందట యాక్సిడెంట్‌కు గురై తీవ్రంగా గాయపడింది. దీంతో సినిమాలకు దూరమవాల్సి వచ్చింది నభా. ఇప్పుడు ఆ గాయం నుంచి కోలుకున్న నభా, మళ్లీ వరుస సిని మాలతో అలరించడానికి రెడీ అవుతోంది. రెస్ట్ తీసుకున్న టైమ్ లో సమయం విలువ తెలిసిందని, ఆ టైమ్ లో ఎన్నో విషయాలు నేర్చుకున్నానని నభా తెలిపింది. ఇక సమంత మయోసైటిస్ సమస్యతో ఎంత ఇబ్బంది పడిందో అందరికీ తెలుసు. ఆ వ్యాధికి ట్రీట్‌మెంట్ తీసుకోవడానికే సమంత సినిమాల నుంచి గ్యాప్ కూడా తీసుకుంది. సిటాడెల్ సెట్స్‌లో ఆ వ్యాధి వల్ల ఎన్నోసార్లు స్పృహ తప్పి పడిపోయిందట సమంత. ఎలాగైనా ఆ ప్రాజెక్టు పూర్తైతే చాలని ఎన్నో సార్లు అనుకున్నానని చెప్తున్న సమంత ఇప్పుడు ఆ సమస్య నుంచి పూర్తిగా కోలుకుని వరుస ప్రాజె క్టులతో బిజీ అవుతూ నిర్మాతగా కూడా కొత్త వ్యాపారాన్ని మొదలుపెట్టి సత్తా చాటాలని చూస్తుంది. మీకు తెలుసా.. సాయిరామ్ శంకర్‌తో మొదలైన 'చిరుత' వీరంతా





ఒకెత్తయితే రష్మిక మరింత స్పెషల్. కాలికి గాయమైనా కట్టు కట్టుకుని, నడవలేకపోయినా తన పని తాను చేసుకుంటూ వెళ్లుంది. నడవలేని సిట్యుయేషన్ లో ఉన్నా వీల్ ఛైర్ లో ఉండి కూడా సినిమా ప్రమోషన్స్ కు హాజరై అందరినీ ఆశ్చర్యపరించి. ఆ కాలి గాయం మరో 9 నెలల పాటూ అంతే ఉంటుందని, అందుకే అది తగ్గేవరకు వెయిట్ చేయకుండా కమిట్ అయిన వర్క్ ను పూర్తి చేస్తున్నానని రష్మిక అంటోంది. కాలు బాలేకపోయినా రష్మిక ప్రమోషన్స్ లో పాల్గొంటున్న తీరు అందరినీ ఇన్‌స్పైర్ చేస్తుందని రీసెంట్ గా సల్మాన్ ఖాన్ కూడా ఆమెను పొగిడిన సంగతి తెలిసిందే.

# విశ్వంభర లో నటుడు ప్రవీణ్ కల నెరవేరింది



తెలుగు సినిమా ఇండస్ట్రీలో ఈ తరం నటులు, దర్శకులు, టెక్నిషియన్స్‌లో చాలా శాతం మంది అభిమాన హీరో మెగాస్టార్ చిరంజీవి అనటంలో అతిశయెక్తి లేదు. దిల్‌రాజు నిర్మించిన కొత్తబంగారులోకం చిత్రం నుండి కొత్త టాలెంట్ ఆర్టిస్ట్‌గా ప్రవీణ్ తన నట జీవితాన్ని మెదలు పెట్టారు.. ఆ చిత్రం తరువాత చాలా చిత్రాల్లో గొదారి స్లాంగ్‌తొ కామెడి చేసి తెలుగు ప్రేక్షకుల్ని అలరించాడు. దర్శకుడు మారుతి దర్శకత్వం లొ ప్రేమ కథా చిత్రమ్‌లొ మరొక్క సారి ప్రేక్షకుల్ని తన నటనతొ తన టైమింగ్ కామెడి తొ నవ్వించాడు. అంతేకాదు దాదాపు ప్రతి చిత్రం విభిన్న పాత్రలు చేసి ప్రేక్షకుల్ని మెప్పించాడు. ప్రవీణ్ స్వతహాగా మెగాస్టార్ అభిమాని, కాని మెగాస్టార్‌తో ఖైదీ నెంబర్ 150, వాల్తేరు వీరయ్యలో నటించిన ఆశించినంత స్కీన్ స్పేస్ రాలేదు.. ఎవరు ఊహించని విధంగా విశ్వంభర చిత్రంలో .. దాదాపు మెగాస్టార్ తొ ఎక్కువ స్కీన్ స్పేస్ పంచుకుని అవకాశం దక్కింది. దానికి ప్రవీణ్ ఆనందానికి అవధులు లేవు. అంతేకాదు మెగాస్టార్ తొ తన అభిమాన ముచ్చట్లు షాట్ గ్యాప్‌లొ పంచుకున్నాడని ఆయనతొ యాక్ట్ చేయడం అంటే అది తన అదృష్టంగా భావిస్తున్నానని తెలిపాడు. కేవలం నటించే అవకాశమే కాదు ఆయనతొ కామెడి చేసే ఛాన్స్ వచ్చిందని రేపు థియొటర్స్ ఆ కామెడి చూసి ప్రేక్షకులు నవ్వుకుంటారని తెలిపాడు.

# 'ఒక బృందావనం' లిరికల్ సాంగ్

ఈ మధ్య కాలంలో హృదయానికి హత్తుకునే సాహిత్యంతో.. మనసును తాకే స్వరాలతో.. మైమరిపించే నేపథ్య గానంతో వచ్చే పాటలు చాలా అరుదుగా ఉంటున్నాయి. సరిగ్గా ఇలాంటి ఓ బ్యూటిఫుల్ అండ్ హార్ట్‌టచ్చింగ్ సాంగ్ ఒకటి 'ఒక బృందావనం' నుంచి విడుదలైంది. పసి పసి తనమే...ఎలా.. పరుగులు తీసే ఏరులా అని కొనసాగే ఈ పాటకు ప్రముఖ గీత రచయిత ఆస్కార్ అవార్డ్ విన్నర్ చంద్రబోస్ సాహిత్యాన్ని అందించారు. చిన్మయ శ్రీపాద ఆలపించిన ఈ పాటకు సన్ని అండ్ సాకేత్ స్వరాలను అందించారు. నూతన నటీనటులు బాలు, షిన్నోవాలతో పాటు శుభలేక శుధాకర్, అన్నపూర్ణమ్మ, శివాజీ రాజా, రూప లక్ష్మి, సాన్విత, కళ్యాణి రాజు, మహేంద్ర, డి.డి. శ్రీనివాస్ మరియు ఇతర సీనియర్ నటీనటులు ఈ చిత్రంలో నటించారు! బొత్స సత్య దర్శకత్వంలో కిషోర్ తాటికొండ, వెంకట్ రేగట్టే, ప్రహ్లద్ బొమ్మినేని, మనోజ్ ఇందుపూరు ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ '' అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించే లక్ష్యంతో ఓ వైవిధ్యమైన కాన్సెప్ట్‌తో రాబోతున్న చిత్రమిది. తాజాగా విడుదల చేసిన ఈ పాట అందరి హృదయాలకు హత్తుకుంటుంది. ఎంతో హాయిగా కొనసాగే ఈ పాట థియేటర్‌లో ప్రేక్షకులకు కూడా మంచి అనుభూతినిస్తుంది. ఈ చిత్రంలో వినోదంతో పాటు మంచి అర్ధవంతమైన సందేశాన్ని కూడా ఈ చిత్రంలో జోడించాం. నిర్మాణానంతర పనులు జరుపుకుంటోన్న మా చిత్రం ఆడియోను ఆదిత్య మ్యూజిక్ ద్వారా విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం. త్వరలోనేట్రైలర్‌ను తీసుకవస్తాం. తప్పకుండా కొత్తదనం కోరుకునే ఆడియన్స్‌కు మా చిత్రం తప్పకుండా నచ్చుతుంది' అన్నారు.



PRINTED & PUBLISHED BY NUKARAPU PADMAJA ON BEHALF OF SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. PRINTED AT SPR PRINTING PRESS, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081, TELANGANA, PUBLISHED AT SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR,NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. EDITOR : NUKARAPU PADMAJA. Fax No:040-30473232 RNI Registration No. APTEL/2007/22044